9-12Pg1exHMNWJQE 1 VJA_9-12Pg1exHMNWJQE.qxd 09/Dec/25 1:03 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

విజయవాడ

fb.com/vaartha Digital


మీ ఆర్థిక అవసరాల ఆశయసాధన
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-12-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 308 పేజీలు: 12 వెల: 6.50

# విధ్వంసం నుండి అభివృద్ధిలోకి

**వ్యవస్థలను మళ్లీ దారిలోకి తెస్తున్నాం**
**కేంద్ర జిడిపి కంటే రాష్ట్రంలో వృద్ధిరేటు అధికం**
**పరిశ్రమల రంగంలో 12.20%, సేవల రంగంలో 11.30% వృద్ధి**
**సుపరిపాలన, సూపర్ సిక్స్‌తో సంక్షేమం: సిఎం చంద్రబాబు**



**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** విధ్వంసమైన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి అనేక విజయాలను చవిచూసినప్పటికి 2024 విజయం నమ్మకం, విశ్వాసంమీద వచ్చిందనితెలిపారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్నారు. పరీక్ష రాసినప్పుడు పిల్లలు ఎంత టెన్షన్‌గా ఉంటారో తాము అంతే టెన్షన్‌గా ఉంటామని చెప్పుకొచ్చారు. జిఎస్డీపీ విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షి ంచుకుంటున్నా మని తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ నిర్వా కంతో ఐదేళ్లపాటు అభివృద్ధి ఆగిపోయిందని, ఆదాయం తగ్గిపోయిందని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం ఓ వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సోమవారం సచివాల యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పలు అంశాలను ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. గత ప్రభుత్వం కేంద్ర పథకాల్లో అవకతవకలకు పాల్పడిందని, కేంద్ర నిధులను ఇతర పథకాలకు మళ్లించిందని అన్నారు. అదేవిధంగా కక్షపూరిత రాజకీయాలతో గత పాలకులు ప్రజాధనాన్ని నష్టం చేశారని చంద్రబాబు ధ్వజమెత్తారు.

2024-19 మధ్య 13.5 శాతంగా ఉన్న వృద్ధిరేటు 2019-24 మధ్య కాలంలో 10.32 శాతానికి పడిపోయిందని తెలిపారు. గత ప్రభుత్వం వారసత్వంగా ఇచ్చి వెళ్లిన 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించడానికే ఎక్కువ సమయం పడుతోందన్నారు. జనవరి 1 నాటికి ఎక్కడా చెత్త లేకుండా చేయాలని లక్ష ్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతీ త్రైమాసికం, ఆర్థిక సంవత్సరంలో సాధిస్తున్న రాష్ట్రస్థూల ఉత్పత్తిని ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తున్నామన్నారు. ప్రజల కోసం ఎంత కష్ట మైనా సరే బాధ్యత తీసుకుని అభివృద్ధి చేస్తామని సిఎం చంద్రబాబు స్పష్టంచేశారు. ఆస్తులను, భవి ష్యత్ ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి గతంలో అప్పులు తెచ్చారన్న ఆయన, మూలధన వ్యయం చేయకపోవటంతో గతంలో ఎక్కడా ప్రాజెక్టులు ముందుకు వెళ్లలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాకే వాటిని ముందుకు తీసుకు వెళ్లగలిగామన్నారు. స్వల్ప,మధ్య, దీర్ఘకాలిక ప్రాజె క్టులపై మూల ధన వ్యయాన్ని గణనీయంగా పెంచి ప్రాజెక్టులు చేపట్టామని చంద్రబాబు తెలిపారు.

**తొలి, రెండో త్రైమాసికం ఫలితాలు విడుదల**

అలాగే 2025-26 తొలి అర్ధ సంవత్సరం (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్), >>2

# వందేమాతరం.. భారత్ వికాస మంత్రం



- స్వాతంత్ర్య ఉద్యమానికి ఆ గీతమే ప్రేరణ
- నేటి తరానికి అదే నిరంతర స్ఫూర్తి
- లోక్‌సభ ప్రత్యేక చర్చలో ప్రధాని మోడీ
- జాతీయగీతాన్ని నెహ్రూ ముక్కలు చేశారని విమర్శ
- ఎమర్జెన్సీని చీకటి అధ్యాయమన్న ప్రధాని
- కాంగ్రెస్ సభ్యుల తీవ్ర అభ్యంతరం
- ఆందోళనల మధ్యే కొనసాగిన ప్రధాని ప్రసంగం

**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** వందేమాతర మంత్రం స్వాతంత్ర్య సమరోత్సాహ సమయంలో యావత్ దేశ ప్రజలకు శక్తిని, ప్రేరణను ఇచ్చింది. వందేమాతరం కేవలం రాజకీయ స్వేచ్ఛ కోసం జపించిన మంత్రం కాదని, భరత మాతను వలసవాద అవశేషాల నుంచి విముక్తి చేయడానికి రూపొందించిన పవిత్ర యుద్ధ నినాదమని ప్రధాని మోడీ అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలపై లోక్‌సభలో ప్రధాని మోడీ ప్రత్యేక చర్చ ప్రారంభించిన ఆయన, యేడాది పొడవునా వందేమాతరం వేడుకలు జరుపుకొంటున్నట్లు వివరించారు. ఇవాళ్టి చర్చలు భవిష్యత్తు తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్న ప్రధాని, స్వాతంత్ర్య ఉద్యమానికి శక్తి, ప్రేరణనను ఇచ్చిన వందేమాతరం 150 ఏళ్ల వేడుకల్లో మనం భాగం కావడం గర్వకారణమన్నారు. వందేమాతరం.. ఆజాద్ భారత్‌కు విజన్‌గా మారిందని వెల్లడించారు. >>2

# సంక్రాంతినుంచి అన్ని సేవలు ఆన్‌లైన్

## డ్రోన్ సేవలు మరింత విస్తృత పరచాలి: ఆర్టీజిఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** వచ్చే సంక్రాంతి నుంచి రాష్ట్రంలో పౌరులకు అన్ని సేవలూ ఆన్‌లైన్‌లోనే అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ దిశగా ఆయా శాఖలన్నీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీజీఎస్‌పై సిఎం సోమవారం సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి నుంచి ప్రజలకు అన్ని సేవలు ఆన్ లైన్‌లోనే అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో సేవలు అందించడం ద్వారా ప్రజలకు సేవలు పారదర్శకంగా అందడంతో పాటు వారిలో ప్రభుత్వ పని తీరు పట్ల సంతృప్త స్థాయి పెరుగుతుందన్నారు.

ఇప్పటికీ కొన్ని శాఖలు భౌతికంగానే సేవలందిస్తున్నాయని అలాంటి శాఖలు వెంటనే తమ పంథా మార్చుకుని ప్రజలకు ఆన్‌లైన్‌లో సేవలందించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలకు కావాల్సి న ప్రభుత్వ సేవలన్నీ, ప్రభుత్వ కార్యాలయాలకు తిరగనవసరం లేకుండా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందజేస్తున్నామని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చెప్పారు. రిజిస్ట్రేషన్ల అనంతరం డాక్యుమెంట్లు కొరియర్ ద్వారా నేరుగా సంబంధిత వ్యక్తుల ఇళ్లకే పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్టీసీ సేవలు మరింత మెరుగయ్యేలా చూడాలన్నారు. బస్టాండు ప్రాంగణం, పరిసరాలు, టాయ్‌లెట్ల వద్ద పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు ఉండాలని సీఎం అన్నారు. డ్రోన్ సేవలు మరింత విస్తృత పరిచాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

భవిష్యత్తులో డ్రోన్ల ఉపయోగం గణనీయంగా పెరుగుతుందన్నారు. పురుగు మందుల వినియోగం తగ్గించేందుకు డ్రోన్లను ఎలా వాడుకోవచ్చోననే అంశంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్యం నిర్వహణ ద్వారా వ్యాధుల వ్యాప్తి లేకుండా చేయవచ్చని తెలిపారు. కొన్ని జిల్లాల్లో కొంతమంది అధికారులు మంచి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని... అలాగే కొందరు అవలంభించే మంచి పద్ధతులను గుర్తించి మిగిలిన జిల్లాల్లో కూడా అమలయ్యేలా చూడాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**పి4 జీరో పావర్టీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష..**

పి4జీరో పావర్టీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష అధికారులతో సమీక్షను నిర్వహించారు.పి4 అమల్లో బంగారు కుటుంబాలకు అవసరమైన సాయంపై నిర్వహించిన సర్వేపై అధికారులతో సిఎం సమీక్షలో పలు అంశాలపై మార్గదర్శకాలు చేసారు. మార్గదర్శకులు ఈ కార్యక్రమంలో మరింతగా ముందుకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.పి4 సర్వేలో వైద్యసాయం, ఉద్యోగం, చిరు వ్యాపారాల విస్తరణ, వ్యవసాయం, నూతన ఆవిష్కరణలు, ఉన్నత విద్య, నైపుణ్యాల పెంపుపై సాయం >>2

## ఇండిగోదే తప్పు : సిఎం చంద్రబాబు నాయుడు 2లో

# నిరుపయోగ స్థలాలు ఇక వాడకం

## వాటినుంచి ఆదాయం పొందేలా ప్రణాళికలు: ప్రభుత్వం

**విజయవాడ, డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.ఈ నిర్ణయాన్ని అనుసరించి రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న పట్టణ. నగరపాలక సంస్థలకు చెందిన విలువైన భూములు, స్థలాలు వినియోగంలోకి రానున్నాయి. వీటి ద్వారా ఆదాయం పొందేలా పట్టణ .నగర అభివృద్ధిశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి)లో వీటిని నివాస, వాణిజ్య అవసరాలకు కేటాయించనున్నారు.

రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలు, 17 పట్టణ అభివృద్ధి సంస్థలకు వేల ఎకరాల్లో భూములు, భవనాలు ఉన్నాయి. ఇవి ఆక్రమణలకు గురవుతున్నాయి. భవనాలు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వీటిని గుర్తించి పిపిపి విధానంలోనే కేటాయించనున్నారు. ఇప్పటికే ఆరు పట్టణాభివృద్ధి సంస్థల్లో 685.81 ఎకరాల భూములను అధికారులు గుర్తించారు. వీటిలో వివిధ వ్యాపారాల నిర్వహణ జరిగే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. ఇందుకుగానూ ఆసక్తి గల సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నారు. దీనికి సంబంధించి నెలాఖరుకు మరో 10 పట్టణాభివృద్ధి సంస్థల్లో భూములు సిద్ధం చేయనున్నారు.

**ఖాళీ స్థలాల గుర్తింపు:**

పట్టణ స్థానిక సంస్థలు ప్రభుత్వంపై ఆధారపడకుండా ఉన్న వనరుల సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా ఆదాయం సాధించాలి. దీనికి సంబంధించి సిఎం చంద్రబాబు ఆదేశాలు జారీచేశారు. పురపాలక, పట్టణాభి >>2

## గూడ్స్ రవాణా బంద్! నేటి నుంచి లారీ యజమానుల ఆందోళన

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి లారీ యజమానుల సంఘం ఆందోళన బాట పట్టింది. వాహనాల టెస్టింగ్, ఫిట్‌నెస్ ఫీజులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్ణయానికి నిరసనగా.. డిసెంబరు 9 నుంచి షిప్ యార్డులు, రైల్వే షెడ్లలో గూడ్స్ రవాణా నిలిపివేస్తామని ఎపి లారీఓనర్ల సంఘం హెచ్చరించింది. 13 ఏళ్ల దాటిన వాహనాల టెస్టింగ్, ఫిట్‌నెస్ ఫీజులను కేంద్రం ఇటీవల పెంచింది. ఆ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఈ ఫీజులను తగ్గించాలని లారీ యజమానులు కోరుతున్నారు. కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ వెంటనే నిలుపుదల చేయాలని కోరుతున్నారు. నోటిఫికేషన్ నిలుపుదల చేయక పోతే మంగళవారం అర్ధరాత్రినుంచి షిప్ యార్డులు, రైల్వేషెడ్లలో గూడ్స్ రవాణా నిలిపివేస్తామని హెచ్చరించారు. మరోవైపు వాహనాల టెస్టింగ్, ఫిట్‌నెస్ ఫీజులపై కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్ నిలిపి >>2

## నకిలీ మద్యం కేసు నలుగురు నిందితులు అబ్కారీ కస్టడీకి

**విజయవాడ, డిసెంబరు 8, ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో నలుగురు నిందితులను కస్టడీకి అప్పగిస్తూ విజయవాడ కోర్టుఆదేశాలు జారీ చేసింది. అబ్కారీ అధికారులు నిందితులను పదిరోజులు తమ కస్టడీకి పంపాలని కోర్టును అభ్యర్థించగా.. న్యాయస్థానం అంగీకరించింది. కోర్టు ఆదేశాల మేరకు నిందితులు.. కట్టా రాజు, సయ్యజ్ హజీ, అంథా దాస్, మిథున్ దాస్‌లను ఈ నెల 11 >>2



సోమవారం ఆలయ దోపిడి వివరాలను మీడియాకు వివరిస్తున్న డిఎస్పీ శివనారాయణ స్వామి

# ఇఒ చోరీ ఘటనపై సిఎం సీరియస్

## సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

## మురళీకృష్ణను అరెస్టు చేసిన పోలీసులు

**కదిరి, డిసెంబరు 8 ప్రభాతవార్త:** కదిరి రూరల్ పరిధిలోని గంగమ్మ గుడిలో విలువైన వస్తువులను ఇఒనే చోరీ చేసిన ఘటనపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఇఒ మురళీకృష్ణను సస్పెన్షన్ చేస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయంలోని వెండి ఆభరణాలు, విలువైన చీరలతో సహా ఇతరాత్ర విలువైన వస్తువులను అదే దేవాలయంలో ఎగ్జిక్యూటివ్ అధికారిగా విధులు నిర్వహించే మురళీకృష్ణ, కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో తీసుకెళ్తూ రెడ్ హ్యాండెడ్‌గా గ్రామస్తులకు దొరికిపోయాడు. ఆలయ ఇఒ ఇలాంటిఘటనకు పాల్పడటంపై సిఎం చంద్రబాబునాయుడు >>2

## జనవరి 19న దావోస్‌కు సిఎం చంద్రబాబు 2లో

### ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూలు ఖరారు

మీ పాత బ్యాంక్ అకౌంట్స్‌లో ఉన్న డబ్బుని మర్చిపోయారా?



మీ సొమ్ముని తిరిగి పొందడానికి ఆర్‌బిఐ మీకు సహాయపడుతుంది.

మీ బ్యాంకులో ఉన్న (2 సంవత్సరాలకు పైగా మరియు 10 సంవత్సరాల వరకు నిష్క్రియంగా ఉన్న) ఉపయోగంలో లేని ఖాతాలలోని డబ్బు / క్లెయిమ్ చేయని డిపాజిట్లు (10 సంవత్సరాలకు పైగా) ఆర్‌బిఐ యొక్క డిఇఏ ఫండ్‌కి బదిలీ చేయబడుతుంది. మీరు లేదా మీ చట్టపరమైన వారసులు ఎప్పుడైనా దాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు.

మీ డబ్బును క్లెయిమ్ చేసుకోవడానికి 3 సులభమైన విధానాలు

1. మీ రెగ్యులర్ బ్రాంచ్ కాకపోయినా, ఏదైనా మీ బ్యాంక్ బ్రాంచ్‌ని సంప్రదించండి.
2. కెవైసి పత్రాలతో (ఆధార్, పాస్‌పోర్ట్, ఓటరు ఐడి లేదా డ్రైవింగ్ లైసెన్స్) ఫారమ్‌ను సమర్పించండి.
3. ధృవీకరణ తర్వాత మీ డబ్బును వడ్డీతో సహా స్వీకరించండి.


అక్టోబర్ నుండి డిసెంబర్ 2025 వరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహించబడుతున్న అన్‌క్లెయిమ్డ్ ఆస్తులపై ప్రత్యేక శిబిరాలను సందర్శించండి.




మీ క్లెయిమ్ చేయని డిపాజిట్లను కనుగొనడానికి
మీ బ్యాంక్ వెబ్‌సైట్‌లో వెతకండి లేదా ప్రస్తుతం 30 బ్యాంకులను కలిగి ఉన్న ఆర్‌బిఐ యొక్క UDGAM పోర్టల్ (https://udgam.rbi.org.in) లో చూడండి.

మరిన్ని వివరాల కోసం, https://rbikehtahai.rbi.org.inని సందర్శించండి
అభిప్రాయం కోసం, rbikehtahai@rbi.org.inకు వ్రాయండి.
క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయండి
అధికారిక వాట్సాప్ నం. 9999041935

ప్రజా హితార్థం జారీ చేయబడింది
भारतीय रिज़र्व बैंक
RESERVE BANK OF INDIA
www.rbi.org.in



సోమవారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో ప్రయాణికుల లగేజి బ్యాగ్‌లు

# ఇండిగోదే తప్పు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నిబంధనలు పాటించకపోవడం వల్ల విమానాల రద్దు, ప్రయాణికుల ఇబ్బందులు ఏర్పడ్డాయని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు అన్నారు. ఇది ఎయిర్‌లైన్ మేనేజ్‌మెంట్ లోపమని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఎపి సెక్రటేరియట్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో ఇండిగో ఎయిర్‌లైన్స్ సంక్షోభంపై స్పందించారు. డిజిసిఎ వ్యవధి ఇచ్చినా ప్రమాణాలను ఇండిగో పాటించలేదు. దీంతో విమానాలు రద్దు అయ్యాయి, ఇబ్బందులు వచ్చాయి. క్షమాపణలు చెప్పినా ప్రయాణికులకు అసౌకర్యం కలిగిందని అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. నా హెలికాప్టర్ కూడా నిబంధనల మేరకు కొన్ని గంటలే ప్రయాణం చేస్తుందని గుర్తు చేశారు. తాము ఈ వ్యవహారాన్ని పర్యవేక్షి ంచడం లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. జాతీయ మీడియాతో మాట్లాడిన ఓ టిడిపి నేత.. నారా లోకేష్ కూడా మానిటర్ చేస్తున్నారని చెప్పడం వివాదాస్పదమయింది. ఈ అంశంపై చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. తాము మానిటర్ చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని త్వరలోనే పరిష్కరిస్తుందన్నారు.



ఇఒ నుంచి స్వాధీనం చేసుకున్న వెండి, బంగారు, చీరెలు

# రూ.827 కోట్లు రిఫండ్

## ఖచ్చితమైన కారణాలు ఇప్పుడే చెప్పలేం: ఇండిగో

## అంతర్గత సమస్యలతోనే సంక్షోభం: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** ఇండిగో విమానాల టికెట్ల రీఫండ్‌కు సంబంధించి కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ కీలక వివరాలు వెల్లడించింది. సంక్షోభం కారణంగా రద్దైన, ఆలస్యమైన విమానాల టికెట్ల రిఫండ్‌కు సంబంధించి ఇప్పటి వరకూ రూ.827 కోట్లను ఇండిగో చెల్లించినట్లు ప్రకటించింది. రెండు వారాల్లోనే ఈ మొత్తం రిఫండ్ చేసినట్లు తెలిపింది. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 7 మధ్య రెండువారాల్లో మొత్తం 9,55, 591 టికెట్ల రద్దకు సంబంధించి రూ.827 కోట్లను తిరిగి చెల్లించినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 7 మధ్య ఆరు లక్షల టిక్కెట్ల రద్దుకు సంబంధించి రూ.569 కోట్లను తిరిగి రీఫండ్ చేసినట్లు తెలిపాయి. 9,000 బ్యాగుల్లో ప్రభావిత ప్రయాణికులకు ఇప్పటి వరకూ 4,500 సామగ్రిని ఇండిగో తిరిగి ఇచ్చినట్లు పేర్కొన్నాయి. రాబోయే 36 గంటల్లో బ్యాలెన్స్ బ్యాగులను డెలివరీ చేయడమే లక్ష్యంగా ఉన్నట్లు ఎయిర్‌లైన్స్ వర్గాలు వెల్లడించాయి.

**మరికొంత గడువు కావాలి....**

విమానసర్వీసుల అంతరాయంపూ వివరణ ఇవ్వాలని డిజిసిఎ జారీచేసిన షోకాజ్‌నోటీసులకు ఇండిగో స్పందించింది. తాముచేసిన పొరపాటుకు క్షమాపణలుచెపుతున్నామని వివరించింది. ఖచ్చితమైన కారణాలు గుర్తిం చేందుకు మరికొంత సమయం కావాలనికోరింది. కొన్ని ప్రాథమిక కారణా లను అదిస్తున్నట్లు డిజిసిఎకువివరించింది. సిఇఒ, సిఒఒ సంతకాలతో కూడిన వివరణ సోమవారం డిజిసిఎకు అందించింది. పరిస్థితి సంక్లిష్టత, కార్యకలాపాలను విస్తరించిన దృష్ట్యా కచ్చితమైన కారణాలను స్పష్టంగా చెప్పలేమని తెలిపింద.ఇ మూల కారణాలు విశ్లేషించేందుకు తమకు మరింత గడువుకావాలని కోరింది. మాన్యువల్‌లో షోకాజ్ నోటీసుకు 15 రోజుల గడువు ఉందని గుర్తుచేసింది. ఆర్‌సిఎ పూర్తి అయిన వెంటనే వివరాలు అందచేస్తామని ఇండిగో తెలిపింది.

**అంతర్గత సమస్యలతోనే ఇండిగో సంక్షోభం**

అంతర్గత సమస్యలతోనే ఈ ఇండిగో సంక్షోభం తలెత్తినట్లు కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. పార్లమెంట్ శీతాకాలసమావేశాల సందర్భంగా రాజ్యసభలో ఎంపీ ప్రమోద్ తివారీ లేవనెత్తిన ప్రశ్నకు రామ్మోహన్ నాయుడు సమాధానమిచ్చారు. ఇండిగో సంక్షోభాన్ని తేలిగ్గా తీసుకోవడంలేదు. దీనిపై ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాం. పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. సమస్య పరిష్కారానికి వెంటనే అప్రమత్తం చేశాం. ఇండిగో సంక్షోభానికి దాని సిబ్బంది రోస్టరింగ్, అంతర్గత ప్రణాళిక వ్యవస్థలోని సమస్యలే కారణం. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నియమాలతో ఎలాంటి సమస్యలూ లేవు. అందరితో చర్చించాకే ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను రూపొందించాం. నెలవరకూ సజావుగానే విమాన సర్వీసులు నడిచాయి. ఈనెల 1న జరిగిన సమావేశంలోనూ ఇండిగో ఎలాంటి సమస్యనూ లేవనెత్తలేదు. మూడవతేదీనుంచే సమస్య మొదలైంది. ఇండిగో విమానాలరద్దు, ఆలస్యం కారణంగా లక్షలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయాణికులకు కలిగిన ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాం అని అన్నారు. అదేవిధంగా ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో టికెట్ ధరలు పెంచకుండా పరిమితి విధించినట్లు ఆయన తెలిపారు.

# అన్ని సేవలు ఆన్‌లైన్

>> కోరిన బంగారు కుటుంబాలకు ఆ దిశలో మార్గదర్శకుల నుంచి సాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పేదరిక నిర్మూలన దిశలో మనం చేపట్టిన ఈ కార్యక్రమం ఇప్పటికే మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. 10లక్షలకు పైగా మార్గదర్శకులు ఈ కార్యక్రమంలోకి రావాలనే లక్ష్యదిశను అధిగమించడంతో పాటు ఇప్పటికే ఉన్న బంగారు కుటుంబాలతో పాటు రెట్టింపు సంఖ్యలో కుటుంబాల అవసరతల తీరాలన్నారు.

# జనవరి 19న దావోస్‌కు సిఎం చంద్రబాబు

**విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. వచ్చే ఏడాది జనవరి 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దావోస్‌లో సిఎం చంద్రబాబు పర్యటించ నున్నారు. ఈ టూర్‌లో దావోస్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు సిఎం హాజరుకానున్నారు. చంద్రబాబుబృందంలో మంత్రులు నారా లోకేశ్, టిజి భరత్ ఉన్నారు. ఈ మేరకు సిఎం దావోస్ పర్యటన షెడ్యూల్‌ను ఖరారైనట్లు అధికారికంగా ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. దావోస్ పర్యటనలో పలువురు పారిశ్రామికవేత్తలను సిఎం చంద్రబాబు కలిసే అవకాశాలు ఉన్నాయి. ఎపిలో పెట్టుబడులపై పారిశ్రామిక వేత్తలతో చంద్రబాబు చర్చించే అవకాశముంది.

# అబ్కారీ కస్టడీకి

>> నుంచి 15 వరకు కస్టడీలోకి తీసుకోనున్నారు ఎక్సైజ్ అధికారులు. నకిలీ మద్యం తయారీ, పంపిణీకి సంబంధించి లోతైన సమాచారాన్ని రాబట్టే దిశగా అధికారులు దర్యాప్తు చేపట్టను న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన ఈ నకిలీ మద్యం కేసులో.. అన్నమయ్య జిల్లా సహా పలు ప్రాంతాల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు బయటపడటంతో ప్రభుత్వం దీనిపై విచారణకు సిట్‌ను ఏర్పాటుచేసింది. ఈకేసులో ఇప్పటికే పలు వురు నిందితులు అరెస్ట్ అయ్యారు. వారిలో జోగి రమేశ్, జోగిరాము సోదరులూఉన్నారు. తాజాగా.. మరో నలుగురు నిందితుల కస్టడీద్వారా ఈ కేసుపై మరింతలోతైన విచారణజరిగి కీలక అంశాలు బయటపడే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

# సిఎం సీరియస్

>> సీరియస్‌గా తీసుకున్నారు. ఘటనకు పాల్పడిన ఇఒ మురళీకృష్ణను సస్పెండ్ చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇఒను సస్పెన్షన్ చేస్తూ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. దేవాదాయ శాఖ ఇనన్స్‌పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇఒపై కేసు నమోదు చేశారు.

**ఇఒ అరెస్టు రూ.6,23,600 విలువ చేసే వస్తువులు స్వాధీనం : డిఎస్పీ శివనారాయణస్వామి**

కదిరి రూరల్ పరిధిలోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయ ఇఒ మురళీకృష్ణను అరెస్టు చేసి అతని నుంచి రూ.6,23,600 విలువ చేసే వెండి, విలువైన చీరలు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. సోమవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను డిఎస్పీ వెల్లడించారు. ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా భక్తులు కానుకల రూపంలో ఇచ్చిన వెండి, బంగారు, చీరలను కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ఇఒ ఆటోలో తీసుకెళ్తుండగా గ్రామస్తులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ విషయంపై దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆలయ ఇఒను అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారించి ఆలయ ఇఒ చోరీకి పాల్పడినట్లు తమ విచారణలో వెల్లడైంద న్నారు. ఇఒపై కేసు నమోదు చేసి ఐదు కెజిల వెండి రెండు గ్రాముల బంగారం, 15 చీరలు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ తెలిపారు. ఆలయ ఇఒ మురళీకృష్ణ గతంలోకూడా తాను విధులు నిర్వహించిన తాడిపత్రిలో ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలిసిందని, ప్రస్తుతం పాలపాటిదిన్నె ఆంజినేయస్వామి, ఎర్రబదొడ్డి గంగమ్మ ఆలయంలో గతంలో హుండీ చోరీ జరిగిందని, ఇందులో కూడా అతని పాత్ర ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. ఆలయ ఇఒ అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని డిఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ సిఐ నిరంజన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# గూడ్స్ రవాణా బంద్!

వేసే అధికారం రాష్ట్రాలకు ఉందని.. లారీ ఓనర్ల సంఘం చెప్తోంది. 13 ఏళ్ల దాటిన పాత వాహనాలపై ఫీజులను భారీగా పెంచడం సరికాదని.. దీనివలన గూడ్స్ రవాణా చేసే వాహనాల యజమానులపై పెనుభారం పడుతుందని లారీ ఓనర్ల సంఘం వాదిస్తోంది. నోటిఫికేషన్ నిలిపివేసే అధికారం రాష్ట్రాలకు ఉన్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు.. దీనిపై నిర్ణయం తీసుకోవాలని లారీ ఓనర్ల సంఘం కోరింది. లేని పక్షంలో రాష్ట్రంలోని 10వేల గూడ్స్ లారీలు నిలిపివేస్తామని హెచ్చరించింది. తమపై భారం పడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలని లారీ ఓనర్ల సంఘం కోరింది.

ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి. ఈశ్వరరావు ప్రకటించిన వివరాల ప్రకారం, ఈ నెల 9వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైల్వే గూడ్స్ షెడ్లు, షిప్ యార్డుల నుంచి నడిచే సుమారు 10 వేలకు పైగా గూడ్స్ రవాణా వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేయనున్నారు. లారీలు రోడ్డెక్కకపోతే ఎగుమతులు, దిగుమతులు పూర్తిగా స్తంభించిపోయి వ్యాపార వర్గాలకు, సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. బీఎస్2, బీఎస్3 వంటి పాత వాహనాలు ఉంటే, వాటి స్పేర్ పార్ట్స్ దొరక్క ఆటోమేటిక్‌గా మేమే ఆపేస్తుంటాం. ఇప్పుడు 15 ఏళ్ల క్రితం నాటి వాహనాలు కూడా రోడ్డు ప్రమాదాలకు గురై స్క్రాప్ కిందకు వెళ్లిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పాత వాహనాలపై అదనపు భారం వేయడం తగదు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని మార్చుకోవాలి. లేకపోతే 9వ తేదీ అర్ధరాత్రి నుంచి దాదాపు పది వేల వాహనాల కార్యకలాపాలు నిలిపివేస్తామని లారీ యాజమానుల సంఘం నాయకుడు ఈశ్వరరావు స్పష్టం చేసారు.

# నిరుపయోగ స్థలాలు ఇక వాడకం

>> వృద్ధిశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు పుర, నగరపాలక, పట్టణాభివృద్ధి సంస్థలకు చెందిన వినియోగంలోని ఖాళీ స్థలాలు, భూములను సంబంధిత అధికారులు గుర్తిస్తున్నారు. పట్టణ నగరపాలక సంస్థల స్థలాలు, భూములను వివిధ వ్యాపారాల నిర్వహణకు కేటాయించనున్నారు. ప్రత్యేకించి శివారు ప్రాంత భూముల్లో రెసిడెన్షియల్ లేఔట్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వనున్నారు. గోదాములు, లాజిస్టిక్ హబ్‌లు, పరిశ్రమలు, సోలార్ ప్లాంట్లు కూడా ఏర్పాటుచేసే అవకాశం ఉంది. నగరాలు, పట్టణాల మధ్యలోని విలువైన స్థలాల్లో పెట్రోలు బంకులు, దుకాణాలు, షాపింగ్ మాళ్లు, హోటళ్ల అభివృద్ధి చేసేందుకు భూములను కేటాయించనున్నారు.ఆ విధంగా పట్టణ స్థానిక సంస్థలకు తగిన ఆదాయం రానుందని అధికారులు చెబుతున్నారు. తిరుపతి, అనంతపురం, కడప, కాకినాడలో గుర్తించిన స్థలాలకు మంచి డిమాండ్ ఉంది. వీటిలో వ్యాపారాల నిర్వహణకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. విశాఖ, విజయవాడ, కర్నూలు, నెల్లూరు, గుంటూరు తదితర నగరాల్లో రెండో విడతలో వివిధ ప్రాజెక్టుల ఏర్పాటుకు టెండర్లు సైతం పిలవనున్నారు.

# 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'కు సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**విజయవాడ, డిసెంబరు 8, ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కు సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సదస్సు విజయవంతం కావాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షి ంచారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రత్యేక పోస్టు పెట్టారు. "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ వేదిక తెలంగాణ రాష్ట్రంలో వృద్ధి, ఆవిష్కరణలు, పురోగతికి సరికొత్త మార్గాలను తెరుస్తుందని ఆశిస్తున్నాను" అని ట్వీట్ చేశారు. పొరుగు రాష్ట్రంలో జరుగుతున్న కీలకమైన సదస్సుకు ఏపీ ముఖ్యమంత్రి అభినందనలు తెలపడం రాజకీయ వర్గాల్లో సానుకూల వాతావరణాన్ని సూచి స్తోంది. ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలకు ఇటువంటి సంకేతాలు దోహదం చేస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఇసుక కుంభకోణం కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కీలక పరిణామం

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో గత ప్రభుత్వం హయాంలో జరిగిన ఇసుక కుంభకోణం కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎన్జీటీ విధించిన రూ.18 కోట్ల జరిమానాపై జేపీ వెంచర్స్ సోమవారం సుప్రీంలో ఐఎ దాఖలు చేసింది. ఎన్జీటీ విధించిన జరిమానాను తాము చెల్లించాల్సిన అవసరం లేదంటూ సుప్రీంలో జేపీ వెంచర్స్ వాదనలు వినిపించింది. ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు తీసుకున్నది ప్రభుత్వమే కాబట్టి తాము జరిమానా ఎందుకు చెల్లించాలని వాదించింది. చిత్తూరు జిల్లాలోని ఆరణీయార్ నదీ పరీవాహక ప్రాంతాల్లో బి2 కేటగిరీలో 18 రీచ్‌లలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినందుకు జేపీ వెంచర్స్‌కు ఎన్జీటీ రూ.18కోట్లు జరిమానా విధించింది. ఈ క్రమంలో ఎన్జీటీ తీర్పుపై సుప్రీంను జేపీ వెంచర్స్ ఆశ్రయించింది. ఎన్జీటీ విధించిన జరిమానాను సుప్రీంకోర్టులో డిపాజిట్ చేయాలని జేపీ వెంచర్స్‌కు ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే సుప్రీం ఆదేశాలలో సవరణ కోరుతూ తాజాగా జేపీ వెంచర్స్ ఐఏను దాఖలు చేసింది.

# విధ్వంసం నుండి అభివృద్ధిలోకి

>> వృద్ధి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రూ. 4లక్షల 377 కోట్ల విలువైన జిఎస్డీపీ నమోదు అయ్యిందని వెల్లడించారు. ఇదే సమయానికి భారతదేశ జిడిపి 8.7 శాతంగా ఉందని గుర్తుచేశారు. ఈ త్రైమాసికంలో జిఎస్డీపీ గత యేడాదితో పోల్చుకుంటే 1.11 శాతం పెరిగిందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగాల జివిఎ 10.70 శాతం, పరిశ్రమల రంగం 12.20 శాతం, సేవల రంగం 11.30 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. గత పాలకుల విధ్వంస పాలన వల్ల గ్రోత్ రేట్ తగ్గి రూ.7 లక్షల కోట్ల జిఎస్డీపీ కోల్పోయామని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రోత్ రేట్ లేకపోవటం వల్ల రూ. 76,195 కోట్ల ఆదాయం కోల్పోయామన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కువ వడ్డీలకు అప్పులు తేవటం వల్ల ప్రజాధనానికి నష్టం కలుగుతోందని ఆక్షేపించారు. రుణాల రీషెడ్యూలింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బ్రాండ్ తగ్గి, వడ్డీ రేటు పెరిగటం వల్ల రెవెన్యూ జిఎస్డీపీలో రాష్ట్రం చాలా నష్టపోయిందని చంద్రబాబు తెలిపారు.

**ప్రజల చేతుల్లోకి పాలన :**

సుపరిపాలన ద్వారా ప్రజల వద్దకు వెళ్లామని, వాట్సప్ గవర్నెన్సు ద్వారా ప్రజల చేతుల్లోకి పాలనను తీసుకెళ్లామని గుర్తుచేశారు. గత ప్రభుత్వం పిపిఎలు రద్దు చేయడం వల్ల ఎలాంటి విద్యుత్ వాడుకోకుండా రూ.9 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చిందని ఆరోపించారు. 950 టిఎంసిల నీరు నేటికి రిజర్వాయర్లలో నిల్వఉందన్నారు. ఎస్ఐపిబిల ద్వారా రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులకు పైగా ఆమోదం తెలిపామన్నారు. అస్తవ్యస్తం చేసిన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. గత పాలకులు విద్య శాఖలోనూ బిల్స్ పెండింగ్ పెట్టారని మండిపడ్డారు. పల్లెపండుగ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 25 ఏళ్ల క్రితం రూపొందించిన పాలసీల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు ఆదాయం సాధిస్తోంది. విభజన తర్వాత వ్యవస్థీకృతంగా ఎపికి వచ్చిన ఇబ్బందులను సరి చేసే సమయంలో వైఎస్సార్సీ వచ్చి రాష్ట్రాన్ని విధ్వంసం చేసింది. తెలుగు రాష్ట్రాలు ఎప్పుడూ అభివృద్ధి సాధించాలని ఇవాళ కూడా ట్వీట్ చేశాను. ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. ఇప్పుడు రీషెడ్యూలు చేస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, విద్యుత్ సహా వివిధ మౌలిక సదుపాయాలు కల్పించటం వల్ల పరిశ్రమల రంగంలో వృద్ధి నమోదైంది. రాష్ట్రంలో నీటి భద్రత, అగ్రిటెక్, లాజిస్టిక్స్ వ్యయం తగ్గింపు, ప్రాడెక్టు పర్ఫెక్షన్, డీప్ టెక్ లాంటి 10 సూత్రాలను సమర్ధంగా అమలు చేస్తున్నామని అన్నారు.

**ఎపి బ్రాండ్ పునరుద్ధరణ**

వచ్చే ఏడాది కూడా విద్యుత్ చార్జీలు పెంచకుండా సమర్ధత పెంచుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. భూమినే జలాశయంగా మార్చుకుని భూగర్భజలాలు పెంచుతున్నామన్నారు. ఎపి బ్రాండ్ పునరుద్ధరించి తిరిగి పెట్టుబడులు రాబడుతున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే యత్నం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత టిడిపి అయిదేళ్లు అధికారంలో ఉందన్నారు. ఇక్కడ సరాసరి జీఎస్టీ 13.5 శాతం సాధించామని... కేంద్ర జిఎస్డీపీ కన్నా ఎక్కువ సాధించామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక 12.02 శాతం వృద్ధి సాధించామని.. ఆల్ ఇండియా లెవల్‌లో 9.8 శాతంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**సుపరిపాలన, సూపర్ సిక్స్ సమన్వయం**

ఈ ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్ జూలైసెప్టెంబర్ మధ్య జిఎస్డీపీ ఫలితాలు వచ్చాయని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిన పడుతుందా అని ఎందరో అనుమానం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. చేయలేమని పారిపోమని మాత్రం హామీ ఇచ్చి నిరంతరం కష్టపడ్డామని చెప్పారు. సుపరిపాలన, సూపర్6 రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని వెల్లడించారు. వ్యక్తులు చేసిన తప్పులకు వ్యవస్థల్లో మార్పులకు కేంద్రం శ్రీకారం చుట్టిందన్నారు. నిరుపయోగం చేసిన 93 కేంద్ర ప్రభుత్వ పథకాలను తిరిగి పునరుద్ధరించామని సిఎం చంద్రబాబు తెలిపారు.

**రాజకీయ ముసుగులో నేరాలు**

బురద చల్లితే కడుక్కునే పరిస్థితుల్లో లేమని, ప్రక్షాళన చేసేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. రాజకీయ ముసుగులో నేరాలు చేసిన వ్యక్తుల పై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పరకామని చోరీని ఎవ్వరూ సమర్ధించరని తేల్చిచెప్పారు.

దేవుడి డబ్బుల కాపలా దారులు తప్పులు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. దేవుడి మీద నమ్మకం ఉంది కాబట్టే ఒక వ్యాపారి రూ.122 కోట్లు బంగారం వెంకటేశ్వర స్వామికి ఇచ్చారని గుర్తుచేశారు. ఓ దేవాలయంలో ఇఒ చోరీ చేస్తే తక్షణం సస్పెండ్ చేశామని చంద్రబాబు తేల్చిచెప్పారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయంలోనే చోరీ జరిగితే అది చిన్నదని ఎలా సమర్థిస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నాసిరకం ప్రసాదాన్ని భక్తులకు ఇచ్చిన దానిని కూడా సమర్ధిస్తారా అని నిలదీశారు. ఇలాంటి వాటినా సమర్థిస్తున్న వ్యక్తులు ప్రతిపక్షంలో ఉన్నారని ఆక్షేపించారు. ఇలాంటి వారితో రాజకీయం చేయడానికి సిగ్గు అనిపిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్ నుంచి మద్యం సేవిస్తూ వచ్చి ప్రమాదంలో మరణిస్తే, ఆ ఘటనను కూడా హత్యకింద చిత్రీకరించే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్సీ తలాతోకలేని పార్టీ అన్నారు.జగన్ కేవలం అభివృద్ధిని చూసి దుగ్ధతో మాట్లాడుతున్నారన్నారు.

# భారత్ వికాస మంత్రం

>> జననీ జన్మభూమిశ్చ అన్న రాముడి మాటలకు మరోరూపం వందేమాతరం అంటూ భావోద్వేగానికి గురయ్యారు. 1875లో బంకించంద్ర చటోపాధ్యాయ రాసిన ఈ పాట ప్రయాణాన్ని స్వాతంత్ర్య పోరాటంలో దాని పాత్ర, వందేమాతరం దేశాన్ని ఐక్యంగా బంధించే భావోద్వేగ ప్రవాహంగా మారిందని మోడీ వివరించారు. వందేమాతరంకు 50 ఏళ్లు నిండిన సమయంలో దేశంలో అప్పుడు బ్రిటీషు పాలనలో ఉందని, ఇక వందేళ్లు నిండిన సమయంలో అప్పుడు దేశంలో ఎమర్జెన్సీ ఉందని ప్రధాని పేర్కొన్నారు. ఇవాళ మనం ఇక్కడ కూర్చున్నామంటే, లక్షలాది మంది వందేమాతం ఆలపించడం వల్లే అని, వాళ్లంతా స్వాతంత్ర్యం కోసం పోరాడారని తెలిపారు. బ్రిటీష్ పాలకులు గాడ్ సేవ్ ద క్వీన్ అన్నగీతాన్ని ప్రతిఇంటికి తీసుకెళ్తున్న సమయంలో వందేమాతరం గీతాన్ని రాసినట్లు ప్రధాని మోడీ తెలిపారు. వందేమాతరం కేవలం రాజకీయ స్వేచ్ఛా మంత్రం కాదు అని, బ్రిటీష్ పాలకుల ఆధీనం నుంచి భరతమాత స్వేచ్ఛ కోసం జరిగిన పవిత్ర యుద్ధం అన్నారు. వందేమాతరం రచించిన సమయంలో భారతదేశంలోని ప్రతీ ఇంట్లో బ్రిటిష్ జాతీయ గీతమైన "గాడ్ సేవ్ ద క్వీన్"ను ఆలపించేలా చేయాలని యత్నించారని మోడీ గుర్తుచేశారు. వందేమాతరానికి 50 ఏళ్లప్పుడు దేశం బ్రిటిష్ పాలనలో ఉందని, అది వందేళ్లు పూర్తిచేసుకున్నప్పుడు దేశం ఎమర్జెన్సీలో ఉందని వివరించారు. ఆ విధంగా బెంగాల్ మేధో సంపత్తి దేశానికి ప్రేరణనిచ్చిందన్న మోడీ, బ్రిటిష్ దాన్ని విచ్ఛిన్నం చేయాలనే కుట్రతో విభజించు పాలించు విధానాన్ని తీసుకువచ్చారని తెలిపారు. 1905లో వారు బెంగాల్‌నైతే విభజించారు, కానీ వందేమాతరం ఒక ధృడమైన రాయిలా నిలిచి దేశ ఐక్యతకు స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వందేమాతరం గేయంపై కవితలు చదివి వినిపించారు.

**కాంగ్రెస్‌పైనా, నెహ్రూపైనా ఆరోపణలు**

వందేమాతర జాతీయ గీతంపైనా కాంగ్రెస్, జవహర్ లాల్ నెహ్రూ దాడి చేశారని మోడీ ఆరోపించారు. వందేమాతరం ముస్లింలను రెచ్చగొట్టేలా ఉందని జవహర్ లాల్ నెహ్రూ భావించారని ప్రధాని అన్నారు. జాతీయ గేయం వందే మాతరాన్ని కాంగ్రెస్ ముక్కలుముక్కలు చేసిందని, ఎందుకంటే ముస్లింలను రెచ్చగొడుతుందన్న ఉద్దేశంతో ఆ గేయాన్ని ముక్కలు చేశారని మోడీ అన్నారు.

ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆందోళనల మధ్యే ప్రధాని మోడీ తన ప్రసంగాన్ని కొనసాగించారు. జాతీయ గేయాన్ని ముక్కలు చేసిందెవరన్న విషయాన్ని రాబోయే తరాలకు తెలియజేయాలని, మొహమ్మద్ అలీ జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్ 1937లో వందేమాతరం గేయానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిందని, కానీ కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ ఆ ఉద్యమాన్ని వ్యతిరేకించలేదని, బదులుగా వందేమాతరం గీతాన్ని ముక్కలు చేశారని ఆరోపించారు. గేయంలో ఉన్న హిందూ దేవతల ప్రస్తావన ముస్లింలకు నచ్చడం లేదని, అందుకే పూర్తిగేయాన్ని వాడవద్దు అని అప్పట్లో నెహ్రూ పేర్కొన్నట్లు తెలుస్తోంది. వందేమాతరం గీతంతో విభజన చేపట్టిన కాంగ్రెస్ పార్టీ.. ఎప్పుడో దేశవిభజనకు బీజం వేసిందని మోడీ తన ప్రసంగంలో అన్నారు. వందేమాతరం రాసిన వేళ భారతదేశం బానిసత్వంలో ఉందని, 100 ఏళ్లు పూర్తయిన వేళ భారత్ రాజ్యాంగం గొంతు నొక్కేశారని, 1975లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారని మోడీ గుర్తుచేశారు. వందేమాతర గీతం గొప్పతనాన్ని పునరుద్ధించుకునే గొప్ప అవకాశం ఇప్పుడు వచ్చిందని చెప్పారు. ఈ అవకాశాన్ని వదులుకోరాదని సూచించారు. దేశాన్ని ఏకతాటిపై నడిపించిన వందేమాతర గీతానికి పునర్వైభవం రావాలని, ఇవాల్టి చర్చలు భవిష్యత్ తరానికి స్ఫూర్తి కావాలని, 2047 వికసిత్ భారత్ నెరవేరాలంటే వందేమాతరం స్ఫూర్తి అవసరమని ప్రధాని ఉద్బోధించారు.

**బంకిమ్ దా కాదు.. బంకిమ్ బాబు..**

ప్రధాని ప్రసంగంలో బంకిమ్ గురించి ప్రస్తావిస్తూ.. బంకిమ్ దా అని మోడీ అనగా, బెంగాలీ ప్రఖ్యాత కవి, కంపోజర్‌ను బంకిమ్ దా అని పిలవడాన్ని.. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్ తప్పుపట్టారు. బంకిమ్‌ను దాతో సంబోధించడాన్ని ఆయన వ్యతిరేకించారు. దా అంటే బెంగాలీలు దాదా అని అంటే సోదరులను, స్నేహితులను సంబోధించేందుకు ఆ పదాన్ని వాడుతుంటారు. ప్రధాని మోడీ తనప్రసంగంలో బంకిమ్ దా అనడడం అగౌరవపరచడమే అవుతుందని, బంకిమ్ దా అనడంకాదు, బంకిమ్ బాబు అని పిలవాలని తృణమూల్ ఎంపి సూచించారు. ఎంపి సౌగత్‌రాయ్ చేసిన సూచనకు ప్రధాని మోడీ తక్షణమేస్పందించారు. సరే బంకిమ్ బాబు అనిపిలుస్తానని, థ్యాంకూ.. మీ మనో భావాలను గౌరవిస్తానని ప్రధాని మోడీఅన్నారు. ఆ తర్వాత తన ప్రసంగంలో టిఎంసి ఎంపిపై వ్యంగ్యాస్త్రం వేశారు. మిమ్మల్ని దాదా అని పిలవవచ్చా అన్నారు. దీనికేమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని ప్రధాని అన్నారు.

## వారం - వర్జ్యం

09-12-2025, మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, మార్గశిరమాసం, దక్షిణాయణం హేమంత ఋతువు, కృష్ణపక్షం

పంచమి మ.2.35,

ఆశ్లేష రా.2.26, జ్యేష్ఠ కార్తె

వర్జ్యం : మ.2.37-4.14

దు.ఉ.8.40-9.25, 2) రా.10.04-10.49

శుభసమయం : ఉ.10.15-11.00

రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. అనుకున్న పనులలో విజయం సాధిస్తారు. భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృషభం:** దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. ఉద్యోగులకు పదోన్నతలు.

**మిథునం:** శత్రువులు సైతం మిత్రులుగా మారతారు. తనఖాలు విడిపిస్తారు. వివాహాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం :** కొత్త ఋణాలు చేస్తారు. పాత ఋణాలు తీరుస్తారు. ఇంటా బయట అనుకూలంగా ఉంటుంది. ధన లాభం.

**సింహం:** స్వజనుల వలన కొన్ని ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుంది. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. నూతన విద్యావకాశాలు లభిస్తాయి.

**కన్య:** ఎవ్వరినీ ఎదిరించకుండా సర్దుకు పోవటానికే ప్రయత్నించండి. ఆరోగ్య సమస్యలు ఎదురై అధిగమిస్తారు. స్థిరాస్తి విలువ పెరుగుతుంది.

**తుల :** వృత్తి ఉద్యోగ వ్యాపార విద్యారంగంలో ఫలితాలు సానుకూలంగానే ఉంటాయి. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:** మన పని మనం చేసుకుపోతే ఏనాటికయినా అనుకూల ఫలితాలు వస్తాయని భావిస్తారు. విదేశీయాన అవకాశాలు కలిసివస్తాయి.

**ధనుస్సు:** ఇష్టం లేకపోయినా తాత్కాలి ప్రయోజనాల కొరకు కొందరితో కలసి పనిచేయక తప్పనిసరి పరిస్థితులు ఏర్పడుతాయి.

**మకరం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకు కలిగించవచ్చును. కుటుంబ సమస్యలు ఎదురౌతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి.

**కుంభం:** పట్టుదలతో ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. ఆలోచనలు మాత్రం స్థిరంగా వుండవు. వివాదాలకు దూరంగా వుండండి.

**మీనం :** కొత్త వస్త్రాలు, గృహం, స్థలం కొనుగోలు యత్నాలు వాయిదా వేస్తారు. ఋణ వత్తిడులు ఉంటాయి. ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## జాతీయ సంస్కృత వర్సిటీ వివాదంపై

# హోంమంత్రి ఆగ్రహం

## ఒడిశాకు ప్రత్యేక పోలీసు బృందం

**తిరుపతి,డిసెంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం విద్యార్థినిపై అసోసియేట్ ప్రొఫెసర్ లైంగిక వేధింపులపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటనకుదారితీసిన పరిస్థితులు, విద్యార్థిని ఫిర్యాదు, తదుపరి పోలీసు కేసు నమోదు విషయాలను తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుని అడిగి తెలుసుకున్నారు. సోమవారం ఉదయం ఆమె ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. లైంగిక వేధింపుల ఘటనపై ఆమె తీవ్రంగా స్పందించారు. దీంతో ఓ ప్రత్యేక పోలీసుబృందాన్ని ఒడిశాకుపంపి బాధితవిద్యార్థినితో మాట్లాడి మరిన్ని వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. ఈ బృందం వచ్చిన తరువాత జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో వేధింపులకు గురిచేసిన అసోసియేట్ ప్రొఫెసర్‌పై చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు. ప్రాథమిక దర్యాప్తులో బాగంగా సాక్ష్యాధారాలు, కీలక సమాచారం సేకరించాలని ఎస్పీని ఆదేశించారు.

09-12Pg3exHMNWJQEP_09-12Pg3exHMNWJQEP.qxd 12/9/2025 1:12 AM Page 1



### అలిపిరి నుండి ఆనందనిలయం వరకు

# సంతృప్తికర సేవల దిశగా అడుగులు

**తిరుమల,డిసెంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న భక్తులకు మరింత సంతృప్తికరంగా స్వామివారి దర్శనం చేయించే విధానం, అలిపిరిలోఅడుగుపెడితే ఆనందనిలయంలోనికి చేరుకునే వరకు పూర్తిస్థాయిలో భక్తుల సౌకర్యాలపై టిటిడి దృష్టి సారించింది. సామాన్యభక్తులు నేరుగా తిరుమలకు చేరుకున్నా వారికి సాధ్యమైనంతవరకు ఎన్నిగంటల్లోపే దర్శనం చేయించవచ్చనే కోణంలో ప్రయోగాత్మక పరిశీలనలు మొదలయ్యాయి. వారాంతం రోజుల్లో, ప్రత్యేక పర్వదినాల్లో, విశేషమైన రోజుల్లో 1.30లక్షలమందివరకు భక్తులు చేరుకుంటే శిలాతోరణం, పాపవినాశనంమార్గం, కృష్ణతేజ విశ్రాంతి గృహం, సేవాసదన్ ప్రాంతాల్లో వెలుపల క్యూలైన్లలో ప్రవేశించే భక్తులను వీలైనంత వరకు దగ్గరగా అనుమతించేలా కూడా ఈ కసరత్తు చేస్తున్నారు. తిరుమలకు ప్రతిరోజూ లక్షమందివరకు సామాన్యభక్తులు వస్తున్నారు. రోజుకు 15వేలనుండి 20వేలమంది వరకు సర్వదర్శనం టైమ్‌స్లాట్ భక్తులు, మరో 25వేలమంది వరకు ప్రత్యేక ప్రవేశదర్శనాలు భక్తులు, వీరేగాక మరో మూడువేలమంది వరకు విఐపి బ్రేక్ దర్శనాలు, 30వేలమందినుండి 40వేలమందిపైగా సామాన్యభక్తులు కొండకు చేరుకుంటున్నారు. గంటల తరబడి క్యూలైన్లలో, కంపార్టు మెంట్లలో నిరీక్షణ తప్పడంలేదు. పైగా సాధారణరోజుల్లో



శ్రీవారి దర్శనానికి 10నుండి 12గంటలు సాధారణ సర్వ దర్శనం నిరీక్షించాల్సి వస్తుండగా టైమ్ స్లాట్ భక్తులు ఆరేడుగంటలు సమయం పడుతోంది. వీటన్నిటి వల్ల భక్తులకు దర్శన కష్టాలు తప్పడంలేదు. సామాన్యభక్తుల దర్శన సమస్యలకు చెక్‌పెట్టేందుకు కృత్రిమ మేధస్సు(ఏఐ)ను వినియోగించుకోవాలని టిటిడి కసరత్తు వేగవంతం చేసింది. ఇందుకోసం దేశంలోనే తొలిగా వైకుంఠం క్యూకాంప్లెక్స్- 1లో 25వ కంపార్టు మెంట్‌లో ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసిసిసి) కేంద్రీకృతం చేసి నిరంతరం విజిలెన్స్ విభాగం పర్యవేక్షిస్తోంది. అక్కడ నుండే తిరుమలకు భక్తులు వస్తున్న వాహనాలతో బాటు సంఖ్యను వారి కదలికలను నిశితంగా పరి శీలిస్తోంది. వెలుపల క్యూలైన్లతోబాటు వైకుం ఠమ్ కంపార్టుమెంట్లలో భక్తుల రద్దీ నియంత్రణ, భద్రతపై కూడా దృష్టి పెడుతున్నారు. ఐసిసిలో పెద్ద డిజిటల్ స్క్రీన్‌లు, అలిపిరి నుండి ఆనందనిలయం వరకు అన్ని విభాగాలకు చెందిన సిసికెమెరాల పనితీరు పర్యవేక్షణ చేస్తున్నారు. సాంకేతిక సిబ్బంది పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు దర్శన సమయం, కంపార్టుమెంట్ల స్థితి, క్యూలైన్ల కదలికలను అధికారులకు వాస్తవ పరిస్థితులను తెలియ జేస్తున్నారు. కొత్తగా అమర్చిన సిసికెమెరాలతో అలిపిరి వద్ద నుండే భక్తుల రద్దీని ఏఐ అంచనా వేస్తుంది. క్యూలైన్లలో ఎంతమంది భక్తులు ఉన్నారు, ఎంత సమయం వారు నిరీక్షిస్తున్నారు, సర్వదర్శనం పరిస్థితి తదితర అంశాలను ట్రాక్‌చేస్తున్నారు. ముఖ గుర్తింపు పరికరంద్వారా భక్తులను గుర్తించడం కూడా సులభమైంది. తప్పిపోయిన భక్తులను క్షణాల్లోకనిపెట్టే వ్యవస్థ అందుబాటులో ఉంది. క్యూలైన్లు, వసతి ఇతర సౌకర్యాలను వాస్తవ పరిస్థితులలతో చిత్రాలతో చూపుతోంది. కొండపై రద్దీ ఉన్న ప్రాంతాల్ని రెడ్‌స్పాట్‌లుగా చూపడంతోబాటు చర్యలకు సంకేతాల్నిస్తుంది. ఆన్‌లైన్‌లో నిరంతరం పర్యవేక్షిస్తూ ఎప్పటి కప్పుడు భక్తుల అనుభవాలను తెలుసుకుని శ్రీవారి దర్శనాన్ని మరింత సౌకర్యవంతం చేసేందుకు చూస్తున్నారు. ఇంటిగ్రేటెడ్‌కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరుపై, ప్రస్తుత పరిస్థితులను మీడియా ప్రతినిధులకు వివరించారు.

### తిరుపతి సంస్కృత వర్సిటీ ఘటన

### బాధ్యులను వదలం: హోంమంత్రి అనిత

**విజయవాడ,నవంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిపై తిరుపతి ఎస్పీ, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో నిందితులు ఎంతటివారైనా ఉపేక్షి ంచేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని హోంమంత్రి తెలిపారు. తిరుపతి ఎస్పీ స్వయంగా ఈ కేసును పర్యవేక్షి స్తున్నారని చెప్పారు. బాధితురాలికి న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని మంత్రి అనిత పునరుద్ఘాటించారు. మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఇలాంటి దారుణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతిష్టను దిగజార్చేందుకు భారీ కుట్ర

### పాలకవర్గ విధానాల ఫలితమే ఇండిగో సంక్షోభం: సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు

**విశాఖపట్నం, డిసెంబర్ 8, ప్రభాతవార్త :** రూ. లక్షల కోట్లు పెట్టు బడులు, లక్షల ఉద్యోగాలంటూ చంద్రబాబు ప్రభుత్వం కబుర్లు చెప్పి అందుకు తగ్గట్లు కార్యాచరణ లేకుండా వ్యవహరిస్తుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివిరాఘవులు ఎద్దేవా చేశారు. సోమవారం జగదాంబ జంక్షన్ సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో వేల ఏకరాల భూములను రైతుల నుంచి తీసుకున్నా, ఏ పరిశ్రమా రాలేదని, భూముల కోసం తప్ప పెట్టుబడి ఆసక్తి కనిపించడం లేదన్నారు. ఐటి మంత్రి లోకేష్ కూడా గడచిన 17 నెలల్లో రూ.20లక్షల కోట్లు పెట్టుబడులను తెచ్చామన్నారని, ఈ డబ్బంతా ఎక్కడికి వెళ్లిపోయిందో చెప్పాలని కోరారు. 20ఏళ్ల క్రితం రైతులు నెల్లూరు జిల్లా కృ?పట్నంలో అదానీ కోసం 2800 ఎకరాలు, కాకినాడలో సెజ్ ల పేరుతో 10వేల ఎకరాలు, అనంతపురంలో 8వేల ఎకరాలు లేపాక్షి కోసం, ప్రకాశం జిల్లా పనుకొండలో 80వేల ఎకరాలు ఇచ్చారన్నారు. ఈ భూములన్నీ పెట్టుబడిదారుల స్పెక్యులేషన్ వ్యాపారానికి వాడుకున్నారు తప్ప, పరిశ్రమలు రాలేదని, భూములిచ్చిన రైతులకు ఏం పరిహారం ఇచ్చారంటూ ప్రశ్నించారు. డేటా సెంటర్లలో వచ్చే ఉద్యోగాలు 300 కంటే మించవని, గూగుల్ కి చౌకగా నీరు, విద్యుత్ ఇవాల్సి న అవసరం లేదన్నారు.

ఆదాని, టాటా కోసం కాకుండా, నిజంగా ఉపాధి కల్పించాలనుకుంటే ఉపాధి స ష్టించగల ఫుట్వేర్, గార్మెంట్, టెక్స్టైల్ ఇండస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు పెట్టాలని రాఘవులు డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రతిష్టను దిగజార్చి, కార్మికుల జీతాల్లో కోత పెట్టడానికి యాజమాన్యం ఉత్పత్తితో లింకు పెట్టి ఉద్యోగాలను కార్మికులు అంతిమంగా వదులుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాజమాన్యం కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. దేశంలోని కీలక రంగాల్లో ప్రభుత్వ ఆధిపత్యం ఉండి తీరాలని ప్రైవేట్ వాళ్ల పెత్తనానికి వదిలేస్తే తాజాగా నెలకొన్న విమానయాన రంగం ఎలా కకావికలం అయ్యిందో దేశం అంతా చూస్తుందని తెలిపారు. ఇది కచ్చితంగా పాలకవర్గ విధానాల వల్ల వచ్చిన సంక్షోభమన్నారు. కేంద్రం స్పందించకపోవడం వెనుక ప్రైవేట్ విమాన యాన సంస్థతో కుమ్మక్కయిందా?

అని ప్రశ్నించారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ హక్కులపై ఢిల్లీ కోర్టుకు జూ.ఎన్టీఆర్

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** టాలీవుడ్ స్టార్ హీరో నందమూరి తారకరామారావు(జూనియర్ ఎన్టీఆర్)తాజాగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించేలా సోషల్‌వీడియాలో పోస్టులు చేస్తున్నారని, అలాంటి పోస్టులు క్రియేట్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరా, సదరు ఖాతాలపై విచారణ జరిపి నిందితులపై మూడు రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా సంస్థలను ఆదేశించారు., ఎన్టీఆర్ వ్యక్తిగత ప్రతిష్ఠ, హక్కులకు భంగం కలిగించేలా, ఆయన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సోషల్‌మీడియా, ఈ కామర్స్ ప్లాట్ ఫామ్స్ లో అనేక పోస్టులు వైరల్ అవుతున్నాయని అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ తరపు న్యాయవాది జె.సాయిదీపక్ ఈ సందర్భంగా న్యాయస్థానాన్ని కోరారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం, 2021 ఐటీ చట్టం ప్రకారం సదరు ఖాతాలపై విచారణ జరిపి నిందితులపై 3 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని ఆయా సోషల్ మీడియా సంస్థలను కోర్టు ఆదేశించింది. వ్యక్తిగత హక్కులకు భంగం కలిగేలా ఉన్న అభ్యంతరకర పోస్టుల వ్యవహారంలో,

అలాంటి పోస్టులను తొలగించాలని ముందుగా సోషల్‌మీడియా సంస్థలను సంప్రదించాలని జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ ఈ సందర్భంగా సూచించారు. ఆ తర్వాతనే కోర్టును ఆశ్రయించాలని అన్నారు. అయితే గతంలో బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్‌కు కూడా ఇలాంటి పరిస్థితే ఎదురవ్వగా అప్పట్లో న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను న్యాయవాది ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు ఈ కేసులో తదుపరి విచారణను డిసెంబరు 22కు వాయిదా వేసింది.



కూచిపూడి ఆస్పత్రిని సందర్శించి బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ సాధినేని యామినీ శర్మ

### కూచిపూడి ఆస్పత్రిలో

# ఫీజులుండవు

### - ఆసుపత్రి అద్భుతం: ప్రశంసించిన బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ సాదినేని యామినీ శర్మ

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని అంతర్జాతీయ ప్రఖ్యాత నాట్య క్షేత్రం కూచిపూడిలో ఎటువంటి రుసుము లేకుండా ప్రవాసాంధ్రుల సౌజన్యంతో వైద్య సేవలు అందిస్తున్న ఆధునీక ఆసుపత్రి నిర్వహణలో ఉంది. సిలికానాంధ్రకు చెందిన తెలుగువారు ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రి క్షేత్ర ప్రాశ్యస్తానికి తగినట్లుగానే దివి సీమకు వరంగా మారింది. ఇటీవల ఏపీకి చెందిన బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ సాధినేని యామినీ శర్మ ఈ ఆస్పత్రిని సందర్శించారు. ఇటువంటి ఆస్పత్రి మారుమూల ప్రాంతంలో అభినందనీయమని ప్రశంసించారు. తాను సందర్శించిన ఈ ఆసుపత్రిని చూసి నిశ్చేష్టురాలినయ్యానని ఆమె తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు. ఇది కేవలం ఆసుపత్రి మాత్రమే కాదని, మానవత్వానికి నిలువుటద్దమని ఆమె కొనియాడారు. ఈ ఆసుపత్రి పూర్తిగా విరాళాలతో నడుస్తోందని యామినీ శర్మ తెలిపారు. ఇక్కడ రోగ నిర్ధారణ పరీక్షల నుంచి పెద్ద పెద్ద శస్త్రచికిత్సల వరకు అన్నీ రూపాయి ఖర్చు లేకుండా అందిస్తున్నారని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎలాంటి బిల్లులు, షరతులు, వివక్ష లేకుండా ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని ఆమె అన్నారు. అధునాతన వైద్య పరికరాలు, పరిశుభ్రమైన వాతావరణం ఇక్కడి నిబద్ధతకు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. సిలికానాంధ్ర వ్యవస్థాపకులు ఆనంద్ కూచిభొట్ల దార్శనికత, సీనియర్ జర్నలిస్ట్ రవిప్రకాశ్ వంటి ఎందరో దాతల సహకారంతో ఈ అద్భుతమైన వైద్యాలయం రూపుదిద్దుకుందని యామినీ శర్మ వివరించారు. ఇది కేవలం ఆసుపత్రి మాత్రమే కాదని, మానవత్వం, సేవ, నిజమైన దేశ నిర్మాణం అంటే ఇదేనని తాను భావిస్తున్నానని చెబుతూ.. ఈ సంస్థను చూసి గర్వంగా, భావోద్వేగంగా ఉందని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు.

# వల్లభనేని వంశీ ప్రధాన అనుచరుడు కొమ్మా కోట్లు అరెస్ట్

### - పోలీసులకు తానే లొంగిపోయానని ప్రకటించిన కొమ్మా

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాత వార్తప్రతినిధి:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీమోహన్‌కు గట్టిదెబ్బ తగిలింది. వంశీ ప్రధాన అను చరుడు కొమ్మా కోటేశ్వరరావు అలియాస్ కోట్లును విజయవాడ పటమట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఏ2గా ఉన్నారు కొమ్మా కోట్లు. గత కొంత కాలంగా ఆయన అజ్ఞాతంలో ఉంటున్నట్లు తెలుస్తోంది. ఎట్ట కేలకు కొమ్మా కోట్లును పటమట



కోర్టులో హాజరు పరుస్తున్న సందర్భంలో మీడియాతో మాట్లాడుతున్న కొమ్మా కోట్లు

పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, కొమ్మా కోట్లును ఇవాళ అరెస్ట్ చేసినట్లు చూపనున్నారు పోలీసులు. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం కోర్టుకు పోలీసులు తీసుకువచ్చారు. న్యాయాధికారి ముందు కొమ్మా కోట్లును హాజరు పరిచారు పోలీసులు. ఈ సందర్భంగా కొమ్మా కోట్లు మీడియాతో మాట్లాడారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో తన ప్రమేయం ఏమీ లేదని కొమ్మా కోట్లు స్పష్టం చేశారు. తాను ఏ తప్పు చేయలేదని, తన మీద పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. అందువల్లే ఈరోజు పటమట పోలీస్టేషన్‌కు వచ్చి తాను లొంగిపోయానని తెలిపారు. కోర్టులో తనకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని కొమ్మా కోట్లు పేర్కొన్నారు.

# గ్రామీణ ప్రాంతాలకు సైతం డిజిటల్ సేవలు

### - స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రారతాలకు సైతం డిజిటల్ సేవలను విస్తరించేరదుకుగాను అమలు చేస్తున్న డిజిటల్ నెట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక ఎస్‌పివి (స్పెషల్ పర్పస్ వెహికల్)ను ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకుంది, ఇరదులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధిరచి ఐదుగురు, రాష్ట్రం నురచి ఐదుగురు డైరెక్టర్లుగా ఉరటారు. ఈ ఎస్పీవీకి ఏపి భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌గా (ఎపిబిఐఎల్)గా నామకరణం చేశారు. దీనికి సంబంధిరచిన మార్గదర్శకాలు కూడా శుక్రవారం విడుదల చేశారు. ఈ ఎస్‌పివిలో కేంద్రం నురచి డిజిటల్ భారత్ అడ్మినిస్ట్రేటర్ ఎక్స్ అఫిషియో చైర్మన్‌గా ఉరడగా, టెలికామ్ రాష్ట్ర సిజిఎం, స్పెషల్ డైరెక్టర్, రాష్ట్రానికి చెరదిన కమ్యూనికేషన్ అక్కౌరట్స్ కంట్రోలర్‌తోపాటు ధన్‌బాద్‌లోని ఐఐటిలో పనిచేస్తున్న ప్రొఫెసర్ రవి గంగ్వార్ ఉరటారు. అలాగే రాష్ట్రం తరఫున రాష్ట్ర పెట్టుబడులు మౌలికాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇరధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, ఐటి శాఖ కార్యదర్శి, రాష్ట్ర ఫైబర్‌నెట్ ఎరడి డైరక్టర్లుగా ఉంటారు. గత 2023లోనే కేంద్ర ప్రభుత్వం అమెరడెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కిరద రూ.1,39 579 కోట్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిరచేరదుకు నిర్ణయిరచగా, 2.64 లక్షల గ్రామ పంచాయితీలకు ఫైబర్‌నెట్ అనసంధానం చేసేరదుకు లక్ష్యరగా నిర్దేశిరచుకున్నారు. ఇరదులో రాష్ట్రానికి సంబంధిరచి రూ.2,428 కోట్లు వ్యయం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 664 బ్లాక్‌లకు బిఎస్‌ఎన్‌ఎల్ ద్వారా కనెక్టివిటీ అరదిరచాలని నిర్ణయిరచారు. అలాగే ఇప్పటివరకు ఉన్న ఫేజ్ 1లోని నెట్ వర్క్‌ను అభివృద్ధి చేయడం, కొత్తగా 480 పంచాయితీలకు కనెక్టివిటీ ఏర్పాటుచేయడం, వాటి నిర్వహణపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

### విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేది లేదంటూనే అప్పనంగా అదానీ చేతిలో పెడుతున్నారు : పిసిసి అధ్యక్షురాలు షర్మిల

**విజయవాడ,డిసెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేది లేదంటూనే అప్పనంగా అదాని చేతిలో పెడుతున్నారని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ లేదని, అమ్మబోమని బిజెపి చెప్పేవన్నీ కల్లబొల్లి మాటలేనని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త నియామకాలు లేకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్లాంట్ భూములను అదానికి ధారాదత్తం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఒక్కొక్కటిగా అదానికి అప్పగిస్తూ రాష్ట్రాన్ని అదాని ప్రదేశ్‌గా మార్చాలని చూస్తున్నారన్నారు. విశాఖ ఉక్కును అమ్మే కుట్రలో కర్త మోడీ అయితే క్రియ చంద్రబాబు అని పేర్కొన్నారు. పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా నష్టాల సాకు చూపి ఉద్యోగులను వేధిస్తున్నారని తెలిపారు. పనికొద్ది జీతమని ప్రపంచంలో ఎక్కడా లేని రూల్స్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్టీల్ ఉత్పత్తికి కావాల్సి న ముడి సరుకును ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెడుతున్నారని పేర్కొన్నారు. విశాఖ ఉక్కును అమ్మేది లేదనిప్రధాని మోడీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

# ఆర్టీసి బస్సు ఢీకొని విద్యార్థి దుర్మరణం

**ఇందుకూరుపేట (నెల్లూరు), డిసెంబర్ 8, ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్సు ఢీకొని ఆరవ తరగతి చదువుతున్న పులి కిరణ్(9) అనే విద్యార్థి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని గంగపట్నం మజారా వెంకటరెడ్డి కాలనీకి చెందిన పులి ప్రదీప్ 9వ తరగతి, పులి కిరణ్ ఆరవ తరగతి చదువుతున్న అనే ఇద్దరు అన్నదమ్ములు సైకిల్ పంచర్ వేసుకునేందుకు గంగపట్నం వెళ్తుండగా వేపచెట్టు సెంటర్ వద్ద ఆర్టీసీ బస్సు వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొనడంతో కిరణ్(9) అనే బాలుడు అక్కడే మృతి చెందాడు. ప్రదీప్ స్వల్ప గాయాలతో భయపడ్డాడు. గత 7 నెలల కిందట తండ్రి పులి మురళి విద్యుత్ ఘాతంతో మృతి చెందడంతో తల్లి సంరక్షణలో ప్రదీప్ కిరణ్ జీవనం సాగిస్తున్నారు. అన్న ప్రదీప్ కళ్ళ ఎదుట మృతి చెందిన తమ్ముడు కిరణ్ మృతదేహాన్ని చూసి విలవిలాడిపోయాడు. భర్తను కోల్పోయి కూలీ, నాలి చేసుకుని తన ఇద్దరు బిడ్డలతో జీవనం సాగిస్తున్న తల్లి మృతదేహం వద్ద తల్లడిల్లిపోయింది.



విద్యార్థి ఫైల్‌ఫోటో

# తిరుమల సమాచారం

## 16 నుండి సుప్రభాతసేవకు బ్రేక్

### - ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలతో వెంకన్న మేల్కొలుపు

**తిరుమల,డిసెంబర్8 ప్రభాతవార్తప్రతినిధి :** వైఖానస ఆగమోక్తంగా పూజలందుకుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి వేకువజామున నిర్వహించే సుప్రభాతసేవ ఈనెల 16వతేదీ నుండి రద్దుచేశారు. ఆ స్థానంలో ధనుర్మాసం సందర్భంగా నెలరోజులపాటు గోదాదేవి తిరుప్పావై పాశురాలను వేదపండితులు ,ఆలయ అర్చకులు పారాయణం చేసి శ్రీవారిని మేల్కొలుపుతారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో సుప్రభాతసేవ స్థానంలో తిరుప్పావై పాశురాలు పఠించడం ఆనవాయితీ. తిరుమల, తిరుపతితో పాటు దేశవ్యాప్తంగా 233 కేంద్రాలలో




తిరుప్పావై పారాయణం జరుగుతుంది. ఈనెల 16 నుండి 2026 జనవరి 14వ తేదీ వరకు పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు. టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తిరుపతితో పాటు ఆంధ్రప్రదేశ్ 76 కేంద్రాలు, తెలంగాణ 57కేంద్రాలు, తమిళనాడు 73, కర్ణాటక 21, పాండిచ్చేరి 4, న్యూఢిల్లీ, ఒడిశాలో ఒకొక్క కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలోనూ ధనుర్మాసంలో సుప్రభాతం బదులు తిరుప్పావై నివేదించడం విశేషం. తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, కెటి రోడ్డులోని శ్రీ వరదరాజస్వామివారి ఆలయంలో తిరుప్పావై ప్రవచనాలు పారాయణం చేస్తారు. 12 మంది ఆళ్వారులలో ఒకరైన గోదాదేవి ధనుర్మాసం వ్రతం చేశారు. ఈ వ్రతం చేయడం వల్ల దేశం సమృద్ధిగా, సుభిక్షంగా ఉంటుంది. ద్వాపరయుగంలో గోపికలు ఈ వ్రతాన్ని ఆచరించి శ్రీకృష్ణుని కృపకు పాత్రులయ్యారని భాగవతం దశమ స్కందంలో పేర్కొనబడింది. ఈ తిరుప్పావై సారాంశం భగవంతునికి కైంకర్యం చేయడమే. దేశవ్యాప్తంగా గల అన్ని వైష్ణవ దేవాలయాలలో తిరుప్పావై శాత్తుమొర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

## బ్రహ్మోత్సవాల తరహాలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో సేవలు

### - భక్తుల భద్రతకు ప్రాధాన్యత : ఎస్పీ సుబ్బరాయుడు

**తిరుమల,డిసెంబర్8 ప్రభాతవార్తప్రతినిధి :** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి జరిగిన బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడం వెనుక పోలీసుశాఖ నుండి సహకారం అందించినట్లే రానున్న వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లోసేవలందించాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సూచించారు. ఆ రెండురోజులతోబాటు జనవరి 1న కూడా భక్తులు అశేషంగా తిరుమలకు వచ్చే



అవకాశం ఉన్నందున భద్రత పరంగా, భక్తులకు సేవలందించే విషయాలపై సోమవారం సాయంత్రం తిరుపతిలో పోలీస్ అధికారులతో సమీక్షించారు. తిరుపతి అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, రామకృష్ణ, నాగసుబ్బన్న, కులశేఖర్, ఎస్‌బి డిఎస్పీ జె.వెంకటనారాయణ, డిఎస్పీలు విజయశేఖర్, భక్తవత్సలం, శ్యామ్‌సుందర్, రామకృష్ణమాచారిలతో కలసి ఎస్పీ సుబ్బరాయుడు సమావేశం నిర్వహించారు. వైకుంఠద్వార దర్శనాల కారణంగా తిరుమలలో పెరగనున్న భక్తుల రద్దీని దృష్టిలోపెట్టుకుని ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ స్థలాలు, క్యూలైన్ల నియంత్రణ, చిన్నపిల్లలు, వృద్దులు తప్పిపోకుండా తీసుకోవాల్సి న జాగ్రత్తలు, హెల్ప్‌డెస్క్‌లు, ప్రత్యేక టీమ్‌లు విజిలెన్స్ సిబ్బందితో సమన్వయంగాపనిచేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో క్విక్‌రెస్పాన్స్ టీమ్స్, వైద్యసిబ్బంది సేవలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

## భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి: ప్రముఖులు

**తిరుమల,డిసెంబర్8 ప్రభాతవార్తప్రతినిధి :** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులందరిపై ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. ప్రభుత్వ విప్ గణబాబు, మాజీ మంత్రి ఆర్‌కెరోజా వేర్వేరుగా సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు.



ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# కల్తీనెయ్యికేసులో సిట్ కస్టడీకి మరో ఇద్దరు నిందితులు

**తిరుమల,డిసెంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరాచేసిన కేసులో లోతైన దర్యాప్తుచేపట్టిన సిబిఐ సిట్ అధికారులు ఇప్పుడు కీలకమైన ఇద్దరు నిందితులు కాంట్రాక్టర్ సుగంధి, టిటిడి పూర్వ మార్కెటింగ్ జిఎం సుబ్రమణ్యం లను కస్టడీకి తీసుకున్నారు. ఆ ఇద్దరి కస్టడీ పిటిషన్‌పై నెల్లూరు ఏసిబి కోర్టు న్యాయమూర్తి అనుమతివ్వడంతో సుగంధిని, సుబ్రమణ్యంను సిట్ అధికారులు నేడు నెల్లూరు జైలునుండి కస్టడీకి తీసుకోనున్నారు. నాలుగు రోజులు వారిని మరింత లోతుగా విచారణ చేసిన తరువాత కొంతమంది టిటిడి మార్కెటింగ్, కొనుగోళ్ళ విభాగం





అధికారులను విచారణకు పిలిచి అరెస్ట్ చేసే సూచనలు లేకపోలేదనితెలుస్తోంది. మంగళవారం నుండి శుక్రవారం వరకు ఆ ఇద్దరినీ సిట్ ఏమి ప్రశ్నించి వివరాలు రాబట్టనుందనేది సంచలనమే. ఈ కేసులో మాజీ టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు చిన్నఅప్పన్నను కటకటాల్లోకి పంపిన సిట్ అతని నుండి మరిన్ని ఆధారాలు సేకరించింది. ఇప్పటివరకు అరెస్ట్‌చేసిన నిందితుల నుండి రాబట్టిన వివరాలను పరిశీలించి తదుపరి అనుసరించాల్సి న వ్యూహంపై తీవ్రంగా చర్చించిందనేది సమాచారం. కల్తీనెయ్యి సరఫరాచేసిన పాపంలో అసలు సూత్రధారులైన గత టిటిడి పెద్దల అవినీతిగుట్టు రట్టయ్యే అవకాశం కూడా ఉండటంతో సిబిఐ సిట్ అధికారులు మరింత వేగం పెంచారు. 2022లో అప్పటి టిటిడి బోర్డు లో కొందరు అక్రమాలు భారీగానే ఉన్నాయని సిట్ అధికారులు ఆధారాలు సేకరించారు. మరింత కీలక సమాచారం సేకరించడానికి సుగంధి, సుబ్రమణ్యంలు కస్టడీకి తీసుకుని విచారణచేయబోయే అంశాలు హాట్‌టాఫిక్‌గా మారాయి. బోలేబాబాడెయిరీతోబాటు ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీ, ప్రీమియర్‌అగ్రిపుడ్స్‌తో ఒప్పందంతో భారీగా కమీషన్లు రాబట్టారనేది సిట్ విచారణలో వెలుగుచూసిన అంశాలు. ఆ ఇద్దరి విచారణతో కల్తీనెయ్యి బాగోతంలో ముందుముందు ఎవరికి నోటీసులు వెళ్తాయో, ఎవరిని విచారణకు పిలిచి చర్యలు తీసు కుంటారనేది అందరి లో ఉత్కంఠే.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
టెండర్ ప్రకటన
బాక్స్ టెండర్ ప్రకటన నెం. 28/TO/2025-26, తేది: 02.12.2025
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, R&B డివిజన్, విజయవాడ వారు ఒక పని కొరకు టెండర్ కోరుతున్నారు. అంచనా మొత్తం ఒక పని కొరకు: రూ.0.20 లక్ష నెలకు. టెండర్ స్వీకరణకు చివరి తేది: 08.12.2025 నుండి 22.12.2025 మ.3.30 గం. వరకు. తదుపరి వివరాలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, R&B డివిజన్, విజయవాడ సంప్రదించవచ్చును. ఫోన్: 9440818641.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, R&B డివిజన్, విజయవాడ
DIPR.No.18303/CL/Advt/1/1/2022-23, తేది: 08.12.2025


వార్త

పూర్వీకుల ఘనత మీద బతికే వారిని మృతవీరుల జాబితాలో చేర్చవచ్చు.

-లాసన్


# అపూర్వ 'అణు'బంధం!

భారత్ రష్యాల స్నేహం విడదీయలేనిదని, ఎల్లప్పుడూ ధ్రువతారలా వెలుగులీనుతూనే ఉంటుందని మరోసారి వెల్లడైంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ కూడా అదే విషయాన్ని నొక్కి చెప్పారు. నిజానికి ఈ రెండు దేశాల మధ్యస్నేహబంధంఈనాటిది కాదు. భారత స్వాతంత్ర్యానంతరం దేశ పారిశ్రామిక ప్రగతికి సాంకేతికతను అందించిన దేశంగా రష్యా పట్లభారతీయులందరికీ కృతజ్ఞత ఉంది. అదే ఇప్పుడు తాజాగా ఆ రెండు దేశాల పాలనాధ్యక్షుల మధ్య భేటీకి దారులు తెరచింది. భారతీయ సంప్రదాయాలను, రుచులను విదేశీ అతిథులకు పరిచయం చేయడంలో మనదేశం ఎప్పుడూ ముందుంటుంది. భారతీయతను చాటి చెప్పిన తర్వాతనే అవతలి వారితో ఒప్పందమైనా, స్నేహశీలతను ప్రకటించడమైనా. భారత్ పై అమెరికా ప్రతీకార సుంకాలు,ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఇరు దేశాలు తమ ఆర్థిక ,వాణిజ్య భాగస్వామ్యాన్ని బలపరచుకునేందుకు ఈ భేటీ బాగా ఉపయోగ పడింది. ప్రధానంగా ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు భారత రష్యాలు కలిసి పని చేస్తాయి.వార్షిక ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పది వేలకోట్ల డాలర్లకు పెంచింది. విశేషంగా ఉక్రెయిన్‌తో యుద్ధానికి శాంతియుతంగా ముగింపు పలకాలంటూ ప్రధాని మోడీ పుతిన్‌ను వేడుకోవడం ఇతర దేశాలతో సంబంధాలు ఎలా ఉండాలో ప్రత్యేకించి చెప్పినట్లయింది. భారత్ రష్యా బిజినెస్ ఫోరంలో మోడీ, పుతిన్‌లు పాల్గొవడం భారత్ సుస్థిరాభివృద్ధికి రష్యా బాసటగా ఉంటుందని పుతిన్ భరోసా ఇవ్వడం చెప్పుకోదగిన సందర్భం. సుదీర్ఘ కాలంగా రష్యా, భారత్‌ల సంబంధాలు సజావుగా కొనసాగడానికి ఢోకా లేనివిధంగా అడుగులు పడ్డాయి. గత 8దశాబ్దాల్లో మానవాళి అనేక సవాళ్లు సంక్షోభాలను ఎదుర్కొంది. వాటన్నింటినీ తట్టుకుంటూ భారత్‌రష్యా మైత్రి ధ్రువతారలా నిలిచిందన్న భావనల బలిమి కలిగింది.పరస్పర గౌరవం, బలమైన విశ్వాసం, అనే పునాదులపై ఈ బంధం శాశ్వతమైనదని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉద్ఘాటించడంతో ఆయన రెండురోజుల భారత పర్యటన ముగిసింది. అందువల్ల ద్వైపాక్షిక సంబంధాలతోపాటు ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలూ మరింత బలపడతాయని ఆయన ఆకాంక్షించారు. పుతిన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో శుక్రవారం జరిపిన శిఖరాగ్ర సమావేశంలో ఇరు దేశాల మధ్య మొత్తం 16 కీలక ఒప్పందాలు కుదిరాయి. నైపుణ్య కార్మికుల వలసలకు రష్యా వెసులుబాటునిచ్చింది.భారత కూడా అదే స్ఫూర్తితో స్వాగతం పలికింది. ఆరోగ్యం, ఆహార భద్రత, శాస్త్రీయ పరిశోధనలు, నౌకాయానం, ఎరువులు, విద్య వంటి రంగాల్లో పరస్పర సహకారం పెంపునకు దోహదపడే అంశాలే ఉన్నాయి. వాణిజ్య లోటును పూడ్చుకోవడంలో మాస్కో ఢిల్లీకి సాయపడనున్నాయి. ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఐలోపేతం చేసుకోవడంపై చర్చించారు. భారత్,రష్యాల మధ్య ప్రస్తుతం ఏటా 64బిలియన్ల డాలర్ల వాణిజ్యం జరుగుతుండగా 100 బిలియన్ డాలర్‌లకు పెంచుతూ రష్యన్ అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. భారత్ ఇంధన అవసరాలను తామే పూర్తిగా తీర్చగలమని భరోసా దొరికింది. చమురుగా, గ్యాస్, బొగ్గు విషయంలో కూడా ఇదే పద్ధతి అనుసరించేందుకు రష్యా ముందుకొచ్చింది.భారత్ ఉత్పత్తుల కోసం రసాయన మార్కెట్లను నిరంతరం అందుబాటులో ఉంచేందుకు సిద్ధమని ఆయన ప్రకటించారు. వ్యవసాయం, ఔషధ రంగంలో కీలకమైన అణు టెక్నాలజీ వాడుకునేందుకు భారతకు పూర్తి స్థాయిలో సహకరించనున్నామని, ఆ మేరకు ఒప్పందం కూడా జరిగింది.భారత్, రష్యా మధ్య మానవ వనరుల రాకపోకలను సులభతరం చేసేలా రెండు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇరుదేశాలు కలిసి ఐక్యంగా సాగుదామన్న పుతిన్ ఆలోచనకు భారతీయుల్లో విశేషఖ్యాతి లభించింది. గురువారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న పుతిన్కు ప్రధాని మోడ్స్ స్వయంగా ఎయిర్పోర్టుకు వెళ్లి స్వాగతం పలికినవిషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం పుతిన్కు రారక్షణ, ఇంధనంసహా అనేక రంగాల్లో ఇరుదేశాల సహకారాన్నిమరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్చలు సాగాయి. ఈ పర్యటన సందర్భంగా పుతిన్‌కు ప్రధాని మోడీ వివిధ బహుమతులు అందించారు. ఇందులో భగవద్గీత రష్యన్ ఎడిషన్,కాశ్మీరీ కుంకుమ పువ్వు,అసోం బ్లాక్‌టీ, బెంగాల్ ముర్షిదాబాద్ కు చెందిన వెండి టీ సెట్, మహారాష్ట్ర హస్త కళా తయారీ వెండి గుర్రం, ఆగ్రా నుంచి తెచ్చిన మార్బుల్ చెస్ సెట్ వంటివి ఉన్నాయి. ఇలా దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలకు ఆస్కారమిచ్చే ఆయా దేశాల ప్రాముఖ్యత కలిగిన కానుకలను ఇచ్చి పుచ్చుకోవడం ఓ సాంస్కృతిక మర్యాదగా బాసిల్లుతుంది. భారత్, రష్యాల మధ్య కుదిరిన ఒప్పందాలన్నీ ఐదేళ్ల పాటు ఉండే ఆర్థిక ఒప్పందాలు 'పంచవర్ష ప్రణాళిక'గా చెప్పాలి. తమిళనాడులోని కూడంకుళం అణువిద్యుత్ కేంద్రాన్ని, ప్లాంట్ నిర్మాణాలను త్వరలో వినియోగంలోకి తెచ్చేందుకు రష్యా హామీ ఇచ్చింది.భారత్ ప్రగతికి కాలొడ్డిన అమెరికా ప్రస్తావించిన అన్ని అంశాలకూ రష్యా భరోసా లభించడం ఆహ్వానించదగిన పరిణామం.రష్యాతో ఎలాంటి వాణిజ్య ఒప్పందాలు వద్దన్న అమెరికాను కానీ యూరప్ ఒత్తిళ్లకు గానీ లొంగని భారతీయ పాకుల వైఖరి ప్రశంస నీ యం. భారత్, రష్యాల మధ్య బంధం అత్యంత వ్యూహాత్మకమైనదని, వారి భేటీ ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని పంపినట్లుగా చైనా అభివర్ణించింది.



కోపాన్ని జయించలేని వాడికి ఇతరుల సామర్థ్య లోపాన్ని విమర్శించే హక్కు ఉండదు.

ఇ. గిబ్బన్



పుస్తకాలు మాత్రమే చదవకు. మనుషులను కూడా చదువు. ముఖ్యంగా నిన్ను నీవు చదువుకో.

ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



### వినూత్న కార్యక్రమాలు

పాఠశాల విద్యార్థుల్లో భూభౌగోళికఅవగాహన, స్థల నిర్ధారణ సామర్థ్యం, విశ్లేషణాత్మక ఆలోచన వంటి నైపుణ్యాలుపెంపొందించాల్సి నఅవసరంరోజురోజుకూ పెరుగుతోంది.పటాల శాస్త్రంపై ఆసక్తి కలిగించే కార్యక్రమాలు విద్యార్థులలో కొత్త అన్వేషణా భావనకు దారితీస్తాయి. ఇటీవలి కాలంలో పటాలఆధారిత ప్రశ్నోత్తర కార్యక్రమాలు, పటం పరిశీలనపై ఆధారితమైన కార్యకలాపాలుపాఠశాల స్థాయిలో మంచి స్పందనను పొందుతున్నాయి. ఇవి విద్యార్థులకు పాఠ్యపుస్తక పరిజ్ఞానాన్ని ప్రపంచంతో అనుసంధానం చేసే అరుదైన అవకాశాన్ని కల్పిస్తున్నాయి. భౌగోళిక స్థితిగతులు, దూరాల అంచనా, దిశలను గుర్తించడం, ప్రకృతి వైవిధ్యాలను పటాల రూపంలో అర్థం చేసుకోవడం వంటి అంశాలు భవిష్యత్తు విద్యా, వృత్తి రంగాల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు చిన్న వయసులోనే పటాల శాస్త్రంపై అవగాహన కల్పించడం అభినందనీయమైన విషయం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### ఆలోచించాల్సిందే..

పాలన ఎంత బాగా చేసినా ప్రజలకు ఎన్ని సంక్షేమ పథకాలు అందించినా కొంత కాలానికి ప్రభుత్వాలపై వ్యతిరేకత రావటం సహజం. ప్రజావ్యతిరేకత కారణంతోనే రాష్ట్రాలలోప్రభుత్వాలుమారుతుంటాయి.అయితే ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలోనే ఇలా జరుగుతోందని కాని బిజెపి పాలిత రాష్ట్రాలలో కాదు. ఇదంతా చూస్తుంటే ఎక్కడో ఏదో గోల్‌మాల్ జరుగుతోందని కొత్త ఓట్లను సృష్టిస్తున్నారని ఉన్న ఓట్లను మాయం చేస్తున్నారనే మాట నిజమేననిపిస్తోంది.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### అసత్య ప్రచారాన్ని నమ్మకూడదు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచేది తామేనని మా సీటు మాకే దక్కబోతోందని నవంబరు 14వ తారీఖు నుంచి బిఆర్ఎస్ దశ తిరగబోతోందని ఆ రోజు నుంచే కాంగ్రెస్ పతనం కూడా ప్రారంభం కాబోతోందని రెండేళ్ల నుంచి రేవంత్ రాష్ట్రానికి ఏమీ చేయలేదని ఎన్నికల ప్రచార సభల్లో చెప్పుకున్నారు బి.ఆర్.ఎస్‌నాయకులు.అయితే వారు అన్నవి ఏవీజరగలేదు. వారుకన్న కలలు కల్లలయ్యాయి.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### భగవద్గీత గురించి తెలుసుకోవాలి

భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించే నాటికి అమెరికా రష్యాలు రెండుఅద్వితీయ శక్తులుగా ఉండేవి.స్వతంత్ర భావాలతో జీవించాలనే ఉద్దేశంతో వాటికిదూరంగా ఉంటూనే శత్రుత్వం పెంచుకోకుండా రెండిట్లోని మేలువిధానాలను ఎంచుకొని అలీన విధానాన్ని రూపొందించారు ప్రథమ భారత ప్రధాని, నవభారత నిర్మాత,పండిట్ జవహర్లాల్ నెహ్రూగారు.ఇటీవల రష్యా అధ్యక్షులు పుతిన్ గారు భారత పర్యటనకు వచ్చినప్పుడు ఆయనకు నరేంద్ర మోడీ జీ భగవద్గీతను బహుకరించారు. నిజానికి భగవద్గీతను మోడీజీ ఏనాడూ చదవలేదు,చదవలేరు కూడా. ఎవరైనా చెప్తే వినడంతెప్పించి దానిని స్వతంత్రంగా అర్థం చేసుకునే శక్తి ఆయనకు లేదు. నిజానికి ఆ పుస్తకం మీద ప్రమాణం చేసి న్యాయస్థానాల్లో న్యాయాన్ని చెప్పడం కూడా అర్థరహితమే అనిపిస్తూ ఉన్నది. ఆ పుస్తకంలో ఏముందో జడ్జిలకు కూడా తెలియదు అన్నది కఠోర సత్యం. ఇక నేరస్తులకు ,నేరస్తులనే పేరుతో బోనులో ప్రవేశపెట్టిన వారికి కూడా తెలియదన్నది కూడా నిజం. జననంఎంత సహజమో మరణం అంతే సహజం. చంపడానికి దేవుడే కారణం అని చెప్పడం అర్థరహితం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### శబ్దకాలుష్యాన్ని నియంత్రించాలి

భారత్ క్రికెట్‌జట్టు మ్యాచ్ గెలిచినా ఏదైనా టోర్నమెంట్‌లో కప్ కొట్టుకొచ్చినా క్రికెట్ అభిమానులు హాపీగా ఫీలవుతారు. అయితే ఆ హాపినెస్‌ని పరస్పరంఅభినందనలు తెలుపుకోవటంతోనుమిఠాయిలు పంచుకోవటంతోను ఆపేయాలి. లేదూ చిచ్చుబుడ్లు,చక్రాలు, కాకరపువ్వొత్తులు, మతాబులతోను సరిపెట్టుకోవాలి. అంతేకాని వృద్ధులు, రోగులు, మహిళలు, పసిపిల్లలు నిద్రించే సమయంలో పెద్ద శబ్దాలు వచ్చే బాంబులు, సీమటపాకాయలు పేల్చటం సరికాదు. ఒకరి సంతోషం మరొకరిని ఇబ్బంది పెట్టేలా ఉండకూడదు.

- మిథునం, హైదరాబాద్

### క్షేత్ర స్థాయి విచారణలు అవసరం

వివిధ రకాల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదులు చేసిన దరఖాస్తుదారుని వద్దకు వెళ్లి క్షేత్ర స్థాయిలో సమస్య పరిష్కారం చేయాలి. విచారణ చేయకుండా రిపోర్ట్ రాయడం సరి కాదు. అధికారులు పరిస్థితిని ఫోటోలు తీయాలి. అడగాలి పరిశీలించి న్యాయం చేయాలి.

- రాపాక రవీందర్, జనగాం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పోలీసుల్లో మార్పు ప్రజలే తేగలరు!

**మన దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలలో పోలీసుల ప్రవర్తన వల్ల, అవినీతి వల్ల అనవసరపు కఠినత్వ ప్రదర్శన వల్ల ప్రజలకు దూరమవుతున్నారు. ప్రభుత్వాలు ఎన్నో సంస్కర ణలు ప్రవేశపెట్టదల్చుకున్నా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. సైబర్ నేరాలు కృత్రిమ మేధస్సుతో ఉబికివస్తున్న వైవిధ్య భరిత ప్రశ్నలకు దీటుగా కార్యాచరణ ఇంకా సీరియస్‌గా పాలకులు తలపెట్టలేదు. పైపెచ్చు వారి రాజకీయ ప్రవర్తన రాజ్యాంగ వ్యతిరేకంగా పోలీసులను పార్టీల కార్యకర్తలుగా మార్చే పరిస్థితి ఏర్పడుతున్నది. దీనిని తక్షణం అధిగమించగలుగుతేనే నాలుగు రోడ్ల కూడలి నుంచి నిర్ణీత మార్గంలో సమాజానికి సేవ చేసే మార్గంలో ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. బ్రిటిష్ వారిచ్చిన కాలం చెల్లిన యూనిఫాం మార్చటంతో పోలీసుల్లో మార్పురాదు. మనదేశానికి పనికివచ్చే తీరులో పోలీసుల పని తీరులో మార్పును స్పష్టంగా తేవాలి.పోలీసు చట్టాన్ని కాపాడటంతో పాటు అమలు చేయాలి. చట్టాలను చుట్టాలుగా మార్చుకున్న పాల కుల చట్రంనుంచి పోలీసులు బయటపడ్డప్పుడే పోలీసును సమాజం ప్రేమిస్తుంది. సహకరిస్తుంది. ప్రజలు ప్రభుత్వాలు పూనుకుంటేనే అలాంటి మార్పు సాధ్యమవుతుంది.**



రావులపాటి సీతారాంరావు

ప్రభుత్వంలో ఒక భాగమైన పోలీసు వ్యవస్థ ప్రస్తుతం నాలుగు రోడ్ల కూడలిలో దిక్కుతోచకఉందా అన్న భావన ప్రజల్లో కలుగుతున్నదని చాలా మంది భావిస్తున్నారు. ప్రభుత్వంలోని ఇతర విభాగాలు కూడా ఉదాహరణకు,రెవెన్యూవ్యవస్థ, టాక్స్‌లు వసూలు చేసే వ్యవస్థ వ్యవసాయానికి చెందిన వ్యవస్థ, అడవులకు సంబంధించిన, విజ్ఞానాన్ని ప్రసాదించే చదువుల వ్యవస్థల్లాంటివి నాలుగు కూడళ్ల మధ్యలేవా అని ప్రశ్నించే ఆలోచన ఎవరికైనా కలగొచ్చు. పోలీసు వ్యవస్థకు మాత్రమే ప్రత్యేకంగా ఎందుకీ ప్రస్తావన? అడుగుతే జవాబు మాత్రం ఒక్కటే. దాదాపు కొన్ని వ్యవస్థలకే పరిమితమైన విభిన్న బాధ్యతలతో పోలీసు శాఖ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాల్సిన అవసరం ఉంది. కాబట్టి చట్టాలను అమలు చేసే అతి ముఖ్యమైన బాధ్యత ఆ శాఖకే ఉంది కాబట్టి. వ్యక్తిగత స్వేచ్ఛను అవసరం అనుకుంటే సంస్థల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కూడా కట్టడి చేసేఉద్యోగం, ప్రజాస్వామ్యపరంగా రాజ్యాంగపరంగా ఆ శాఖకే సంక్రమించింది. కాబట్టి పోలీసు వ్యవస్థ పనితీరు భూతద్దంలో చూడకతప్పదు. ఆశాఖ వ్యవహార దక్షతనూ, పనితీరునూ జవాబుదారీతనాన్ని ప్రతి నిముషమూ ప్రశ్నించక తప్పదు. భూమితోపాటు మానవాళి ఈ ప్రపంచంలో భాగంగా ఉద్భవించి మమేకమై మొదట్లో సర్వ స్వతంత్రంగా గమనాన్ని సాగిస్తూ, తర్వాత తర్వాత చిన్నా భిన్నమైన సమూహాల నియంత్రణ, ధర్మం, న్యాయం, అవసరమని అనుభవం ద్వారా గుర్తించి తమంతట తామే క్రమశిక్షణ, జవాబుదారీతనం కోసం కొన్ని నియమాలు ఏర్పరుచుకొని ఆ నియమ నిబంధనలను అమలు చేసేందుకు ఒక సంస్థ తప్పనిసరి అని గుర్తించి, ఎవరికి తోచిన రీతిలోవారు కట్టుబాట్లు ఏర్పరుచుకొని, నియంత్రించటానికి, రక్షించుకోటానికి ప్రతి దేశంలోనూ, పోలీసు వ్యవస్థను ఏర్పరుచుకున్నారని మానవ చరిత్ర చెబుతున్నది. పోలీసు అన్న పేరే కానక్కర్లేదు. వివిధ పేర్లతో క్రమేపీ రక్షణ కోసం మానవాళిలో పొడచూపుతున్న నేర ప్రవృత్తి కట్టడి కోసం భౌగోళికంగా ఏర్పడిన ప్రతి ఖండంలోనూ ఈ సంస్థ ఉద్భవించి అలరారుతున్నది. పోలీసుల పుట్టుక, గత చరిత్ర ప్రస్తుతం అప్రస్తుతం కానీ రేఖా మాత్రంగా ఏ రూపంలో, ఎందుకోసం పోలీసులు పుట్టుకొచ్చారు అని జ్ఞప్తికి తెచ్చుకోవటానికి మాత్రమే ఈ నేపథ్యం ఇవ్వాల్సివచ్చింది. అసలు విషయానికి వస్తే మనదేశంలోని పోలీసులు అనతికాలంలోనే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మంచి పేరు సంపాదించుకున్న మాటనిజం. నేరాలు నిరోధించటంలోనూ, నేరాల దర్యాప్తులోనూ, పరిశోధనలోనూ, ఇతర దేశాల పోలీసులకు ఏమాత్రం తీసిపోని విధంగా, నైపుణ్యాన్ని ప్రతిభను ప్రదర్శించుకోవటమే కాకుండా ఇతర దేశాల ప్రభుత్వాలు ఎదు




ర్కోని గడ్డు సమస్యలను అతి చాకచక్యంగా పరిష్కరించుకోగలిగారు. దేశంలో ఉగ్రవాదుల చర్యలను తీవ్రవాదుల సమస్యను గణనీయంగా అణచివేయడంలోనూ అతి త్వరలోనే అనుభవాన్ని గడించి,ఫలితాలు సాధించారు. ముఖ్యంగా పంజాబ్‌లో కొన్నేళ్లక్రిందట ఎదుర్కొన్న, ఖలిస్తాన్ వేర్పాటు వాదాన్ని నియంత్రించటంలో శ్రీలంక ఎల్.టి.టి.ఇ సమస్యను పరిష్కరించటంలో ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ లాంటి నాయకులను కోల్పోయినా పోలీసులు సమర్థవంతంగా ఇతర బలగాల తోడ్పాటుతో శాంతి భద్రతలను కాపాడగలిగారు. వి.ఐ.పిల బందోబస్తు, ట్రాఫిక్ సమస్య, ప్రాంతీయవాదాల చిక్కుముడులు, కులమత వర్గవైషమ్యాలు వెలికి తెచ్చే శాంతిభద్రతల సవాళ్లు నిత్యమూ ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. సమస్యలకు తగ్గ బలగాలు అందుబాటులలోని పరిస్థితి. నిష్పత్తి పరంగా ర్యాంకులపరంగా సంఖ్యల్లో కొరత కొట్టొచ్చేట్లు కనపడుతున్నా పోలీసులు వెనక్కి తగ్గకుండా అహర్నిశలూ పనిచేస్తూ ఎత్తిన జెండాను కిందకు దింపకుండా కష్టాలను అధిగమిస్తున్నారు. సానుకూలంగా సమీక్షిస్తే వివిధ రకాల ఇబ్బందులకూ, సవాళ్లకూ, జవాబు ఇవ్వగలుగుతున్నా నిజానికి ఫైర్ ఫైటిగ్ ఆపరేషన్స్‌తోనే కాలం గడుపుతున్న నిజాన్ని ఎవరూ కాదనలేరు. ఇప్పటివరకూ వ్యవస్థ నిత్యమూ ఏర్పడుతున్న ప్రతిబంధకాలనూ, గడ్డుకాలాన్ని అధిగమిస్తూ అనుభవం వల్ల వెసులుబాట్లు కల్పించుకుంటూ ముందడుగు వేస్తున్నది. అయితే ముందు ముందు ఇలాంటి గుడ్డిలో మెల్లలాంటి సంతృప్తి కలిగించే వాతావరణమూ, పరిస్థితులూ, పరిణామాలు ఉండకపోవచ్చు. ఆధునిక యుగంలో అనుకూల మార్పులతోపాటు వ్యతిరేకత మూటగట్టుకొని వచ్చే మార్పులను కాదనక తప్పదు.పోలీసువ్యవస్థ తనను తాను సంస్కరించుకొని ప్రజలకు సానుకూలంగా తయారుకాక తప్పదు. స్థూలంగా రిక్రూట్‌మెంట్, శిక్షణల్లో మార్పులతోపాటు వ్యవహారశైలి కూడా పోలీసులు మార్చుకోక తప్పదు. సమాజంలో పోలీసుల జోక్యం జనాభావారీగా 10 శాతం మించి ఉండదు. తొంభై శాతం ప్రజలకు పోలీసుల రక్షణ మానసిక తృప్తి కలిగించేదే. ట్రాఫిక్ బందోబస్తు వ్యవహారాల్లో మాత్రమే పోలీసులు ప్రత్యక్షంగా తోడ్పడగలరు.ఆవిధంగా విహంగ వీక్షణంగా పోలీసు చేతలను గమనించవచ్చు. మారిన కాలంలో కొన్ని గడ్డు సమస్యలు పోలీసులు వృత్తిపరంగా ఎదుర్కోక తప్పటం లేదు. ఇతర దేశాల్లో పోలీసులతో భయంతోనో, గౌరవంతోనో ప్రజలు వ్యవహరించగలుగుతున్నారు. మన దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాలలో పోలీసుల ప్రవర్తన వల్ల, అవినీతి వల్ల అనవసరపు కఠినత్వ ప్రదర్శన వల్ల ప్రజలకు దూరమవుతున్నారు. ప్రభుత్వాలు ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టదల్చుకున్నా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. సైబర్ నేరాలు కృత్రిమ మేధస్సుతో ఉబికివస్తున్న వైవిధ్య భరిత ప్రశ్నలకు దీటుగా కార్యాచరణ ఇంకా సీరియస్‌గా పాలకులు తలపెట్టలేదు. పైపెచ్చు వారి రాజకీయ ప్రవర్తన రాజ్యాంగ వ్యతిరేకంగా పోలీసులను పార్టీల కార్యకర్తలుగా మార్చే పరిస్థితి ఏర్పడుతున్నది. దీనిని తక్షణం అధిగమించగలుగుతేనే నాలుగు రోడ్ల కూడలి నుంచి నిర్ణీత మార్గంలో సమాజానికి సేవ చేసే మార్గంలో ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. బ్రిటిష్ వారిచ్చిన కాలం చెల్లిన యూనిఫాం మార్చటంతో పోలీసుల్లో మార్పురాదు. మనదేశానికి పనికివచ్చే తీరులో పోలీసులపనితీరులోమార్పును స్పష్టంగా తేవాలి.పోలీసు చట్టాన్ని కాపాడటంతో పాటు అమలు చేయాలి. చట్టాలను చుట్టాలుగామార్చుకున్న పాలకుల చట్రంనుంచి పోలీసులు బయటపడ్డప్పుడే పోలీసును సమాజం ప్రేమిస్తుంది. సహకరిస్తుంది. ప్రజలు ప్రభుత్వాలు పూనుకుంటేనే అలాంటి మార్పు సాధ్యమవుతుంది. ●

# అవినీతి అంతమే యువత నినాదం

ఆచార్య : బుర్ర మధుసూదన్ రెడ్డి


నేటి ప్రపంచ మానవాళి పలు సవాళ్లు, అసమానతలు, అన్యాయాలు, విషాదాలు, మారణహోమాలు, అపరిమిత అవినీతి చేష్టలు లాంటి సమస్యలతో సతమతం అవుతున్నది. ప్రపంచ యువత అనేక రంగుల కలలు, ఎదగాలనే ఆకాంక్షలతో ముందుకు సాగడానికి ప్రయత్నాలు చేస్తున్నవేళ అవినీతి, లంచగొండితనం లాంటి చెదలు వారిని ఎదుగుదలను/ ఉద్యోగ ఉపాధులను/విద్యా అవకాశాలను/నైపుణ్య ప్రదర్శనలను/వైద్య ఆరోగ్య సంరక్షణను అడ్డుకోవడం,యువతలో అశాంతికి ఆజ్యం పోయడం జరుగుతున్నది. దీనికి తోడుగా అవినీతి చెదలు విస్తరిస్తూ పర్యావరణ విధ్వంసం, ప్రతికూల వాతావరణ మార్పులకు కారణం అవుతున్నది. ప్రపంచవ్యాప్త దాగాపు 2బిలియన్ల యువత అవినీతికి వ్యతిరేకంగా ప్రమాణం చేసి, బలీయ శక్తిగా ఎదిగి, నైతికతకు పట్టం కట్టి, అక్రమాల కట్టడికి నడుం బిగిస్తేనే ఉజ్వలభవిత దర్శనమిస్తుందని తెలుసుకోవాలి. ప్రపంచ యువత నైతిక ప్రవర్తన, పారదర్శకత, జవాబుదారీతనాన్ని డిమాండ్‌చేస్తూ అవినీతి నిర్మూలనకు పూనుకోవాలని, ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ప్రపంచమే ఒక యుద్ధ క్షేత్రంగా మారి మానవత్వం మసకబారుతుందని గుర్తుంచుకోవాలి. ఆధునిక పౌర సమాజంలో వేళ్లూనుకుపోయిన అవినీతి చెదలు, లంచాల పీడలను పెకిలించడానికి యువశక్తి మాత్రమే చొరవ చూపాలి. యువతలో అవినీతి నిర్మూలన పోరాటాగ్నిని రగల్చడానికి ఐరాస నేతృత్వంలో 2004 నుంచి ప్రతి ఏటా 09 డిసెంబర్ రోజున ప్రపంచ దేశాలు అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినం(ఇంటర్నేషనల్ ఆంటీకరప్షన్ డే) పాటించుట జరుగుతోంది. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం 2025 ఇతివృత్తంగా అవినీతి నిర్మూలనతో మానవ గౌరవానికి ప్రోత్సాహం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. అవినీతి నిర్మూలనకు యువ యోధుల్లో నైతిక ప్రవర్తన, నీతివంతమైన సమాజ స్థాపన, లంచగొండి గుణాలను పాతరేయడం, నీతి నిజాయితీల ప్రాధాన్యాన్ని పలు వేదికల్లో చర్చించడం, అక్ర మార్కుల భరతం పట్టడం,లంచావతారులను అవినీతి నిరో ధక శాఖ ద్వారా పట్టించడం, నీతిమంతులను సన్మానించడం, పారదర్శక పాలన ప్రయోజనాలను అవగాహన పర్చ డం, అవినీతికి వ్యతిరేకంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది హాష్ట్యాగ్‌గా యునైటెడ్ అగెనిస్ట కరప్షన్ అనే నినాదాన్ని తీసుకున్నారు. భారత్‌లో అవినీతి, లంచగొండిత నం నిత్య నినాదంగా, సర్వవ్యాప్తం అయింది. వార్డు మెంబర్ నుండి ఎంపీ వరకు, సర్పంచ్ నుంచి కేంద్ర మంత్రి వరకు ఎవ్వరి చరిత్ర చూసినా అవినీతి, అక్రమార్జనల కంపు కొడుతున్నది. లంచం ఇవ్వనిదే చిన్న చీమైనా కుట్టడం లేదు. అవినీతి చేయని అధికారి కనిపించడం అసాధ్యంగా తోస్తున్నది. నిత్యం అవినీతి నిరోధక శాఖ పన్నిన వలలో అవినీతి తిమింగలాలు పడుతూనే ఉన్నాయి. అనివీతి నిర్మూలనకు చేసిన చట్టాలకు లంచాల కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నాయి. మన దేశంలో అవి నీతి నిర్మూలన చట్టం 1988, భారతీయ న్యాయ సంహిత2023, లోక్‌పాల్, లోకాయుక్త, విజిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ ఆక్ట్2014, సివిసీ, సిబిఐ, రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ లాంటివి భారత్‌లో అమలు అవుతున్నాయి. ప్రపంచ దేశాల్లో అవినీతిని కొలిచే సూచికలను ట్రాన్స్ ఫరెన్సీ ఇంట ర్నేషనల్ అధ్యయనం చేసి వివిధ దేశాల జాబితాను తయారు చేస్తు న్నది. 2025లో విడుదలైన గ్లోబల్ కరప్షన్ పర్‌సెప్షన్ ఇండెక్స్(ప్రపంచ అవినీతి సూచీ) ప్రకారం 180 దేశాల జాబితాలో భారత్‌కు 96వ స్థానం దక్కింది. ప్రపంచ వ్యాప్తంగా అవినీతిని అంతం చేయడానికి యువతను ఏకం చేస్తూ శక్తివంతం చేయడం, ప్రపంచ వ్యాప్తంగా సంఘీభావం ప్రకటించడం, చట్టాల అమలు, ప్రభుత్వ పని తీరును మెరుగుపరచడం లాంటి చర్యలు నిరంతరం ఉద్యమంగా కొనసాగాలి. ప్రతి ఒక్కరు 'అవినీతికి నో' చెప్పాలి. అవినీతి, అక్రమార్జన, అధికార దుర్వినియోగం, మోసాలు, లంచాలు లాంటి దురాలోచనలు ప్రపంచాభివృద్ధి కి ప్రతిబంధకాలని తెలుసుకోవాలి. అవినీతి శృంఖలాలను ఛేదిద్దాం,అక్రమార్జన పరుల భరతంపడదాం, నైతిక ప్రవర్తన ఆయుధాలను సిద్ధం చేద్దాం. మనందరం ఏకమైతే, లంచగొండితనం తోక ముడుస్తుంది. అవినీతి ఆలోచన మానవాళి అభివృద్ధికి గొడ్డలి పెట్టు, దేశభక్తి గొడ్డలితో అవి నీతి విష వృక్షాన్ని నిర్దయగా నరికేద్దాం. అవినీతి అంతమే యువత నినాదం కావాలి. ●

# నాయకుల ఎంపికకూ వేలం పాటలా?



డాక్టర్ నీలం సంపత్

పల్లెలే దేశానికి పట్టు గొమ్మలు, స్థానిక స్వపరిపాలన ద్వారానే గ్రామాల అభివృద్ధి జరుగుతుంది. తద్వార దేశ సర్వతోముఖాభివృద్ధికి రాచబాటలు ఏర్పడతాయి.భారత దేశ ఆత్మ పల్లెల్లోనే వుంది.రాజకీయాలకు అతీతంగా గ్రామాలకు ఎన్నికలుజరిపి ఆయా గ్రామాలలో ప్రజల సర్వతోముఖాభివృద్ధికి నిస్వార్థ సేవతో కృషి చేసే సామర్థ్యంతో పని చేయాలని భావించే నాయకులనే ప్రజా ప్రతినిధులుగా ఎంపిక చేసుకునే వెసులుబాటును ప్రజలకు స్వతంత్ర ప్రతిపత్తి గలిగిన రాజ్యాంగ సంస్థ అయినఎన్నికల కమిషన్ కల్పించిన విషయం బహిరంగ రహస్యమే.ఆ ఎన్నికల ప్రక్రియలో భాగంగానే నేడు తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఎన్నికల జాతర కోలాహలంగా కొనసాగుతోంది. సదరు ఎన్నికల్లో వేలం పాటలతో విజేతల ఎంపిక జరగకుండా, సమర్థులైన అభ్యర్థులను పోటీలకు ఆహ్వానించాలి. వారిలో అత్యంత సమర్థులైన వ్యక్తులనే తమ గ్రామాలకు సర్పంచులుగా, తమ వార్డులకు సభ్యులుగా ఎన్నుకునే వెసులుబాటును ఎన్నికల కమిషన్ కల్పించాలి.ఏక గ్రీవాల ద్వారా ఆయా గ్రామాల ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన నిజాయితీ, నిబద్ధత గల నాయకుల ఎన్నిక జరిగితే అది అభినందనీయమే. ఐతే అది జరుగుతుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా భావించక తప్పదు.నిజానికి అలా జరిగినప్పుడే సమర్థ నాయకత్వం లభించి వారి నేతృత్వంలో పంచాయతీలు ప్రగతి పథంవైపు పరుగులు పెడతాయని చెప్పక తప్పదు. తెలంగాణలోని గ్రామాలలో కొనసాగుతున్న పంచాయతీల ఎన్నికల్లో డబ్బులున్న వారే తమ ఐదేళ్ల పదవీకాలంలో ఓ యాభై లక్షలతో లేదా కోటీ, రెండు కోట్ల రూపాయలతో ఆయా గ్రామాలలో గుడులూ ,చర్చీలు, మసీదులూ, కమ్యూనిటీ హాల్స్,అంతర్గత రోడ్ల నిర్మాణం, రక్షిత మంచినీటి సదుపాయాల లాంటి సౌకర్యాలను సమకూరుస్తామనే హామీలతో గ్రామాలలో ప్రజలతో ఒప్పందాలను కుదుర్చుకుంటూ ఏకగ్రీవాలకు తెరదీస్తుండడం గమనార్హం. ఈ క్రమంలో ఒకవేళ పోటీఏర్పడితే వేలంగా మార్చి అధిక మొత్తం చెల్లిస్తామన్న వారే పదవులను చేజిక్కించుకుంటున్నారనే వార్తలుఆందోళన కలిగిస్తున్నాయి. బెదరింపులూ, బలప్రయోగాలు సైతం ఏకగ్రీవాలకు కారణమోతున్నాయనే వాదనలు కూడ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తొలి విడత ఎన్నికలలో 395, రెండో విడతలో 415 ఏకగ్రీవాలు ఎలాంటి ప్రలోభాలకు,బల ప్రయోగాలకు,ఒత్తిళ్లకు, బెదిరింపులకు తావు లేకుండా పూర్తి ప్రజాస్వామ్యయుతంగా జరిగినవేనని ఎన్నికల కమిషన్ చెబుతున్నవైనం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమోతున్నాయి.రాజ్యాంగ నిబంధనల ననుసరించి ఎన్నికల కమిషన్ నియమాల ప్రకారం ఏ రాజకీయ పార్టీ కూడా తమపార్టీ ఎన్నికల గుర్తుతో ప్రత్యక్షంగా ఈ ఎన్నికలలో పాలుపంచుకోవడానికి వీల్లేదు. ఈ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రాంతీయ,జాతీయ పార్టీలనే తేడా లేకుండా అన్ని రాజకీయ పార్టీలు పోటాపోటీగా ఈ ఎన్నికల సమరంలో పాలుపంచుకుంటూ పెద్ద ఎత్తున డబ్బులను వెచ్చిస్తూ ఏకగ్రీవాల రూపంలో వేలం పాటల



ద్వారా అధికారాన్ని చేజిక్కించుకుంటున్న వైనంతో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉనికికి భంగం కలుగుందనే బుద్ధిజీవుల అభిప్రాయం ప్రాధాన్యత సంతరించుకుంటోంది.తద్వారా ధనస్వామ్యం చేతుల్లో ప్రజాస్వామ్యం బందీగా మారుతుందేమోననే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243(జి) స్థానిక స్వపరిపాలన ఉద్దేశ్యంపరిపాలన,రాజకీయ, సాంఘిక సమానత్వాన్ని సాధించడం అనే నిర్దేశాన్ని బడా నేతలు,పెత్తం దారులు తోసి రాజంటూ ధన,కుల,మత ప్రమేయంతో పెద్దఎత్తున ఏకగ్రీవాలను ప్రోత్సహిస్తుండడం ఎన్నికలలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమే. ఈ చర్యలు అధికార, విపక్ష పార్టీల నేతల సూచనలతోనే ముందుకు సాగుతున్నవైనం బహిరంగ రహస్యమే.ఫలితంగా స్థానిక స్వపరిపాలన డబ్బులున్న వారి చేతుల్లో బందీగా మారుతుందనేది నిర్వివాదాంశమే.ఇలాంటి అప్రజాస్వామిక విధానాలను ప్రభుత్వం, న్యాయవ్యవస్థ నివారించాలంటే తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించాల్సిందేననేది న్యాయ నిపుణుల నిశ్చితాభిప్రాయం. పార్టీల సంస్థాగత ఎన్నికల తంతే ఇక్కడ కొనసాగుతోంది. విశాలమైన ప్రజల సంక్షేమం, అభివృద్ధితో పాటు స్వేచ్ఛ సమానత్వ సాధనకు సంబంధించి రాజ్యాంగ నిబంధనల స్ఫూర్తితో ధన, కుల,మత, వర్ణ, వర్గ విచక్షణకు అతీతంగా ప్రజల సమాన అభివృద్ధి కోసం ముందుకు సాగే లక్ష్యంతోనే మా రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటిస్తున్న అన్ని రాజకీయ పార్టీలు, వారి పార్టీల నిర్మాణానికి సంబంధించిన సంస్థాగత ఎన్నికలలో మాత్రం ప్రజాస్వామ్య స్ఫూర్తిని తోసిరాజంటూకోట్ల రూపాయల సంపదతో పాటు, కులాలను, మతాలను,వర్ణాలను, వర్గాలనే బలమైన ప్రాతిపదికలుగా భావిస్తూ సీల్డ్‌కవర్ ద్వారానే నాయకుల ఎంపికకు పూనుకుంటున్నారు.పార్టీల నియమావళి ప్రకారంఎన్నికల తంతుని తూతూ మంత్రంగానే కొనసాగిస్తున్నాయి. ఆ అలవాటే ఈ రోజు రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఏకగ్రీవాలకు, వేలం పాటలకు ఊపిరులూదుతున్నదేమోననే భావన కలుగుతుంది. రాజ్యాంగ నిబంధనలకు కట్టుబడి ధన, కుల,మత, వర్ణ, వర్గ విచక్షణకు ఆస్కారమే లేకుండా ప్రజలు తమ ఓటు హక్కులను వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. అందులో భాగంగా మాడల్ కోడ్ మానిటరింగ్ ఆఫీసర్ల నియామకంతో పాటు స్ట్రాటజిక్ సర్వేయలెన్స్ టీమ్‌ల ఏర్పాటుకు అదనంగా మొబైల్ టీమ్‌లతో,వ్యయ పరిశీలకుల నియామకంతో నిరంతరపర్యవేక్షణలో వివిధ రకాల ఎన్నికల అక్రమాలను, ప్రలోభాలను అరికట్టే చట్టపరమైన బాధ్యతలను నిర్వర్తించే క్రమంలోఎన్నికల విధినిర్వహణలోభాగంగా మంత్రులూ,ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లను సైతం ఎన్నికల అధికారులు తనిఖీ చేస్తున్నప్పటికీ ప్రలోభాల వరదలో ఎన్నికల నియమాలు కొట్టుకుపోకుండా ఆపలేకపోతున్నాయేమోనని పరిశీలకులనుకుం టున్నారు.ఒకాయన ఐదేళ్ల పాటు ఫ్రీ కేబుల్, ఉచిత వైఫై సదుపాయాలను కల్పిస్తానంటున్నాడు.మరో గ్రామంలో ఐదేళ్లపాటు ఉచితంగా క్షవరంచేస్తానని హామీఇస్తున్నాడు. ఎంత మంది నిజాయితీ పరులైన అభ్యర్థులను తమ ప్రజా ప్రతినిధులుగా ఎంపిక చేసుకుని తమతమ గ్రామాలలో వారికి అధికారాన్ని అప్పగించి గ్రామ స్వరాజ్యస్థాపన కోసం ఊపిరులూదడానికి ఓటర్లుగా తమ వివేకాన్ని ప్రదర్శిస్తారో? లేదా ప్రలోభాల వలలో చిక్కుకుని తమ ఐదేళ్ల భవిష్యత్‌ని చేతులారా తామే కాలరాచుకుంటారో? రాబోయే ఎన్నికల ఫలితాలే తేల్చి చెప్పాల్సివుంది. ●

6MN 5 PG-GNT_6MN 5 PG-GNT.qxd 12/9/2025 12:55 AM Page 1








## అనాధ చిన్నారులకు ఆరోగ్యశ్రీ కార్డులను అందించిన కలెక్టర్

రొంపిచర్ల, డిసెంబర్ 8 ప్రభాతవార్త ::పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అమృత ఆరోగ్యశ్రీ కార్డ్ లను పంపిణీ చేశారు. అనాథలు, నిరాశ్రయుల కోసం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని విస్తరించి వారికి ఉచిత వైద్యం అందించే దిశగా అడుగులు వేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని శిశు గృహ సంరక్షణ కేంద్రాల్లోని 45 మందికి



అమృత ఆరోగ్యశ్రీ కార్డ్ లను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ రవి, శిశు సంరక్షణ అధికారులు, చిన్నారులు పాల్గొన్నారు.

# అమరావతి వార్త



### ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంపై

## అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

బాపట్ల,డిసెంబర్08,ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రజల సమస్యల పరిష్కార అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి వాటికి పరిష్కారం చూపాలన్నారు. ప్రజా సమస్యల అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు ఆన్లైన్లో పంపించినప్పటికీ



వాటిని కొంతమంది అధికారులు చూడటం లేదని, చూడని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా, మండలం, కార్యాలయ లవారీగా ప్రజా సమస్యల అర్జీల పై ఆయన ఆరా తీశారు. మార్టూరు మండలంలో ఎక్కువగా అర్జీలు రావటానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అర్జీలను ప్రీ ఆడిట్ చేయుటలో కొన్ని మండలాల పనితీరు సరిగా లేదని, వాటికి సంబంధించిన జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ముఖ్య ప్రముఖుల నుండి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో నాణ్యమైన చక్కని ఎండార్స్మెంట్ ద్వారా అర్జీదారునికి అందజేయాలని, అర్జీల ఆడిటింగ్ విషయంలో అర్జిదారునికి అవగాహన కల్పించే విధంగా, అదే సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలపై, కార్యాల యాల పనితీరుపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో అనేక అంశాలు జోడిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయంలో అధికారులు జాగ్రత్త వహించాలని, అధికారులు వారి శాఖ నిర్వహించే పనులపై సమగ్ర సమాచారాన్ని కలిగి ఉండాలని, ప్రభుత్వం అడిగే ప్రశ్నలకు స్పందించని అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అధికారులం దరూ చిత్తశుద్ధితో పనిచేసి అన్ని విషయాలలో జిల్లాను మూడో స్థానంలో, అంతకంటే పై స్థాయిలో ఉంచే విధంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, పిడి డిఆర్డిఏ లవన్న, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు శాశ్వత పరిష్కారాలను అందించాలి

### : కమీషనర్ ధ్యానచంద్ర



విజయవాడ కార్పొరేషన్, డిసెంబరు 8,ప్రభాతవార్త:ప్రజల సమస్యలకు శాశ్వతమైన పరిష్కారాలను అందించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రధాన కార్యాలయంలో ఆయన నిర్వహించారు. జోనల్ కార్యాలయాల్లో జరిగే ప్రజా ఫిర్యాదులను పరిష్కార వేదికకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షిస్తూ మూడు కార్యాలయాల అధికారులతో గతవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పరిష్కరించిన ధరఖాస్తులపై ఆయన సమీక్షించారు. మున్సిపల్ సేవల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పురమిత్ర యాప్లో స్వీకరించిన ఫిర్యాదులను అధికారులు పరిష్కరించిన తీరును సమీక్షించారు. ఎప్పటికప్పుడు పురమిత్ర ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుకు శాశ్వతమైన పరిష్కారం అందించాలని, ప్రజలకు పరిష్కారం చూపించాలే తప్ప వేరే శాఖపై సమస్యలకు మళ్ళించకూడదని అధికారులను హెచ్చరించారు. శాఖలన్నీ సమన్వయంతో సరి చేయాలని వచ్చిన ప్రతి ఫిర్యాదును శాఖల సమన్వయంతో పరిష్కరించాలని కమీషనర్ అన్నారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు తీసుకువచ్చిన ఫిర్యాదులను శాఖాధిపతులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును తాము స్వయంగా వచ్చి పరిశీలించి శాశ్వతమైన పరిష్కానాన్నా తీసుకొచ్చే విధంగా చూస్తామని తెలిపారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 25 ఫిర్యాదులను ఆయన అందుకున్నారు. అందులో పట్టణ ప్రణాళికకు సంబంధించి-4,ఇంజనీరింగ్-10,రెవిన్యూ-3,పబ్లిక్ హెల్త్-1, హార్టికల్చర్-1, పిఓ(యుసిడి)-1,ఎస్టేట్-3,హౌసింగ్ మాపింగ్-1,మొత్తం కలిపి 25 ఫిర్యాదులను అందుకున్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ (ప్రాజెక్ట్) డి.చంద్రశేఖర్,చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్రత్నకుమార్,డిప్యూటీ కమీషనర్(రెవిన్యూ) జి.సృజన,ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చంద్రశేఖర్, శ్రీనివాస్,ప్రభాకర్,బయోలజిస్ట్ కామేశ్వరరావు,డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్,డిఎఫ్ఓ మాల్యాద్రి,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సోమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంతరజిల్లా దొంగల ముఠా అరెస్ట్

## - బంగారం, వెండి స్వాధీనం..

### 19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండి స్వాధీనం

మంగళగిరి డిసెంబర్ 8 ప్రభాతవార్త : అంతరజిల్లా దొంగల ముఠాను అదుపులోకి తీసుకుని వారిని అరెస్టు చేసి, వారి నుంచి దొంగిలించిన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకృష్ణ తెలిపారు. నిందితుల వద్ద నుంచి సుమారు19 గ్రాముల బంగారం, 740 గ్రాముల వెండిను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.. దొంగతనానికి గురైన





ఆభరణాలను కొనుగోలు చేసిన, తాకట్టు పెట్టుకున్న వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు..ఈ ముఠాపై మంగళగిరి రూరల్, డీకే దిన్నె, దువ్వాడ, గాజువాక, అనకాపల్లి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయినట్టు వివరాలు వెల్లడించారు..

అరెస్టయిన నిందితులు తోట శివకుమార్ (36), షేక్ ఇంతియాజ్ (26), తోట వరలక్ష్మి (31)గా పోలీసులు గుర్తించారు. వీరు విశాఖపట్నం, కడప జిల్లాలకు చెందినవారని పోలీసులు తెలిపారు.పిర్యాదుదారు భూక్య వీరాంజనేయులు నాయక్ (37), యర్రబాలెం గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది.దర్యాప్తులో ప్రధాన నిందితుడు తోట శివకుమార్పై రాష్ట్రవ్యాప్తంగా 150కు పైగా దొంగతన కేసులు ఉన్నట్టు బయటపడింది. నిందితుడు కడప జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో షేక్ ఇంతియాజ్తో పరిచయం ఏర్పడినట్టు పోలీసులు తెలిపారు. బెయిల్పై విడుదలైన అనంతరం శివకుమార్, ఇంతియాజ్, వరలక్ష్మి కలిసి దొంగతనాలకు పూనుకున్నట్టు తెలిసింది.నవంబర్ 4న ముగ్గురు విజయవాడకు చేరుకుని అక్కడి నుంచి మంగళగిరి మండలం ఎర్రబాలెం ప్రాంతంలో రేకీ నిర్వహించారు. రాత్రి సమయంలో ఒక ఇంటిలోకి ప్రవేశించి వెండి పట్టీలు, చెవి దిద్దులు, బంగారు మాటీలు, నగదు రూ.20,000 దొంగిలించినట్టు విచారణలో తేలింది. అనంతరం కడప, దువ్వాడ, గాజువాక, అనకాపల్లి ప్రాంతాల్లో కూడా ఇదే విధంగా హౌస్ బ్రేకింగ్ దొంగతనాలకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.

మంగళగిరి రూరల్ ఎస్సై చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు నేతృత్వంలోని పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి స్వాధీనం చేసిన ఆభరణాలను కోర్టుకు సమర్పించారు. అనంతరం నిందితులను రిమాండ్కు తరలించారు. ఈ దర్యాప్తులో మంగళగిరి రూరల్ సీఐ ఏ.వి. బ్రహ్మం, ఎస్సై వెంకటేశ్వర్లు, ఎస్సై బాలు నాయక్, ఏఎస్సై రత్నరాజు, పోలీసు కానిస్టేబుల్ సాగర్ పాల్గొన్నారు.

### స్క్రబ్ టైఫస్ వలన మరణాలు సంభవించకుండా

## అప్రమత్తంగా ఉండాలి:కలెక్టర్




గుంటూరువెస్ట్, డిసెంబర్ 8, ప్రభాతవార్త:జిల్లాలో స్క్రబ్ టైఫస్ఖి జ్వరాల వలన మరణాలు సంభవించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వైద్య ఆరోగ్యశాఖ ను సమన్వయం చేసుకుంటూ పంచాయతీ, రెవెన్యూ శాఖలు ముందస్తు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్క్రబ్ టైఫస్ఖి జ్వరాల నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలు, హౌసింగ్ , ఉపాధి హామీ పథకం పనులు, గ్రామ వార్డు సచివాలయ సేవలు తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పీహెచ్సీ వైద్యులు. ఎంపీడీవోలు, తహశీల్దార్లు, మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో చిగ్గర్ మైట్ (కీటకం) ప్రభావం కుట్టడం వల్ల స్క్రబ్ టైఫస్ జ్వరాల వస్తాయని, గత కొన్ని సంవత్సరాలుగా ఈ జ్వరాలు నమోదు అవుతున్న, ప్రస్తుతం దీని వలన తీవ్ర అనారోగ్యం, మరణాలకు దారి తీస్తుందని అని చెప్పారు. దట్టమైన చెట్లు, వ్యవసాయ భూముల పక్కనే నివపించే వారిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని, చిన్న నల్ల మచ్చ (దద్దురు మాదిరిగా) శరీరంపై కనిపించి, జ్వరం వచ్చినట్లయితే స్క్రబ్ టైపస్ గా అనుమానించవచ్చునని తెలిపారు. జ్వరం వచ్చి మూడు రోజుల వరకు తగ్గకుంటే జీ జీ హెచ్ కు వచ్చి రక్త పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ జ్వరాలకు ఉపయోగించే మందులు ఉప ఆరోగ్య కేంద్రాల్లో (హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్) అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్క్రబ్ టైపస్ జ్వరలపై పూర్తిస్థాయిలో ప్రజలు అవగాహన కలిగించేలా గ్రామాల్లో సచివాలయ ఉద్యోగుల ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించిన విధంగా నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రజలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ అధికారులు నిరంతరం పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణానికి సంబంధించి గతంలో లే అవుట్లలో ఆప్షన్ 3లో ఇళ్ళు నిర్మించిన కాంట్రాక్టర్ల పనులను పరిశీలించి డీవియేషన్లు ఉంటే వాటిని సరిచేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించని కాంట్రాక్టర్లపై చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద 3డీ మోడల్ లో గృహాల నిర్మాణానికి అనువుగా ఉన్న లేఔట్లను గుర్తించాలన్నారు, ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసిన పశువుల పాకలు వచ్చే వారం నాటికి నూరు శాతం గ్రౌండ్ చేసి డిసెంబర్ 15 నాటికి పూర్తి అయ్యేలా ఎంపీడీవోలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో జరిగే సర్వేల రోజువారీ వివరాల డైరీ సచివాలయ ఉద్యోగులు నిర్వహించేలా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు అందిచే పీజీఆర్ఎస్ అర్జీల ఎండార్స్మెంట్లపై ఉద్యోగి పేరు, సచివాలయం వివరాల రబ్బర్ స్టాంప్ వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయల ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు శాతం మెరుగుపరిచేలా నిరంతరం పర్యవేక్షి ంచాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. విజయలక్ష్మి మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ జ్వరాల లక్షణాలు, చికిత్స, అనుసరించాల్సిన ఇతర పద్ధతులను వివరించారు. పొలం పనులకు వెళ్లే వారు రబ్బరుతో తయారుచేసే షూలు ధరిస్తే మంచిదని, పాత మంచాలు, పరుపులు, దిండ్లు వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవడం మంచిదన్నారు, నివాసం ఉండేచోట ఎలుకలు సంచరించకుండా చూసుకోవాలన్నారు. నేలపై నిద్రించే సమయంలో దుప్పట్లు ఉపయోగించాలన్నారు. రాత్రి వేళల్లో ఒంటిని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించటం తదితర ముందస్తు జాగ్రత్త చర్యలను పాటించాలని సూచించారు.సమావేశంలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, సీపిఓ శేషశ్రీ, జిల్లా హౌసింగ్ పీడీ ప్రసాదు, డ్వామా పీడి శంకర్ పాల్గొన్నారు.

## నాడు విధ్వంసం.. నేడు అభివృద్ధి వికాసం

### అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

### రూ.1.46 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుంటూరు వెస్ట్, డిసెంబర్ 8,ప్రభాతవార్త: రాష్ట్రంలో గత ఐదేళ్లలో జగన్ విధ్వంస పాలన నుంచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వికాసం వైపు పయనిస్తున్నామని గుంటూరు తూర్పు



ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సోమవారం స్థానిక రాహుల్ గాంధీ నగర్, మద్దిరాల కాలనీ, మంగళదాస్ నగర్ ప్రాంతాల్లో రూ.1.46 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే రూ.26 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని అన్నారు. పేద వర్గాలు నివసించే ప్రాంతాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు అధిక శాతం నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. గత జగన్ ప్రభుత్వంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలను పట్టించుకోలేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో కనీసం మురుగు కూడా తీయని పరిస్థితి ఉండేది స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని డివిజన్లలో అభివృద్ధికి పునాదులు వేశామని తెలిపారు. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని, మురుగునీరు రోడ్లపై నిలుస్తుందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు వెళుతున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షైక్ షాజీలా, కార్పొరేటర్ రెహానా, వెల్చూరి కిరణ్, సయ్యద్ అన్వార్, పిచ్చిరెడ్డి,డివిజన్ అధ్యక్షులు పఠన్ జాబి, మొవ్వ శైలజ, చట్టు కనకరావు, బెళ్ళ వెంకటేశ్వరరావు,ధరణికోటా వెంకటేశ్వరరావు, అనిల్, వసు ఖాసీం బాబు, బషీ, లక్ష్మీనారాయణ, యడ్లపాటి రమాదేవి, సాంబశివరావు, అంకమ్మదాసు, నూర్, ఇమ్రాన్, మాష్టానరావు, సుభాని, డేవిడ్, రాకేష్, దిలీప్,కోటి, మహేష్ పాల్గొన్నారు.

## నరసరావుపేటలో రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలు..

నరసరావుపేట, డిసెంబర్ 8 ప్రభాతవార్త : స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి వచ్చిన వందలాది మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కోడెల శివప్రసాదరావు స్టేడియం పూర్తిగా అస్తవ్యస్తంగా, అభివృద్ధికి దూరంగా మారిపోయిం దన్నారు. ఇక్కడ క్రీడా మైదానం గుంతలతో నిండి, గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ స్టేడియాన్ని పూర్తిగా శుభ్రం చేసి, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాం. క్రీడాకారుల సౌలభ్యం కోసం కొత్త వాష్రూమ్స్ నిర్మించాం. ఇక ఈ స్టేడియం రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా మారిందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.



## రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తాం



బాపట్ల,డిసెంబర్08,ప్రభాతవార్త: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి,రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు.స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో రహదారి ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసినకమిటి సభ్యులకు సోమవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన రహదారులలో 9 ప్రత్యేక బృందాల ఏర్పాటుచేసి డిపిఓలో 9 ప్రత్యేక బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి బృందంలో ఇద్దరు పోలీసులు, ఇద్దరు నేషనల్ హైవే సిబ్బంది, మోటార్ వెహికల్ కార్యాలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల వాలంటీర్లు ఉంటారన్నారు.జిల్లాలోని ప్రధాన రహదారులున్న 19 పోలీస్ స్టేషన్ ల పరిధిలో ప్రత్యేక బృందాలు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుతూ ప్రమాదాలను నియంత్రించడమే బృందాల లక్ష్యంమన్నారు. దీనిలో భాగంగా బాపట్ల జిల్లాలోని ప్రధాన రహదారుల పరిధిలో ఉన్న 19 పోలీస్ స్టేషన్లను గుర్తించి, ఆ ప్రాంతాల్లో ప్రమాదాల నియంత్రణ కోసం తొమ్మిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, వారికి సిసిఎస్ పి.జగదీష్ నాయక్, ఎస్బి 2 ఇన్స్పెక్టర్ ఎం రాంబాబులు డిపిఓలో శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. బాపట్ల జిల్లాలో ఈ బృందాల విధులు నిర్వహించే ముఖ్య ప్రాంతాలుపెనుమూడి వంతె న,రెడ్డిపాలెం టోల్ ప్లాజా, కర్లపాలెం క్రాస్ రోడ్, చీరాలలో మన్నం అపార్ట్మెంట్ వద్ద,చిన్నగంజాం టోల్ ప్లాజా, బొల్లాపల్లి టోల్ ప్లాజా ,మేదరమెట్ల క్రాస్ రోడ్స్, సంతమాగులూరు టోల్ ప్లాజా, అద్దంకి పట్టణం పరిసర ప్రాంతాలుఇప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటితో పాటు ఆరు రోడ్ సేఫ్టీ వెహికల్స్తో కూడా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించి ప్రజలకు క్షేమకరమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించటం బాపట్ల పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. దీనికి ప్రజలందరూ సహకరించాలన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు భూసేకరణ వేగంగా చేయాలి



బాపట్ల,డిసెంబర్08,ప్రభాతవార్త: అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు భూసేకరణ వేగంగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. భూ సేకరణ ప్రక్రియపై అనుబంధ శాఖల అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిజాంపట్నం మండలంలో రాడార్ కేంద్రానికి 1.50 ఎకరాల భూమి కేటాయించాలన్నారు. నిడ్ క్యాప్ ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి చేయడానికి బయోమాస్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు మార్టూరులో 100 ఎకరాల భూమి కేటాయించాలని అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లా కేంద్రంలో హెలీ ప్యాడ్ ఏర్పాటు చేయడానికి 10 ఎకరాల భూమి కేటాయించాలన్నారు. ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూమి ఇందులో ఉంచాలని ఆర్ డి ఓ లకు సూచించారు. గ్రామీణ ఉపాధి శిక్షణ కేంద్రానికి భూమి కేటాయించాలని ఆయన తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనానికి 57.13 ఎకరాల భూమి కేటాయించినట్లు అధికారిక అనుమతి కొరకు సిసిఎల్ఏ కు నివేదించామన్నారు. జిల్లా కోర్టుకు 2.50 ఎకరాల భూమి కేటాయించగా, 10 ఎకరాలు కావాలని న్యాయ శాఖ నుంచి వినతులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించాలని, బీసీ భవనానికి రెండు ఎకరాలు, ఎస్టీ భవనానికి రెండు ఎకరాల భూమి, మెప్మా ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి 2,500 చదరపు అడుగులు భూమి గుర్తించాలన్నారు. డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ కొరకు ఐదు ఎకరాలు, మార్కెట్ కార్యాలయానికి 10 సెంట్లు భూమి గుర్తించాలన్నారు. 54 ప్రాంతాలలో హెల్త్ వెల్నెస్ సెంటర్ల నిర్మాణానికి భూమి గుర్తించాలన్నారు. పర్చూరులో రైతు బజార్ నిర్మాణానికి భూమి ఇవ్వాలని, వేమూరు మండలం జంపని గ్రామంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు 5 ఎకరాల భూమి గుర్తించాలన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు 25 అంశాలపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ తొక్కు బ్రో




గుంటూరు క్రైమ్ ప్రభాతవార్త డిసెంబర్7.మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడమే "సంకల్పంగా " సాగిన "డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ తొక్కు బ్రో" అవగాహన కార్యక్రమం నల్లపాడు పోలీసు స్టేషన్ నుండి భారీ ర్యాలీ గా ఈగల్ ఐజీ ఆర్.కె రవికృష్ణ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయ, మునిసిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఈగల్ ఎస్పీ నాగేష్ మాదకద్రవ్యాలు వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తూ సైకళ్ళు తొక్కుతూ అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు..దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమని, అటువంటి యువత శక్తిని నిర్వీర్యం చేసే కుట్రలో బాగంగా దాయాది దేశాలు ఈ మాదక ద్రవ్య మహమ్మారిని ఉసిగొల్పుతున్నాయని, ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ సూచించారు. ప్రధానమంత్రి క్విట్ ఇండియా ఉద్యమంలో బాగంగా ప్రజలు ఫిట్ గా ఉండాలంటే సైకిల్ త్రొక్కాలని పిలుపునిచ్చారన్నారు. మంచి శారీరక దారుఢ్యం వలన మనసు ప్రశాంతంగా ఉండి డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండే అవకాశం ఉందన్నారు. అందువలన యువత సైకిల్ తొక్కే వ్యాయామాన్ని నిరంతరం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా సూచించారు.ఆకతాయి తనంగా, కిక్ కోసం తీసుకునే ఈ గంజాయి, మాదక ద్రవ్యాలు మరణానికి తీసుకెళ్తాయని, స్నేహితులు, సహచరులు అడిగారని, ఒత్తిడి నుండి బయటకు రావాలని ఈ డ్రగ్స్ కి అలవాటు పడితే క్రమంగా అది మిమ్మల్ని బానిసలుగా మార్చి, మీ జీవితాలను చిత్తు చేస్తాయని కావున జాగ్రత్త వహించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.నేటి సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య మాదక ద్రవ్యాలు.ఈ మాదక ద్రవ్యాలను నిర్మూలించడానికి ప్రజలందరూ కలసి మెలసి ముందుకు రావాలని, కలసికట్టుగా కూకటి వేళ్ళతో మాదక ద్రవ్యాలను ఏరిపారేద్దాం అని ఈగల్ ఎస్పీ నగేష్ బాబు అన్నారు.మాదక ద్రవ్య సమాజ నిర్మాణంలో ప్రతి తల్లి బాధ్యత తీసుకోవాలని, పిల్లల నడవడికను, ప్రవర్తనను సరిచేయవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నదని తెలిపారు.ఈ "డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ తొక్కు బ్రో కార్యక్రమానికి ప్రజల నుండి, విద్యార్థుల నుండి, సమాజహితుల నుండి విశేష స్పందన వచ్చింది. సమాజహితం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామం అని పుర ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, సైక్లిస్టులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, మాదక ద్రవాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలను అందరికీ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాలల అధ్యాపకులు,పాఠశాల విద్యార్థులు,విద్యార్థినిలు స్థానిక ప్రజలు పలువురు విశేషంగా హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

6MN 6 PG-GNT_6MN 6 PG-GNT.qxd 12/9/2025 12:55 AM Page 1



## అధికారుల నిరక్ష్యాన్లికి నిరసనగా గుంటూరు జీటీ రోడ్డులో గుంతలు పూడ్చిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు వెస్ట్ డిసెంబరు 8, ప్రభాతవార్త :గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యాలకు కొంతమంది అధికారులు తూట్లు పొడుస్తున్నారని, ప్రజా సమస్యల గురించి తాను ఎన్నిసార్లు విజ్ఞప్తులు, వినతి పత్రాలు అందజేసిన అధికారులు ఏ కారణంతో పనులు చేయకుండా, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చేలాగా ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ప్రధాన రహదారుల్లో కనీసం గుంతలు పూడ్చే ప్రయత్నం చేయకపోవటం దేనికి సంకేతమో అధికారులు చెప్పాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేస్తూ, సోమవారం గుంటూరు మస్తాన్ దర్గా వద్ద జీటీ రోడ్డులో ప్రమాదకర స్థాయిలో ఏర్పడిన గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి స్వయంగా ప్రారంభించారు. అనంతరం గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ... గుంటూరు నగరానికి జీటీ రోడ్డు అత్యంత కీలకమైన ప్రధాన రహదారి అయినప్పటికీ గత సంవత్సరం నుంచి పూర్తిగా శిధిలావస్థకు చేరిందని, రోజూ వందలాది వాహనాలు, బస్సులు ఈ మార్గం గుండా ప్రయాణిస్తుండటంతో ప్రజలు తీవ్రమైన ప్రమాదాలకు గురవుతున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పాట్ హోల్ ఫిల్లింగ్ కోసం ప్రభుత్వ నిధులతో ప్యాచ్ వర్క్ చేసినప్పటికీ, ఏ మాత్రం అభివృద్ధి జరగలేదని, కొత్త రోడ్డు మంజూరు, పాట్ హోల్ ఫిల్లింగ్ కోసం ఆర్ అండ్ బి, మున్సిపల్ కార్పొరేషన్, కలెక్టర్, కమిషనర్, సీఎస్ స్థాయివరకు అనేకసార్లు వినతులు ఇచ్చినా స్పందన లేకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారుల నిరక్ష్యాన్లికి నిరసనగా తన సొంత నిధులతో కంకర, డస్ట్ తెప్పించి ఈరోజు గుంతలు పూడ్చే శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. తాను స్వయంగా స్కూటీపై వెళ్లినప్పుడు కూడా ఈ గుంతల వల్ల ప్రమాదానికి గురయ్యానని, ఇక సామాన్య ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ఖాళీస్థలాలు, వీధి కుక్కల బెడద, వీధి దీపాలు, డ్రైన్లు వంటి సమస్యలపై కూడా ఎన్నిసార్లు కోరినా అధికారుల నుంచి నిరక్ష ్యమ్లే ఎదురవుతోందని విమర్శించారు. ప్రజా ప్రతినిధిగా సమస్యలను లేవనెత్తడం తన బాధ్యత అని, ఆర్డర్లు వేయడం తన విధానం కాదని స్పష్టం చేస్తూ, చిన్న చిన్న సమస్యలను అయినా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని అధికారులను కోరారు. త్వరితగతిన జీటీ రోడ్డుకు పూర్తిస్థాయి శాంక్షన్ మంజూరు చేసి తారుతో నిర్మాణం చేసి ప్రజలకు సురక్షి తమైన రాకపోకలు కల్పించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు. అధికారులు ముందుకొచ్చి బాధ్యతగా పని చేయకపోతే ఇలాగే ప్రజల తరపున తాము బరిలోకి దిగుతామని హెచ్చరించారు.

## ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి.. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబర్ 8 ( ప్రభాతవార్త ) : గుంటూరు నగరంలో స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో ఆయా విభాగాల అధిపతులు అక్కడకు వెళ్లి పరిశీలించి పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ లోని డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తొలుత నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో భాగంగా ఫోన్ ద్వారా 26 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత విభాగాల అధిపతులు తక్షణమే పరిష్కరించేవి ఒక జాబితా, కొంచెం ఆలస్యంగా నిర్దేశిత గడువులోగా పరిష్కరించేవి మరో జాబితా తయారుచేసి సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి పరిశీలించేందుకు విభాగాల అధిపతిలే నేరుగా ఆ ప్రాంతాలకు వెళ్లి పరిశీలించి పరిష్కరించాలన్నారు. అర్జీలు పరిష్కరించిన నివేదిక జాబితా కమిషనర్ చాంబర్లో ఎప్పటికప్పుడు సమర్పించాలన్నారు. అనంతరం జరిగిన పి జి ఆర్ ఎస్ కు 33 మంది నేరుగా అర్జీలు సమర్పించడం జరిగిందన్నారు. ఈ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరగడానికి వీల్లేదని నిరక్ష ్యం వహిస్తే సంబంధిత విభాగాల అధిపతులను బాధ్యులుగా చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమాలకు క్షేత్రస్థాయి అధికారులు కూడా హాజరైతే సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్చార్జి ఎస్ ఈ సుందర్ రామిరెడ్డి, సీఎం ఓహెచ్ డాక్టర్ శాంతి కళ, మేనేజర్ బాలాజీ భాష తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు వెస్ట్ డిసెంబర్ 8 ప్రభాతవార్త :గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో సుమారు రూ.8.50 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రధానముగా 22 వ డివిజన్ 60ఫీట్ రోడ్, అచ్చయ్య డాబా సెంటర్ వద్ద సీసీ రోడ్,19 వ డివిజన్ నల్లచెరువు 8వ లైన్ వద్ద జరిగే సీసీ రోడ్ డ్రైన్,36 డివిజన్ భాగ్యనగర్ 1వ లైన్ నందు జరిగే సీసీ రోడ్,52 డివిజన్ ఆరండల్పేట 1వ లైన్ నందు జరిగే బీటీ రోడ్ వంటి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళామాధవి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, నాలుగు డివిజన్ల పరిధిలో సుమారు రూ.8 కోట్ల 50 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసినట్లు ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి తెలిపారు. ప్రధానముగా 19వ డివిజన్ నల్లచెరువు ప్రాంతంలోని 2, 4, 5, 9 లైన్లలో లో లెయింగ్ ఏరియాలలో ఏళ్ల తరబడి వర్షానికి నీరు నిలిచిపోతున్న సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు సీసీ డ్రైన్స్, సీసీ కల్వర్టులు, సీసీ రోడ్లు నిర్మించేందుకు శంకుస్థాపన చేశామన్నారు. అలాగే 52వ డివిజన్, 22వ డివిజన్లలో కూడా ఇదే రోజు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమన్వయంగా ముందుకు తీసుకెళ్తూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులు, స్ఫూర్తితో పారదర్శకతతో లక్ష ్యంగా పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఒక నెల నుంచి నెలన్నర లోపు అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఒక్క 19వ డివిజన్లోనే రూ.2 కోట్ల 50 లక్షల వ్యయంతో అంతర్గత రోడ్లు, లో లెయింగ్ రోడ్ల అభివృద్ధి చేపడుతున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, డివిజన్ ప్రెసిడెంట్లు, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్చార్జులు, నాయకులు పాల్గొన్నారు.
పోలీసులపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి సీరియస్
గుంటూరులోని నల్లచెరువు సమీపంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నారన్న ఫిర్యాదులతో పోలీసులపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి సీరియస్ అయ్యారు. మద్యం బాబులతో తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సమస్యను ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మరోసారి ఇలాంటివి పునరావృతం అయితే బాధ్యులపై చర్యలు తప్పవు అంటూ పోలీసులను ఆమె హెచ్చరించారు. ఇక ఇకపై స్థానికులు కూడా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై వీడియో తీసి పంపాలని గల్లా మాధవి సూచించారు.

## సర్వేయర్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి : కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామచంద్రారెడ్డి

మాచర్ల, డిసెంబరు 8 (ప్రభాతవార్త): సర్వేయర్ వ్యవస్థను వెంటనే ప్రక్షాళన చేయాలని మాచర్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్ఛార్జి యరమల రామచంద్రారెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం వివిధ మండల, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో జరుగుతున్న ప్రజావేదికలో వస్తున్న సమస్యల్లో ప్రధానంగా భూసమస్యలే అన్నారు. ఈ సమస్యలకు ప్రధాన కారణం



సర్వే వ్యవస్థ భ్రష్టు పట్టి అస్తవ్యస్తంగా ఉండటమే. ప్రజా వేదికలలో సమస్యలు కుప్పలు తెప్పలుగా పెరిగిపోవడానికి ఇదే ప్రధాన కారణం. అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం చేస్తున్న లక్షలాది కోట్ల పెట్టుబడులు అమలుకు భూములు అవసరం తీర్చాలంటే సర్వే వ్యవస్థ ప్రక్షాళన చేయాలన్నారు. లేకుంటే పెట్టుబడులు ఉండవు, లక్షల ఉద్యోగాలు ఉండవు. పారిశ్రామిక వేత్తలు రారు. ఆస్తి కాగితాలకు పరిమితమవుతుంది భూయాజమాన్యం. మాచర్ల నియోజకవర్గంలో ఏకోనాంపేటలో భారీగా జరుగుతున్న భూఆక్రమణలపై విచారణ చేయాలన్నారు. దొంగ సర్వేలతో కొంతమంది భూకబ్జాదారులు చెలరేగుతున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే కాంగ్రెస్ కార్యకర్తల్ని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రాబోయే మూడు నెల్లల్లో సమస్య పరిష్కారం కాకపోతే తహశీల్దారు కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాసరావు, వంగపాటి నాగరాజు, వెంకటేశ్వర్లు, ఎస్. నాజర్ వలీ, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

## వైసిపి ఎప్పటికీ అధికారంలోకి రాదు :: ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట, డిసెంబర్ 8 ప్రభాతవార్త : రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ఎప్పటికి అధికారంలోకి తిరిగి రాదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు.మాజీ ఎమ్మెల్యే పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తీవ్ర ఆరోపణలు చేశారు. తాను మానవత్వంతో ముందుకు వెళతానని తెలిపారు. మానసికంగా, శారీరకంగా చాలా బలమైన మనిషినన్నారు. నరసరావుపేటలో ప్రస్తుతం పారా ఒలంపిక్ క్రీడా పోటీలు



జరుగుతున్నాయని, ఆ పోటీలలో మాజీ ఎమ్మెల్యే కూడా పాల్గొంటే బాగుంటుందని సూచించారు. నేను రాజకీయాల్లోకి సేవ చేయడానికి వచ్చానని, ఆస్తులు సంపాదించుకోవటానికి కాదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కరోనా కాలంలో ఇంజక్షన్లను అక్రమంగా అమ్మి 60 కోట్లు సంపాదించాడని ఆరోపించారు. అంతేకాకుండా, జనరిక్ మెడికల్ షాపుల నుంచి డబ్బులు వసూలు చేయడం, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పేషెంట్లను తన సొంత హాస్పిటల్కు తరలించి కోట్లు సంపాదించాడని ఆరోపణలు చేశారు. ఇటీవల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జరిగిన సర్జికల్ బ్లేడు సంఘటనను కుట్రగా పేర్కొన్నారు. ఆ మహిళ భర్త గత వైసీపీ ప్రభుత్వంలో వాలంటీర్గా పనిచేశాడన్నా రు. హాస్పిటల్పై అభియోగాలు మోపటానికి ఆమెను అడ్డం పెట్టుకుని నిందలు మోపారన్నారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చారు. ఓ డాక్టర్ సాటి డాక్టర్ పై ఆరోపణలు చేయడం సబబు కాదని తెలియకపోతే తెలియజేయాల్సిన బాధ్యత సాటి డాక్టర్ గా ఉందన్నారు. గడిచిన ఐదేళ్లలో కోడెల శివప్రసాదరావు స్టేడియం, నల్లమల్ల ఫారెస్ట్ ను తలపించేలా ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తాను పునుకొని, కూటమి నాయకులతో కలిసి ప్రస్తుతం స్టేడియాన్ని ఎంతో అందంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. ఇప్పటికీ వైసీపీ నాయకుల బుద్ధులు మారలేదని, దానికి ప్రజలే సరైన సమాధానం చెబుతారని అన్నారు. భవిష్యత్తులో వైసీపీ ప్రభుత్వం రాదని, వైయస్. జగన్మోహన్ రెడ్డి తిరిగి ఎప్పటికి ముఖ్యమంత్రి కాలేడని చెప్పారు. నారా చంద్రబాబు నాయుడు ఐదోసారి కూడా ముఖ్యమంత్రి అవుతారని ఈ సందర్భంగా ఛాలెంజ్ చేశారు. అవినీతికి పాల్పడాలన్న ఆలోచనలు టిడిపి శ్రేణులకు ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. టీడీపి నాయకులు గూడూరు శేఖర్, రామకృష్ణలు మాట్లాడారు.సమయం వచ్చినప్పుడు మరిన్నివివరాలు బయటపెడతామని తెలియజేశారు.

## సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోండి : ఏపీ ఎన్జీవో నాయకులు

నరసరావుపేట,డిసెంబర్ 8 ప్రభాతవార్త ::నవంబర్ 3న సాయంత్రం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యశాఖ కమిషనర్ ఆకస్మిక తనిఖీకు వచ్చి ఉద్యోగులను సస్పెండ్ చేయడం అన్యాయమని ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తలుపులు వేసి ఉన్నాయి అనే కారణం చూపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు సంబంధించిన 12 మంది ఉద్యోగులను సస్పెన్షన్ చేయడం విచారకరమన్నారు.ఆ సస్పెన్షన్ ను తొలగించాలని ఎ. విద్యాసాగర్, (రాష్ట్ర అధ్యక్షులు) పీహెచ్సి సిబ్బంది మొత్తాన్ని సస్పెండ్ చేయుట అనాలోచితమైన చర్య అని అన్నారు. తక్షణమే అనాలోచితంగా సస్పెండ్ చేసిన 12 మంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులను విధులలోకి తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుల వాదనతో ఏకభవించిన కమిషనర్ గారు సస్పెండ్ ఉత్తర్వులను రద్దుచేసి, సస్పెండ్ చేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుంటామని తెలిపారు. వైద్య శాఖ ఉద్యోగులకు సరైన రక్షణ సదుపాయాలు లేకుండా రాత్రిపూట విధులు నిర్వహించమని ఆదేశాలు జారీ చేయటం ఇబ్బందికరమన్నా రు. ప్రభుత్వం తక్షణమే రాత్రిపూట విధులు నిర్వహించే స్టాఫ్ నర్సులకు తగిన రక్షణ కల్పించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విద్యాసాగర్ ,డి.వి.రమణ, గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాస్ రావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు మర్లపాటి రామకృష్ణ,ఏపీ ఎన్జీవో సంఘ నాయకులందరికి ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు.

## ఐ.డి.పి.ఎస్‌లో ముగిసిన రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ పోటీలు

రొంపిచర్ల,డిసెంబర్ 8 ప్రభాతవార్త:: మండలంలోని కేశానుపల్లి గ్రామ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (ఐడీపీఎస్) లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి 19వ ఫ్లోర్ బాల్ బాల బాలికల పోటీలను ఈనెల 6 7 తేదీలలో విజయవంతంగా నిర్వహించినట్లు స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ రావు సోమవారం తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల నుండి 250 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చూపారని అన్నారు. పోటీలలో బాలుర విభాగంలో కృష్ణా జిల్లాకు 1వ స్థానం, తిరుపతి 2వ స్థానం, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నరసరావుపేట 3వ స్థానంలో నిలిచాయన్నారు. బాలికల విభాగంలో తిరుపతి 1వ స్థానం, అనంతపురం 2వ స్థానం, పల్నాడు 3వ స్థానాలలో ఉన్నాయని తెలిపారు. ఈ పోటీలలోని విజేతలకు మెడల్స్, ట్రోఫీలను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ పులేకర్, రాష్ట్ర ఫ్లోర్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజర్ రత్నకుమార్, టోర్నమెంట్ డైరెక్టర్ ప్రసాద్, పల్నాడు జిల్లా సెక్రెటరీ మల్లవరపు కిషోర్ బాబు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పిల్లి సురేంద్ర, స్కూల్ కోచెస్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## గీత దాటారు.....వేటు పడింది..!!!

**-పొన్నూరురూరల్ ఎస్సై విఆర్‌కు బదిలీ**
**-ఇరువురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన ఎస్పీ**
**-అక్రమ రేషన్ దందాతో చేతులు కలిపిన పోలీసులు**
**-ఎమ్మెల్యే మాటలను కూడా ఖాతరు చేయని రూరల్ పోలీసులు**
**-పొన్నూరు పోలీసులపై రహస్య విచారణ చేసిన జిల్లా ఎస్పీ జిందాల్**

పొన్నూరు, డిసెంబర్ 8,ప్రభాతవార్త: ఇరువురు కానిస్టేబుళ్ళు సస్పెండైన ఉదంతం రూరల్ పోలీస్ స్టేషన్లో చోటు చేసుకొంది. ఎస్పీ వకుల్ జిందాల్ ఈ మేరకు స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న నాగార్జున, మహేష్ అనే కానిస్టేబుళ్ళు ఇరువురిని ఆదివారం సస్పెండ్ చేశారు. అధికారుల సమాచారం మేరకు రేషన్ బియ్యం దందాలో ముఖ్య భూమిక పోషిస్తున్న ఈ ఇరువురు కానిస్టేబుళ్ళపై వచ్చిన ఆరోపణల మేరకు ఎస్పీ జిందాల్ రహస్య విచారణ





చేయించి నేరారోపణ రుజువు కావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. గత కొన్నేళ్ళుగా పొన్నూరు కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతుంది. గత ప్రభుత్వ హయాంలో ఈ అక్రమ రవాణా హత్యాకాండలకు దారి తీసిన ఉదంతాలను ఈ ప్రాంత ప్రజలు చవి చూశారు. కోట్ల రూపాయల మేరకు దందా జరిగి అక్రమార్కులు రా త్రికి రాత్రే సొమ్ము కూడబెట్టిన సంఘటనలు కోకొల్లలు. ఈ స్మగ్లర్లకు పోలీసులు కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు ఏనాడు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. మౌకికంగా హెచ్చరించి వదిలేయడమే తప్ప, శాఖాపరమైన చర్యలు మాత్రం చేపట్టలేదు. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అటు ప్రతిపక్షంలోనూ, ఇటు స్వపక్షంలోనూ ఈ చర్యలను ఖండిస్తూనే వచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ఈ దందాదారులపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులకు పలు మార్లు హెచ్చరికలు చేసినప్పటికీ వారు పెడచెవిన పెట్టడం గమనార్హం. ఇక పోలీసుల పాత్ర బహిరంగం కావడంతో పలువురు ఇచ్చిన ఫిర్యాదులు మేరకు విచారణ చేసిన ఉన్నతాధికారులు ఇరువురిపై వేటు వేయడమూ, రూరల్ ఎస్సై గండు కిరణ్‌బాబును అప్పటికప్పుడే విఆర్‌కు బదిలీ చేశారు. సుమారుగా మూడు వారాల క్రితం చంద్రశేఖర్ అనే కానిస్టేబుల్‌ను గుట్టు చప్పుడు కాకుండా వేరొక చోటకు బదిలీ చేశారు. దీన్ని బట్టి అక్రమార్కుల తాయిలాలకి పోలీసులు ఏ మేరకు అర్రులు చాస్తున్నారో తెలుస్తుంది. ఇదిలా ఉండగా అక్రమ మైనింగ్ దందాదారులకు కూడా పోలీసులు పెద్ద ఎత్తున అండదండలుగా నిలుస్తున్నట్లు పలువురు బహిరంగంగా చర్చించుకొంటున్నారు. అర్ధరాత్రులు అక్రమ మైనింగ్ వ్యవహారాలను దందాదారులు చక్కబెట్టుకొని పోలీసులకు కూడా వాటాలిచ్చి, పగలు మాత్రం పెద్ద మనుషులుగా చలామణి అవుతున్నట్లు పలువురు తెలిపారు. రూరల్ ఎస్సై పనితీరు పట్ల వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కూడా పలుమార్లు ప్రజావేదికలపై విమర్శించారు. ఏకపక్ష నిర్ణయాలు, అసాంఘిక కార్యకలాపాలకు కొమ్ముకాయడం రూరల్ ఎస్సై పోకడలన్నీ ఒంటెద్దుపోకడలుగా ఉన్నాయని ఆయన పలుమార్లు దుయ్యబట్టిన సంఘటనలున్నాయి. ఈ విధంగా పార్టీలకు అతీతంగా ఈ దందా జరుగుతున్నట్లుగా వ్యక్తమవుతుంది.

## ప్రత్యేక శిక్షణ శిబిరం ప్రారంభం

గుంటూరు విద్య డిసెంబర్ 8 ప్రభాతవార్త: వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వట్టిచెరుకూరు మండలం లేమల్లెపాడు గ్రామంలో ప్రత్యేక శిక్షణ శిబిరం ప్రారంభించడం జరిగినది. ఏడు రోజులు పాటు నిర్వహించనున్న ఈ శిబిరాన్ని తొలి రోజున ఎంఈఓ గారిమెల్ల సత్యనారాయణ మూర్తి, గ్రామ సర్పంచ్ పాతూరి కృష్ణా రావు మరియు హెడ్ మాస్టర్ కంభం పాటి శ్రీనివాస రావు గారు ప్రారంభించారు. ఈ శిబిరం నందు విద్యార్థులు గ్రామంలో స్వచ్ఛత హీ సేవ, పచ్చదనం పరిశుభ్రత, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించడంతో పాటు మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు వివిఐటియు ఎన్ఎస్ఎస్ అధికారి డా ఐఎల్ జె భక్తసింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీయుపి స్కూల్ పిటి పసుపులేటి శ్రీధర్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో శ్రీరామకోటి తులసీ సహస్రనామార్చనలు ధ్వజారోహణం

గుంటూరు కల్చరల్,డిసెంబర్ 08,ప్రభాతవార్త : స్థానిక ఆర్.అగ్రహారంలోని శ్రీరామనాక్షేత్ర 99వ శ్రీరామకోటి మహోత్సవాలు ఆలయ ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి,బెల్లంకొండ మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రమంలో సోమవారం అఖండ హరినామ సంకీర్తనలు,శ్రీమాన్ క్రోసూరి కృష్ణమాచార్యులు బ్రహ్మ నిర్వహణలో రాగ తాళాలతో గరుడాళ్వారులను ఆహా ్వనించి ధ్వజారోహణ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.సంతానార్థులకు గరుడా ప్రసాదాన్ని అందించారు.ప్రాంగణంలోని విద్యాభారతి సదనంలో సామూహిక శ్రీరామకోటి తులసీ శాస్రనామార్చనలు,విశేష హారతి అనంతరం భక్తులకు అన న్నప్రసాద వితరణ జరిగింది.ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో సువాసినులచే హనుమాన్ చాలీసా పారాయణ,పురాణం వాక్యాన్ని శేషసాయి,తిరుపతి వారిచే శబరి భక్తి ఉపన్యాసం,భక్తిరంజనీ లో బసవరాజు జయశంకర్,మునిపల్లె రమణి శ్రీరామదాసు కీర్తనలను ఆలాపించారు.సాయంత్రం శేష వాహనంపై శ్రీరామకోటి పుస్తకాలతో నగరోత్సవమ్ జరిగింది.బెల్లంకొండ మస్తాన్‌రావు,రాగం వెంకట లీలాసుందరి,పాతకోటి బ్రాహ్మణయ్య నాయుడు,కొప్పురావూరి వెంకట సుబ్బారావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.





## జీవనశైలి మార్పుల వల్లే జీర్ణవ్యవస్థకు అవస్థలు

### --ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ షేక్ నాగూర్ భాషా

గుంటూరు కల్చరల్,డిసెంబర్ 08,ప్రభాతవార్త : జీవనశైలి మార్పుల వల్లే జీర్ణవ్యవస్థకు అవస్థలు అని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ షేక్ నాగూర్ భాషా అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన ఆరోగ్యసభలో అన్నారు.జీర్ణకోశంలో ఏదైనా ఇబ్బంది అనిపిస్తే ప్రస్తుతం చాలా అధునాతన ఔషధాలు,అధునాతన చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయన్నారు.మనం తినేఆహారం వల్ల కూడా మలబద్ధక సమస్య తలెత్తుతుందని,అలా కాకుండా ఉండాలంటే సరిపడా నీరు తాగుతూ,ఆహారంలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆరోగ్యసభకు హాజరైన వారు జీర్ణకోశ,లివర్‌కు సంబంధించి లేవనెత్తిన సందేహాలను డాక్టర్ నాగూర్ భాషా నివృత్తిచేశారు.పేద,మధ్యతరగతి ప్రజలకు విశేష సేవలు అందిస్తూ,పరిసర ప్రాంత ప్రజలకు కూడా గ్యాస్ట్రో ఎంట్రాలజీలో మెరుగైన సేవలు అందిస్తున్న డాక్టర్ షేక్ నాగూర్ భాషా ను అవగాహన సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.ఆరోగ్యసభకు టివి సాయిరామ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా,రాడికల్ హ్యూమనిస్ట్ నాయకుడు కే.చంద్రశేఖరరావు,విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ళ ప్రసాదరావు లు పాల్గొని ప్రసంగించారు.





## జిల్లా మైనారిటీ కార్యదర్శిగా అల్లా బక్షు నియామకం

అమరావతి: డిసెంబర్ 8 ప్రభాతవార్త. మైనారిటీ జిల్లా కార్యదర్శిగా అమరావతి మండలానికి చెందిన అల్లాబక్షు ను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు మద్దూరి విజయ బాలచందర్ రెడ్డి నియామక పత్రాన్ని అందించారు. అమరావతి నియోజకవర్గ వైసిపి నేత నిమ్మ విజయ సాగర్ ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసినందుకు అదృష్టాన్ని గుర్తించి తన అవకాశం కల్పించాలని అల్లాబక్ష అన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు అత్యున్నత స్థానం కల్పించే పార్టీ వైసిపి పార్టీ అని నిమ్మ విజయసాగర్ అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో మస్తాన్వలి,యాసిన్, నాగేశ్వరరావు, రాంబాబు, రాము, మమ్ముస, తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాకు జాతీయ ఉత్తమ పురస్కారం

రొంపిచర్ల,డిసెంబర్ 8 ప్రభాతవార్త::హెచ్ఐవి/ ఎయిడ్స్ రోగులకు ఉత్తమ సేవలు అందించటం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడంలో పల్నాడు జిల్లా నరసరావుపేట ఏ.ఆర్.టి కేంద్రానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రం లో ఈ పురస్కారాన్ని డిసెంబర్ 1 న ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె నీలకంఠ రెడ్డి పల్నాడు జిల్లా నరసరావుపేట ఏ.ఆర్.టి కేంద్రంలో పనిచేసే డాక్టర్ శారద కి ఉత్తమ సేవ పురస్కారాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి మాట్లాడుతూ, గత ఏడాది ఉత్తమ పనితీరు కనబరించిన కారణంగా పల్నాడు జిల్లా నరసరావుపేట ఏ.ఆర్.టి కేంద్రానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం లభించిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం అందుకున్న నరసరావుపేట ఏ.ఆర్.టి సిబ్బంది మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు టిబి అధికారి డాక్టర్ మాధవి లత, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది, ఏ.ఆర్.టి సిబ్బంది పాల్గొన్నారు.

## పిజిఆర్‌ఎస్‌కు నాలుగు అర్జీలు

పొన్నూరు, డిసెంబర్ 8,ప్రభాతవార్త: ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు నాలుగు అర్జీలు అందినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలను పరిష్కారం కోసం ఆయా శాఖాధికారులకు పంపినట్లు చెప్పారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి రెండు, వ్యవసాయశాఖకు సంబంధించి ఒకటి, విద్యాశాఖకు సంబంధించి ఒక అర్జీ అందినట్లు తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ఈ



కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని సమస్యలకు పరిష్కారాన్ని పొందాలని తహశీల్దార్ కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, డిప్యూటీ ఎంపిడిఓ వేములు శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి దూపం రాజు, మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్ కెమెరాకి చిక్కిన పేకాటరాయుళ్ళు అరెస్ట్:

తెనాలి టౌన్ డిసెంబర్8(ప్రభాతవార్త): డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టి, వెంబడించిమరీ పేకాటరాయుళ్లని అరెస్టు చేసిన సంఘటన సోమవారం మండల గ్రామమైన ఎరుకలపూడి లో జరిగింది. తెనాలి రూరల్ పోలీసుల కథనం మేరకు,మండల గ్రామమైన ఎరుకలపూడి లోని కాలువకట్టపై చెట్లపొదల్లో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో,రూరల్ ఎస్సై ఆనంద్ తన సిబ్బందితో డ్రోన్ ద్వారా నిఘాపెట్టగా పేకాట ఆడుతున్న ఏడుగురిని గుర్తించగా వారిలో ఐదుగురు పరారయ్యారు,దొరికిన ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రు.1700/ నగదు మరియు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనపరచుకొని సీజ్ చేయటం జరిగిందని ఎస్ఐ ఆనంద్ తెలిపారు. అదేవిధంగా ఆదివారం పట్టణంలోని వైకుంఠపురం కాల్వగట్టు సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో,వన్ టౌన్ పోలీసులు దాడులు నిర్వహించగా 8 మంది జూదరులను అరెస్టు చేయడం జరిగిందని,వారి వద్ద నుండి రు.25 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## మున్సిపల్ఆస్తుల రక్షణకు. చర్యలు

### :మున్సిపల్ కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్8(ప్రభాతవార్త):పురపాలకసంఘ పరిధిలో గల, మున్సిపల్ ఆస్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు, మున్సిపల్ కమీషనర్ రామఅప్పలనాయుడు తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,మునిసిపల్ ఖాళీ స్థలములను,మునిసిపల్ స్కూల్ బిల్డింగ్స్ మరియు వాణిజ్య పరమైన భవనములు,కమ్యునిటీ హాలులు,స్మశాన వాటికలు, పార్కులు,వాటర్ ట్యాంకులు, డంపింగ్ యార్డు,హాస్పిటల్స్ తదితర ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకొనుటకు మునిసిపల్ విభాగము మరియు పోలీసు విభాగముతో కలిసి సమీక్ష సమావేశం సోమవారం సాయంత్రం, నిర్వహించారు.ఈసమావేశంలో, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ మరియు వాటిని ప్రజా ప్రయోజనలు చేకూర్చే విధముగా,ఉపయోగించి వాటి ద్వారా రాష్ట్ర ప్రభుత్వమునకు బహుళ ఆదాయము చేకూరేలా చేయవలేనని తీర్మానించామని మున్సిపల్ కమీషనర్ రామఅప్పలనాయుడు తెలిపారు.ఈకార్యక్రమంలో వార్డు మహిళా కార్యదర్శిలు, వార్డ్ ప్లానింగ్ కార్యదర్శులు, వార్డ్ రెవెన్యూ కార్యదర్శిలు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీమతి వాణి,మూడు పట్టణ పోలీస్ స్టేషన్ల యొక్క సర్కిల్ ఇన్స్పెక్టర్లు,మల్లిఖార్జునరావు, రాములు నాయక్, సాంబశివరావు,మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు మరియు డిఎస్పిజనార్దన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు శిక్షణ

మాచర్ల, డిసెంబరు 8 ప్రభాతవార్త: స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో పంట కోత ప్రయోగాలపై గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఏఎస్ఓ ప్రభాకర్, డివిజనల్ డీవైఎస్ఓ ఆయుబ్‌లు శిక్షణ ఇచ్చారు. పంట కోత ప్రయోగాలు, దిగుబడి అంచనా, నష్టపరిహారాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.పాపకుమారి మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు తప్పనిసరిగా పంటకోత ప్రమోగాలు సకాలంలో పూరినత చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బి.చౌదరి, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

## మత్స్యశాఖ డివిజనల్ డైరెక్టర్ గాలిదేవుడిని కలిసిన బెస్త కార్పోరేషన్ డైరెక్టర్



బాపట్ల,డిసెంబర్08,ప్రభాతవార్త: రాష్ట్రమత్స్య శాఖ డివిజనల్ డైరెక్టర్ గాలిదేవుడుని రాష్ట్ర బెస్త కార్పోరేషన్ డైరెక్టర్ చాపా సోమయ్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా చాపా సోమయ్య మాట్లాడుతూ బెస్త కార్పోరేషన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎఫ్‌డివో కిషోర్,మాజి కౌన్సిలర్ చాపా సోమయ్య,టిడిపి నాయకులు కొలకలేటి రమేష్,ఫిషర్‌మెన్ సొసైటీ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ గ్రేమ్స్‌లో సత్తాచాటిన గురుకుల విధ్యార్ధులు



యద్దనపాడు, డిసెంబర్ 8, ప్రభాతవార్త : మండల పరిధిలోని వంకాయలపాడు పంచాయితీ బోయపాలెం గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్దులు స్కూల్ ఫెడరేషన్ 2025 అధ్వర్యంలో జరిగిన 69వ రాష్ట్రస్థాయిలో ధాంగ్టా మార్షల్ అర్ట్స్ పరవాడ, విశాఖపట్నంలో ఈ నెల 6వ తేది నుండి 7వ తేది జరిగిన పోటీలలో పాఠశాల విద్యార్దులు సత్తాచాటారని హెచ్‌ఎమ్ బి ప్రభాకరరావు తెలిపారు. పాఠశాలలో 9వ తరగతికి చెందిన బి అఖిల్ అండర్ 19 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి తదుపరి నేషనల్ గేమ్స్‌కు ఎంపికకావటం జరిగిందని, అదేవిధంగా 7వ తరగతి చదివే పి చైతన్య అండర్ 14విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడని, మట్టి కుస్తి పోటీలో అర్ శివ మల్లిఖార్జున జిల్లా లెవల్‌లో రజిత పథకం సాధించి తదుపరి రాష్ట్ర స్దాయి పోటీలకు ఎంపిక కావటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్దులు అభినందనలు తెలపటం జరిగిందన్నారు.

## వీడిన చిలకలూరిపేట రోడ్డు ప్రమాదం చిక్కుముడి



చిలకలూరిపేట, ప్రభాతవార్త :ఈనెల 4న చిలకలూరిపేటలో కంటైనర్ ఢీకొని 5 విద్యార్థులు మృతిరోడ్డుపై కంటైనర్ ని ఆపడం వల్లే ప్రమాదం జరిగిందని తేల్చిన పోలీసులుబ్రేక్ ఇన్స్పెక్టర్ అవతారం ఎత్తి హైవేలపై వాహనాలు ఆపుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఓ ఏ ఎస్సై కుమారుడు,అతని గ్యాంగ్‌బ్రేక్ ఇన్స్పెక్టర్ నని కంటైనర్ ని ఆపిన తిళీ। కుమారుడి అతని అనుచరులుబ్రేక్ ఇన్స్పెక్టర్ పేరుతో అక్రమ వసూళ్లకి పాల్పడుతున్న తిళీ। కుమారుడు,అతని గ్యాంగ్‌హైవేపై ఒక్కసారిగా కంటైనర్ ఆపడం వల్లే ఘోర ప్రమాదం జరిగినట్లు అధికారుల నిర్ధారకారులో నుండి దిగి కంటైనర్ ఆపాలని సైగ చేసిన ఏఎస్సై కుమారుడునరసరావుపేట దీళీశి ఆఫీస్ లో పనిచేసే తిళీ। కుమారుడిగా నిర్ధారణ వచ్చిన అధికారులు2023న నరసరావుపేటలో తక్కువ ధరకే బంగారం అంటూ 40 లక్షలతో ఉడాయించిన కుమారుడుసెపరేట్ గ్యాంగ్ ఏర్పాటు చేసుకుని మరీ జిల్లాలో పలు దందాలకు పాల్పడుతున్న తిళీ। కుమారుడు తిళీ। కుమారుడుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్న చిలకలూరిపేట పోలీసులు.

చిలకలూరిపేట రూరల్ పోలీసుల అదుపులో మదమంచి వెంకట అనుగ్న నాయుడు (వెంకటనాయుడు).రవాణాశాఖ అధికారుల పేరుతో వసూళ్లకు పాల్పడిన వెంకటనాయుడు..కంట్కటెనర్‌ను హైవేపై ఆపి, ప్రమాదంలో ఐదుగురి మరణానికి కారణమైన వెంకటనాయుడు.వెంకటనాయుడును చిలకలూరిపేట గ్రామీణ పీఎస్‌కు తరలింపు.చిలకలూరిపేట పీఎస్‌కు వచ్చిన గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పల్నాడు ఎస్పీ కృష్ణారావు.వెంకటనాయుడు తండ్రి ఏఎస్సై మదమంచి శ్రీనివాసరరావు కావడంతో వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.సదరు విషయాలపైన వున్న అనుమానాలు అన్నింటికి పోలీస్ వారు త్వరలో తెరదిం చుతారు అని ప్రజలు ఆశిస్తున్నారు.

## రాజేంద్రప్రసాద్ మానవతా సేవలు వెలకట్టలేనివి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ప్రభాతవార్త :సీసీఎల్ వ్యవస్థాపకులు పట్టణంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి రూ.15 లక్షల విరాళమందించి తన ఉదారత చాటుకున్నారు. మాజీమంత్రి ప్రత్తిపాటితో సమావేశమైన సీసీఎల్ సంస్థ వ్యవస్థాపకులు చల్లా రాజేంద్రప్రసాద్‌సీసీఎల్ ప్రొడక్ట్స్ వ్యవస్థాపకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త చల్లా రాజేంద్రప్రసాద్ నియోజకవర్గ ప్రజలకు అందిస్తున్న మానవతాసేవలు వెలకట్టలేనివని, వారి సహకారంతో పేదల జీవితాలు వృద్ధి చెందాలని ఆకాంక్షి స్తున్నామని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. దిగ్గజ వ్యాపారవేత్త, సామాజిక సేవా తత్పరులు చల్లా రాజేంద్రప్రసాద్ తనను కలిసిన సందర్భంగా ప్రత్తిపాటి ఆయన్ని ఘనంగా సన్మానించారు. స్థానిక నివాసంలో ప్రత్తిపాటితో సమావేశమైన రాజేంద్రప్రసాద్ నియోజకవర్గ అభివృద్ధి.. ప్రభుత్వ పథకాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ.. పేట ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఏర్పాటు, నిర్వహణలో రాజేంద్రప్రసాద్ తనవంతు చేయూత అందించినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సతీమణి భువనేశ్వరి చేతులమీదుగా గతంలో ప్రారంభమైన తాగునీటి పథకం కోసం రూ.15లక్షల విరాళం అందించడం ద్వారా రాజేంద్రప్రసాద్ తన సేవా తత్పరతను చాటుకున్నారని, ఆయన దాతృత్వంతో ప్రజలకు మేలు జరిగిందన్నారు. రాజేంద్రప్రసాద్ మాదిరి ఉన్నతస్థానాల్లోని ప్రముఖులు, పారిశ్రామిక దిగ్గజాల్లి పేద జీవితాల్లో వెలుగులు నింపే మహోన్నతులుగా మార్పులనే సదాశయంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4కు శ్రీకారం చుట్టారని ప్రత్తిపాటి చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీ (సీఎస్ఆర్) లో భాగంగా సంపన్నులు తమ సంపాదనలో ఎంతోకొంత పేదల అభ్యున్నతికి వినియోగించి, సమాజ ప్రగతికి తోడ్పాటు అందించాలని ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు.

## సమస్యలను చట్టపరిధిలో పరిష్కరిస్తాం



బాపట్ల,డిసెంబర్08,ప్రభాతవార్త: సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించడం జరుగుతుందని సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ తెలిపారు.స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీ దారుల వ్రాతపూర్వక అర్జీలను సిసిఎస్ డిఎస్పి స్వయం గా స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించామని అర్జీదారులకు భరోసా కల్పించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు, ఇతర పలు సమస్యల పై 65 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో పి.జి.ఆర్.ఎస్ సెల్ మహిళా ఎస్.ఐ లక్ష్మీరాజ్యం,పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పాతూరి జన్మదిన వేడుకలు..



మంగళగిరి, డిసెంబర్ 8, ప్రభాతవార్త :పెదవడ్లపూడి శివాలయం సెంటర్లో కూటమి నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బీజేపీ రాష్ట్ర ఫ్లోర్ కాల్ ఇంచార్జి, మాజీ జెడ్పి చైర్మన్ పాతూరి నాగభూషణం జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు ఏర్పాటు చేసిన కేకును బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ తో కలసి పాతూరి నాగభూషణం నాయకులు ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేశారు. కూటమి కార్యకర్తలు బాణాసంచా కాల్చి ఆనంద ఉత్సవాలు జరుపుకున్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ మాట్లాడారు. పాతూరి నాగభూషణం జన్మదినోత్సవ సంబరాలు ఇంత జనం మధ్య చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయం, గో సేవ, దైవ సేవ అనే పరమార్థంగా భావించి వాటి కోసమే జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి మాకు పరిచయం అవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. 15 రోజులు పాటు రాయలసీమ నుంచి శ్రీకాకుళం వరకు చేయబోయే అటల్ మోదీజీ సుపరిపాలన యాత్రకు బస్సు అందజేసిన పాతూరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామినేని చైర్మన్ వైస్ చైర్మన్ రామినేని ధర్మ ప్రచారక్, మాజీ సర్పంచ్ పాతూరి సుధారాణి, గోమాత గోశాల కన్వీనర్ పాతూరి శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు రమేష్ నాయుడు, కూటమి నాయకులు అన్నె శరత్, చల్లపల్లి కిరణ్, గడ్డిపాటి సాంబశివరావు, యువరాజ్, వాసం శ్రీనివాసరావు జవ్వాది అమ్మయ్య చౌదరి, జె సాంబశివరావు, మందే తదితరులు పాల్గొన్నారు. కాగా త్వరలో భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరం వద్ద అటల్ మోదీజీ సువరిపాలన యాత్ర చేయబోయే బస్సు కు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఉపాధ్యాయుడు సస్పెన్షన్ ను ఉపసంహరించాలి

గుంటూరు విద్య డిసెంబర్ 8 ప్రభాతవార్త : ఈనెల 5వ తారీఖున మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా స్థానిక ఏటి అగ్రహారంలోని ఎస్ కె బి ఎం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ గణిత ఉపాధ్యాయులు ఎంపీ సుబ్బారావు అరవ తరగతి విద్యార్థుల పట్ల ప్రవర్తించిన తీరు సరిగా లేదని సస్పెండ్ చేసి ఉన్నారు. కానీ అది అనుకోకుండా జరిగిన చిన్న సంఘటన కావున సుబ్బారావు గారిపై ఉన్న సస్పెన్షన్ వెంటనే ఉపసంహరించాలని ఏపీటీఎఫ్ 1938 జిల్లా శాఖ పక్షాన డీఈవో సివి రేణుక ని కోరడమైనది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె. నరసింహారావు మరియు జిల్లా నాయకులు పి. వెంకయ్య పాల్గొన్నారు.

## శకుంతల హాస్పిటల్స్‌లో అరుదైన చికిత్స



నరసరావుపేట, డిసెంబర్ 8 ప్రభాతవార్త :పట్నంలోని శకుంతల జనరల్ గ్యాస్ట్రో లివర్ కేర్ హాస్పిటల్స్ లో అరుదైన చికిత్స నిర్వహించారు. వివరాలను సోమవారం హాస్పిటల్ ఎం.డి డాక్టర్ ఐలా శ్రీనివాస్ తెలియజేశారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం చవిటి పాలెం గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న చిన్నారి రూ. 10 నాణ్యాన్ని మింగింది. విహారయాత్రకు వెళ్లిన చిన్నారి ఆడుకుంటూ పొరపాటున మింగిన నాణ్యం పొట్టలోకి వెళ్ళింది. పాపకు ఇబ్బందిగా ఉండడంతో నరసరావుపేట శకుంతల హాస్పిటల్స్ కు తీసుకువచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించి డాక్టర్ ఐలా శ్రీనివాస్ ఎండోస్కోపీ ద్వారా నాణ్యం పొట్ట నుండి బయటకు తీశారు. ఎటువంటి ఆరోగ్య ఇబ్బందులు లేకుండా పూర్తి సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. సాధారణంగా 10 రూపాయలు నాణ్యం మిగతా నాణ్యాల కంటే బరువు ఎక్కువగా ఉండటం జరుగుతుందన్నారు. అటువంటి వాటిని పొట్టనుండి బయటకు తీయడానికి ఆధునిక పరికరాల సాయంతో, అందుబాటులోకి వచ్చిన నూతన టెక్నాలజీ ద్వారా సాధ్యమవుతుందని వివరించారు. ఎటువంటి నొప్పి, కుట్లు లేనటువంటి విధానం ద్వారా చికిత్స అందించడం వల్ల వేగంగా ఆరోగ్య సమస్యలతో వచ్చేవారు కోలు కోవడం జరుగు తుందన్నారు. శకుంతల హాస్పటల్లో ఇటువంటి చికిత్సలకు అవసరమైన సదుపాయాలు ఉన్నాయని వినియోగించుకోవాలన్నారు. పూర్తి ఆరోగ్యంగా కోలుకున్న చిన్నారి తల్లిదండ్రులు అంకురాజు, ఏసమ్మ నాణ్యం బయటికి తీసిన డా.ఐలా శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతుల ఉసురుతో కూటమి ప్రభుత్వం కూలిపోతుంది..

### - ఎమ్మెల్యేపై తీవ్రస్థాయిలో వైఎస్ఆర్సిపి విమర్శలు



నరసరావుపేట, డిసెంబర్ 8 ప్రభాతవార్త : రైతులకు రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయంతో వారు ఉసురు తగిలి కూటమి ప్రభుత్వం కూలి పోతుందని వైయస్సార్సీపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ బాధ్యతగా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వస్తుంటే రాష్ట్రవ్యాప్తంగా వీచిన గాలిలో గెలిచిన ఎమ్మెల్యే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని విమర్శించారు. జిల్లా ఆస్పత్రిలో ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ అంగన్వాడీ టీచర్లు చేయించారని చెప్పటం ఆయన అవగాహన రాహిత్యానికి అద్దం పడుతుందన్నారు. పేద మహిళకు తొడలో సర్జికల్ బ్లేడు పది రోజులు ఉండి తీవ్రమైన అనారోగ్యం పాలైతే ప్రజా ప్రతినిధిగా ఆమె పట్ల కనీస బాధ్యతగా వ్యవహరించలేదన్నారు. నిరక్ష ్యంగా తప్పు చేసిన వైద్యుని వెనకేసుకొని రావడం దురదృష్టకరమన్నారు. తప్పు చేసిన డాక్టర్ను ప్రభుత్వ ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తే, ఎమ్మెల్యే వ్యతిరేకించటం విడ్డూరంగా ఉందన్నారు. వైయస్సార్ సి.పి హయాంలో జిల్లా ఆసుపత్రిలో అవినీతి జరిగిందని దమ్ముంటే నిరూపించాలని చాలెంజ్ విసిరారు. ఆర్థోపెడిక్ హాస్పటల్ గా ఉన్న తమ వైద్యశాలలో కరోనా కు ట్రీట్మెంట్ చేశామని విమర్శలు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమం పర్యటన సందర్భంగా తీవ్రంగా గాయపడిన ఆవుకు దగ్గరుండి చికిత్స చేసి పశువుల ఆసుపత్రికి తాము పంపితే తాను అది నిర్వహించినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. కనీసం మల్లమ్మ సెంటర్లో ఏడాది నుండి సిగ్నల్ లైట్స్ లేవని, వాటిని ఏర్పాటు చేయడం చేతకానితనం టిడిపిదన్నారు. జేఎన్టీయూ కళాశాలలో హాస్టల్స్ బాగు చేయలేదన్నారు. ఆరుద్రోత్సవం ఏర్పాట్లు కూడా కోటప్పకొండ లో సక్రమంగా చేయకపోవడంతో భక్తులు ఘర్షణకు దిగారని గుర్తు చేశారు. ఎస్ ఆర్ కే టి కాలనీలో వారానికి ఒక్కసారి కూడా మంచినీళ్లు రావట్లేదని ప్రజలు కలెక్టరేట్లో ధర్నా చేశారని తెలిపారు. రొంపిచర్లకు కేంద్రీయ విద్యాలయాన్ని తీసుకువస్తే కనీసం దానికి స్థలం కూడా ఇవ్వలేని దౌర్భాగ్యస్థితి నియోజకవర్గంలో అధికార పార్టీదన్నారు. లింగంగుంట్ల భూములకు సంబంధించి కీలకమైన కోర్టు ఆర్డర్ ను తాను తీసుకురావడం జరిగింది అన్నారు. ఎన్నికల కోడ్ తో ఆ ప్రక్రియకు కొంత బ్రేక్ పడిందన్నారు. రెండేళ్లు గడిచిన ఆ భూములు గురించి పట్టించుకోలేదన్నారు. క్రిస్టియన్ పాలెం లో 80 ఏళ్ల వృద్ధులు కాలవల్లో దిగి బాగు చేసుకుంటున్నా రంటే పారిశుద్ధ్య పరిస్థితి ఎట్లా ఉందో తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా వ్యక్తిగత దూషణలు మాని ప్రజా ప్రతినిధిగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్రెడ్డి హితవు పలికారు.

## ఎమ్మెల్యే డా. చదలవాడ అభిమానుల సేవా కార్యక్రమాలు



రొంపిచర్ల,డిసెంబర్ 8,ప్రభాతవార్త : శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అభిమానులు సోమవారం సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే మనవడు అత్వర రామ్ జన్మదిన సందర్భంగా అభిమానులతో పాటు అమూల్య నర్సింగ్ హోమ్ స్టాఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తో పాటు ఆయన సతీమణి సుధా రాజేశ్వరి, డాక్టర్ చదలవాడ ఆదిత్య డాక్టర్ నూతలపాటి సాయి ప్రణవి, నూతలపాటి అజయ్ మాధవి లతలు కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైద్యశాల ప్రతినిధులు మాట్లాడుతూ తమ శాసనసభ్యులు డాక్టర్ అరవింద బాబు నిర్వహించే సేవా కార్యక్రమాల్లో తాము కూడా భాగస్వాములుగా ఉంటామన్నారు. ఆయన మార్గంలో నడవడం సంతోషంగా ఉందని తెలిపారు.

## అట్టహాసంగా టీవీఎస్ నూతన బైక్స్ ఆవిష్కరణ..



నకరికల్లు,డిసెంబర్ 8 ప్రభాతవార్త::నరసరావుపేట యూనిటీ టివియస్ బైక్ షోరూం నందు జరిగిన నూతన బైక్స్ ఆవిష్కరణ కార్యక్రమానికి గౌరవ ఎమ్మెల్యే శ్రీ చదలవాడ అరవిందబాబు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎన్ శివనాగేశ్వరరావు , బ్రేక్ ఇన్స్పెక్టర్స్ పవన్ కుమార్, వంశీ కృష్ణ పాల్గొన్నారు. టీవీఎస్ అపాచీ ఆర్ టి ఆర్160 4జు గినీగి మోడల్ వెహికల్ ఎమ్మెల్యే అరవిందబాబు ఇన్స్పెక్టర్ శివనాగే శ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. రైడర్ ౹౹౹ వేరియంట్ ను బ్రేక్ ఇన్స్పెక్టర్ పవన్ గారు ఎన్టార్క్ 150 స్కూటీను బ్రేక్ ఇన్స్పెక్టర్ వంశీ కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ తగ్గటం వలన వెహికల్ సేల్ బాగా పెరిగి కస్టమర్లకు తక్కువ ధరలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ నాలుగు సంవత్సరాలలో యూనిటీ టీవీఎస్ వారు పద్దెనిమిది వేల వెహికల్స్ డెలివరీ చేసినందుకు అభినందనలు తెలిపారు. వెహికల్ ఇన్స్పెక్టర్ శివనాగేశ్వరరావు మాట్లాడుతూ యూనిటీ టివియస్ వారు నెలకు మూడు వేల వెహికల్స్ సర్వీస్ చేస్తున్నందుకు అభినందించారు. బ్రేక్ ఇన్స్పెక్టర్ పవన్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనిటీ టీవీఎస్ సంస్థ బిజినెస్ హెడ్ శ్రీరామ్ , ఆపరేషన్స్ హెడ్ మహేష్ , సేల్స్ జీఎం కిరణ్ పాల్గొన్నారు.

## హిందూ ఫార్మసీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

గుంటూరు విద్య డిసెంబర్ 8 ప్రభాతవార్త :హిందూ ఫార్మసీ కళాశాలలో మొదటి సంవత్సరం డిఫార్మసీ, బి ఫార్మసీ, ఫార్మా డి, కోర్సులలో చేరిన విద్యార్థులకు తమ సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి నాగభూషణం తెలిపారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి నాగభూషణం అధ్యక్షత వహించారు .తమ కళాశాల యాజమాన్యం వారు ఏర్పాటు చేసిన వివిధ మోలిక వసతులను వనరులను వినియోగించుకొని ఉత్తమ ఫార్మసీ నిపుణులుగా, పౌరులుగా ఎదగాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఫార్మా డి డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు సాంకేతిక విద్య తో పాటు ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ స్పోర్ట్స్ లాంటి కార్యక్రమాల్లో పాల్గొని సమాజ సేవ పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు తమ జూనియర్స్ కు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్ మధు సూదన రావు లు విద్యార్థులకు తమ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ప్రత్యూష, అధ్యాపకులు ఎల్వికేఎస్ జోత్స్న, శర్మ శ్రీ, షేక్ షకీలా, శ్రీరేఖ, నాగ సురేఖ విద్యార్థులు పాల్గొన్నారు.

## గణిత ఉపాధ్యాయుడు ఎం .పీ .సుబ్బారావు సస్పెన్షన్ ను వెంటనే ఎత్తివేయాలి

### నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి హైమారావు.

గుంటూరు విద్య డిసెంబర్ 8 ప్రభాతవార్త:ఎస్ కె బి ఎం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సుబ్బారావును పేరెంట్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా కాకతాళీయంగా జరిగిన సంఘటన నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫిర్యాదు లేనప్పటికీ జరిగిన సంఘటనను ఒక విలేఖరి మీడియాలో వైరల్ చేయడంతో జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుక సస్పెండ్ చేయడం సరికాదని, త్వరగా సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుకా కి వినతి పత్రం సమర్పించారు. రేణుక మాట్లాడుతూ విచారణ అధికారిని ఏర్పాటు చేసి విచారణ చేపడతామని త్వరలో ఆ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా విద్యా శాఖ అధికారికి వినతి పత్రం సమర్పించిన వారిలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు పి సాయి విశ్వనాథ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి లలిత బాబు తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలు, ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన



విజయపురిసౌత్, డిసెంబరు 8 ప్రభాతవార్త: భూసార పరీక్షలు, ప్రాముఖ్యతపై పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం విజయపురిసౌత్‌లోని వెల్ఫేర్ స్కూల్‌లో సోమవారం నిర్వహించారు. మట్టి ఆరోగ్యం, సేంద్రియ వ్యవసాయంపై అవగాహనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని జిల్లా ఏఎంసీ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ సమన్వయంతో కార్యక్రమాన్ని చేపట్టారు. 8, 9వ తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానంగా మట్టి ఆరోగ్యం, ప్రాముఖ్యత, సేంద్రియ పదార్థాల వినియోగం, జీవ స్రవంతుల సంరక్షణ వంటి పద్ధతుల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో అధికారులు పియాకోబు, ఎం.అరుణ, గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ షేక్ జాస్మిన్, పాఠశాల సిబ్బంది, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.సునీత,ఉపాధ్యాయులు, జి.సునీత, కె.సరళ,ఎన్.సరళ, పి.నాగమణి పాల్గొన్నారు.

## పల్నాడు జూనియర్ కళాశాల ఫేర్వెల్ డే వేడుకలు




మాచర్ల, డిసెంబరు 8 ప్రభాతవార్త: పల్నాడు జూనియర్ కళాశాల విద్యార్థుల ఫేర్వెల్ డే వేడుకలు స్థానిక నరిశెట్టి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ పఠాన్ నాగూర్‌వలి మాట్లాడుతూ చెడు ఆలోచనలకు దూరంగా ఉండి, స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో పట్టుదలతో ముందుకు కొనసాగి, పరీక్షల్లో మంచి ప్రతిభను కనపరచాలన్నారు. మంచి భవిష్యత్తును నిర్మించుకుని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ మారేపల్లి లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ శివభాస్కర్, మర్రి వెంకటనారాయణ, డైరెక్టర్ మస్తాన్‌వలి, ఆంజనేయశాస్త్రిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు.

## నిమ్మగడ్డ లక్ష్మీప్రసాద్ సేవలు మరువలేనివి



మాచర్ల, డిసెంబరు 8 ప్రభాతవార్త: సత్యసాయి సేవాసమితి ద్వారా ప్రజలకు ఎంతో సేవ చేసిన స్వర్గీయ నిమ్మగడ్డ లక్ష్మీ ప్రసాద్ సేవలు మరువలేనివని సత్యసాయి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ అక్కినేని అనిల్, సేవా సమితి కన్వీనరు జక్కా శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపల్ వై.రమాదేవి అన్నారు. సోమవారం లక్ష్మీప్రసాద్ నాలుగో వర్ధంతి కార్యక్రమాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహిం చారు. పాఠశాల ఆవరణలో ఉన్న లక్ష్మీ ప్రసాద్ విగ్రహానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మీ ప్రసాద్ చేసిన సేవలను కొనియాడారు. పట్టణంలో సత్యసాయి విద్యావిహార్‌ను స్థాపించి, పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత ఇంగ్లీషు మీడియం విద్యను అందించిన విద్యాదాత అని కొనియాడారు. అదే స్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా పాఠశాలను కొనసాగిస్తామన్నారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు లక్ష్మీప్రసాద్ వ్యక్తిత్వాన్ని సేవలను కొనియాడుతూ ఆయనతో తమకున్న జ్ఞాపకాలను పంచుకున్నారు.

## బ్రహ్మానందపురం తండాలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



విజయపురిసౌత్, డిసెంబరు 8 ప్రభాతవార్త: డిసెంబరు 10 నుంచి 16 వరకు ఏడు రోజులపాటు మాచర్ల మండలం బ్రహ్మానందపురం తండాలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం జరుగుతుందనిఎ ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపల్ డా॥ ఎస్.నయీమ్‌భాను తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డా॥ ఎం.సుధాకర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ వి.దివ్యతేజోమూర్తి సమన్వయంతో ఈ శిబిరాన్ని స్థానిక ఏపీఆర్‌డీసీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా॥ ఎస్కే మొహమ్మద్ బాషా నిర్వహించనున్నారు. 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో గ్రామాభివృద్ధి, పర్యావరణ సంరక్షణ, ఆరోగ్యం, విద్య, గ్రామ శుభ్రత వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రొఫెసర్ వి.దివ్యతేజో మూర్తి, డా॥ఎం.సుధాకర్‌లు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తమ సమయాన్ని సమాజానికి అంకితం చేస్తే వారి సేవలు గ్రామాభివృద్ధిలో, సామాజిక సౌహార్దం పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. గ్రామంలోని ప్రజలతో కలిసి అనేక శుభప్రవర్తనలకు నిలబడతారని, గ్రామాభివృద్ధికి ఈ శిబిరం గణనీయమైన మార్పును తీసుకురాబోతుందని వారు పేర్కొన్నారు.

## లేమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



విజయపురిసౌత్, డిసెంబరు 8 ప్రభాతవార్త: స్థానిక లేమెన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను మానవ ఆదరణ సేవాసమితి అధ్యక్షులు పలుకూరి జోసెఫ్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ పాస్టర్ డాక్టర్ డేనియల్ శ్యాంబాబు మాట్లాడుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ, శాంతి, కరుణ, యేసుక్రీస్తు సందేశం. క్రైస్తవ్యం అనేది మతం కాదు జీవన విధానం అన్నారు. నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించు అన్న క్రీస్తు మాటలు పాటిస్తే సమాజంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావుడందని ప్రపంచమంత ప్రశాంతంగా ఉంటుందన్నారు. యేసుక్రీస్తు జననం గురించి, యేసుక్రీసఉ్త బోధల గురించి వివరించారు. యేసుక్రీస్తు చూపిన మార్గం సర్వమానవాళికి అనుసరణీయమన్నారు. అనంతరం ఆదరణ మానవ సేవాసమితి అధ్యక్షులు జోసెఫ్‌బాబు ఆధ్వర్యంలో కేకు కటింగ్ చేశారు. క్రిస్మస్ పాటల ఆరాధన, యేసుక్రీస్తు దైవ ప్రార్థనల అనంతరం భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో దైవ సహాయకులు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘ సీఈవోల ఆందోళన



గురజాల, డిసెంబరు 8 ప్రభాతవార్తః సహకార సంఘ సీఈవోలు, సిబ్బంది తమ డిమాండ్ల సాధనకై సోమవారం గురజాల పట్టణంలో ఆందోళన నిర్వహించారు. జీవో నెం.36ను తక్షణమే అమలు చేయాలని, డీఎల్‌ఎఫ్‌ఎస్ కమిటి ద్వారా జీతాలు చెల్లించాలని, జీతాల డ్యూటీ పద్దులను రద్దు చేయాలని, గ్రాడ్యూటి చట్టం అమలు చేయాలని, 2019-2024 వేతన సవరణ చేయాలని, కెపాసిటి టూపే నిబంధనలకు సంబంధం లేకుండా జీతభత్యాలు చెల్లించాలని, రైతులకు సంఘాల ద్వారా మాత్రమే పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులను చేతబూని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చర్లగుడిపాడు సీఈవో గురవయ్య, రెంటచింతల సీఈవో ఐజాక్, పులిపాడు సీఈవో జానీబాషా, గురజాల సీఈవో పీర్ అహ్మద్, కారంపూడి సీఈవో సాంబశివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు



గురజాల, డిసెంబరు 8 ప్రభాతవార్తః పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్లబండలాగుడు పోటీల్లో సోమవారం ఆరుపళ్ల విభాగం పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీల్లో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 4014 అడుగులతో ప్రథమస్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా యద్దనపూడికి చెందిన మేస్త్రి ఖాదర్ మస్తాన్, తెలంగాణ రాష్ట్రం మఠంపల్లికి చెందిన గాదె ఆషేక, సుమన్‌రెడ్డి సంయుక్త ఎడ్లజత 3886 అడుగులతో రెండోస్థానం, కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య, మధు ఎడ్లజత 3871 అడుగులతో మూడోస్థానం, గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన గుదిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్లజత 3776 అడుగులతో నాలుగోస్థానం, గుంటూరు ప్రత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి ఎడ్లజత 3750 అడుగులతో ఐదోస్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం కోండెపాడుకు చెందిన చాగంటి శ్రీనివాసరావు ఎడ్లజత 3539 అడుగులతో ఆరోస్థానంలో నిలిచాయి.

6MN 8_6MN 8.qxd 12/9/2025 12:56 AM Page 1



## సమాజంలో పేద ప్రజలకు సేవ చేయడం గొప్ప పుణ్యకార్యం..

### కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చిన్నబోయిన చిట్టిబాబు వెల్లడి

ఎ కొండూరు, డిశంబర్ 8, ప్రభాతవార్త : సేవా కార్యక్రమాల ద్వారానే సమాజంలో ప్రజలకు మంచి జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చిన్నబోయిన చిట్టిబాబు అన్నారు. భవానీపురం వద్ద సూఫీ సేవాసదన్ నూతన కార్యాలయాన్ని ఛైర్మన్ చిట్టిబాబు సందర్శించి మాట్లాడుతూ గత 20ఏళ్లుగా సూఫీ సేవాసదన్ ఛైర్మన్ రాష్ట్ర టిడిపి మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఫైజాన్ సమాజంలో పేద వర్గాల ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు సమాజంలో పుణ్యకార్యమని తద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతుందని ప్రతి ఒక్కరు సమాజ సేవలో భాగంగా పేద ప్రజలకు సేవచేసే మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా సమాజంలో ధనిక పేద అనే తేడా లేకుండా సమాజాభివృద్ధికి దోహదపడతారని ఛైర్మన్ చిట్టిబాబు పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఛైర్మన్ చిట్టిబాబు వెంట కొండపల్లి మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ మహబూబ్ సుభాని మైలవరం మండల పార్టీ అధ్యక్షుడు జె గోపాలస్వామి తదితరులు పాల్గొని సూఫీ సేవా సదన్ ద్వారా ఫైజాన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఛైర్మన్ చిట్టిబాబు కో ఆప్షన్ మెంబర్ మహబూబ్ సుభాని గోపాల స్వామిలను శాలువలతో సత్కరించి సూఫీ సేవాసదన్ ట్రస్ట్ మెమొంటోలను అందచేశారు. నిర్వాహకులు సల్మాన్ యజ్దాని పాల్గొన్నారు.



## ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముళ్లు

### - పాగాల అంజి స్వామి ఆధ్వర్యంలో అన్నదానం

ఎ కొండూరు, డిశంబర్ 8, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం చీమలపాడు వద్ద చెరువు సాగు నీటి సంఘం ఛైర్మన్ పాగాల ఆంజనేయులు (అంజి) అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం సోమవారం భక్తి ప్రపత్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టడిపి మాజీ మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మోర్ల తిరుపతిరావు, మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేకల రామారావు (జాన్) యువత నాగబాబు, సాయి పాల్గొన్నారు. స్వాములు అన్నదానం నిర్వహించారు.



## సాదాసీదా మనిషిలా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

## పట్టణ వార్డుల్లో రహదారుల్లో మురికివాడల్లో కాలినడక పర్యటన

ఎ కొండూరు, డిశంబర్ 8, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా తిరువూరు కూటమి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సోమవారం తెల్లవారు జామునే చలిని మంచును సైతం లెక్కచేయకుండా ఒక సామాన్య పౌరుడిలా తిరువూరు పట్టణంలోని పలువార్డులు ప్రధాన రహదారుల్లో కాలినడకతో పర్యటిస్తూ సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు పట్టణంలోని వివిధ హోటళ్ళు కూరగాయల దుకాణాలు వివిధ రకాల తోపుడు బండ్ల చిరు వ్యాపారుల వద్దకు విద్యార్థులు, కూలీలు వద్దకు వెళ్ళి వారి యోగక్షేమాలు, వ్యాపారం అభివృద్ధి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే శ్రీనివాసరావు అప్యాయంగా పలకరించి అడిగి తెలుసుకోవడం పట్ల హోటల్ యజమానులు, కూరగాయల దుకాణ వ్యాపారులు ఇంకా ఇతర కూలీలు చేతివృత్తి పనుల వారు ఉబ్బితబ్బిబయ్యారు. ఒక ఎమ్మెల్యే దర్పం ప్రదర్శించకుండా సాదాసీదా మనిషిలా చలి మంచులో ఉదయాన్నే కాలినడకన రావడం పట్ల తిరువూరు పట్టణ ప్రజలు, వివిధ రకాల చిరు వ్యాపారులు చేతివృత్తుల వారు ఎమ్మెల్యే శ్రీనివాసరావు తీరును ప్రశంసించారు.





## 13న లోక్ అదాలత్

### - కోర్టుల్లో కేసుల రాజీ పరిష్కారం కక్షిదారులకు రాచబాట... జూనియర్ సివిల్ జడ్జి సింధూర వెల్లడి

ఎ కొండూరు, డిశంబర్ 8, ప్రభాతవార్త :13న తిరువూరులో జరిగే లోక్ అదాలత్‌ను ప్రజలు కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ సింధూర పిలుపునిచ్చారు. కోర్టు ఆవరణలో జడ్జి సింధూర అధ్యక్షతన బార్ అసోసియేషన్ సభ్యులు పోలీస్ బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సింధూర అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సూర్యతేజ, న్యాయమూర్తులు అడ్వకేట్స్, పోలీస్ సిబ్బంది, బ్యాంకు అధికారులు సమన్వయంతో తిరువూరు కోర్టులో పెండింగ్‌లో సివిల్ మరియు క్రిమినల్ కేసులను ఈ నెల 13న జరిగే లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో రాజీ పరిష్కారాలు చేసుకునే విధంగా ప్రతి ఒక్కరు తన వంతు కృషి బాధ్యతగా తీసుకుని పనిచేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు, బ్యాంక్ అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## రోడ్లపై,బస్టాప్‌ల వద్ద ఆక్రమణలను తొలగించిన ట్రాఫిక్ పోలీసులు

### - భవానీ దీక్షల విరమణల నేపథ్యంలో గిరి ప్రదక్షిణ సమయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు

విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 8,ప్రభాతవార్త:సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిసిపి షిరీన్ బేగం సూచనల మేరకు వన్ ట్రాఫిక్ ఎసిపి రామచంద్రరావు అధ్వర్యంలో ఒన్ ట్రాఫిక్ సిఐ ఎ.ఉమామహేశ్వరరావు,ఆర్ఎస్ఐ శ్రీధర్ వారి సిబ్బందితో కలిసి టాక్టికల్ అర్బానిసం స్పెషల్ డ్రైవ్‌లలో భాగంగా ట్రాఫిక్‌కు,పాదచారులకు అంతరాయం కల్గిస్తున్న వివిధ రకాలైన దుకాణదారులు షాపుల ముందు రోడ్లపై పెట్టిన వస్తువులు తొలగించి వారికి గతంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ నెల 11 నుండి 15వ తేదీ వరకు విజయవాడ,శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఇంద్రకీలాద్రి దేవస్థానంలో భవానీ మాల దీక్ష విరమణ జరుగుతుందని,ఈ సమయంలో భవానీ దీక్ష విరమణ తతలమీద ఇరుముడితో అమ్మవారి కొండచుట్టు గిరి ప్రదక్షిణలు చేస్తారని, ఆ సమయంలో ట్రాఫిక్ డైవర్షన్ వివిధ జంక్షన్‌లలో ఉంటుందని ఆయా జంక్షన్లను దాటి ఆటోలు రాకూడదని, గిరి ప్రదక్షిణ చేసే భక్తులకు ఇబ్బంది కల్గకుండా ఆటోలను నిదానంగా తోలాలని, వివిధ దూర ప్రాంతాల నుంచి వచ్చే దీక్షా విరమణ భక్తుల నుండి అధజక మొత్తంలో డబ్బులు వసూలు చేయకూడదని,ఒకవేళ చేసిన ఎడల చర్యలు తీసుకుంటామని, ప్రతి సంవత్సరం చేసిన విధంగానే భవానీ దీక్షల విరమణ సమయంలో ఆయా డైవర్షన్ జంక్షన్ దాటి రాకుండా దీక్ష విరమణ భక్తులకు ఆటంకం కల్గించకుండా ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆటో నడిపేడప్పుడు యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని,ఆటో యొక్క కాగితాలు అన్ని ఫోర్సులో ఉంచుకోవాలని, ఉదయం బతుకుతెరువు కోసం ఆటో వేసుకొని రోడ్డు మీదకు వచ్చిన తర్వాత మీరు మళ్ళీ ఇంటికి వెళ్ళేంతవరకు మీ కోసం మీ కుటుంబ సభ్యులు,మీ పిల్లలు ఎదురుచూస్తున్నారనే ఆలోచన మరవకుండా జాగ్రత్తగా ఆటోలు నడిపి క్షేమంగా ఇంటికి చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరరావు మార్కెట్ ఏరియా సెక్టార్ ఎస్సై ఓంకార్,సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 82 ఫిర్యాదులు

విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 8,ప్రభాతవార్త:ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం 82 ఫిర్యాదులను సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డిసిపి ఎస్‌విడి ప్రసాద్,ఏడిసిపి ఎం.రాజారావులు స్వీకరించారు. భాధితులతో మాట్లాడటంతో పాటు దివ్యాంగులు,వృద్ధుల వద్దకు నేరుగా వెళ్ళి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకొని వాటిని త్వరగా పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సోమవారం అందిన ఫిర్యాదుల్లో భూవివాదాలు ఆస్థి వివాదాలు,నగదు లావాదేవీలకు సంబంధించి 46, భార్యాభర్తలు,కుటుంబ కలహాలకు సంబంధిచి-02,కొట్లాటలకు సంబంధించి-2,వివిధ మోసాలకు సంబంధించి-7,మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి 5,చోరీలకు సంబంధించి-2,రోడ్డు ప్రమాదాలకు సంబంధించి-01,ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు సంబంధించి -17 మొత్తం 82 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించడంలో సహకారాన్ని అందించారు.



## మహానటి సావిత్రి 90వ జయంతి వేడుకలు ఘంటసాల కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహణ

క్రోసూరు,డిసెంబర్ 8, ప్రభాతవార్త :క్రోసూరు, పల్నాడు జిల్లా:కళ్ళతోనే భావాన్ని పలికించగలిగిన అద్భుతమైన నటనా ప్రతిభ, చేతికి ఎముకలేని దానగుణం ఇవన్నీ కలిసి సావిత్రికి మాత్రమే సొంతం అని ఘంటసాల కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు శిఖా శాంసన్ అన్నారు.సోమవారం క్రోసూరు అమరావతి బస్టాండ్ లోని ప్రయాణికుల ప్రాంగణంలో ఘంటసాల కళా సమితి ఆధ్వర్యంలో మహానటి సావిత్రి 90వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సావిత్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా శాంసన్ మాట్లాడుతూ"16 అణాల తెలుగు నటిగా చిన్ననాటి నుంచే అగ్రతారగా వెలుగొందిన సావిత్రి, నటనలోనే కాదు, మనస్తత్వంలో కూడా ఆకాశమంత గొప్పదనం ఉన్న వ్యక్తి. దానధర్మాల విషయంలో ఆమె ఎముకలేని చేతిగా సినీ పరిశ్రమ ఇప్పటికీ గుర్తిస్తుంది" అని అన్నారు.అలాగే ఒక సందర్భంలో ప్రధానమంత్రి లాల్‌బహుదూర్ శా



## ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకోవడమే వందరోజుల కార్యక్రమం ఎమ్మెల్యే

పెదకూరపాడు: డిసెంబర్ 8 ప్రభాతవార్త :ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి కార్యకర్తను పరామర్శించి గ్రామ సమస్యలను తెలుసుకొని పరిష్కరించుకునేందుకే ఈ వంద రోజులు కార్యక్రమం చేపట్టామని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం లగడపాడు గ్రామంలో ఆయన పర్యటించారు. మండల శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామస్తుల సమస్యలను అర్జుల రూపంలో స్వీకరించారు. వంద రోజులు పూర్తయ్యలోపు గ్రామాల్లో ఉన్న సమస్యలు గుర్తించి సత్వరమే పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ధనలక్ష్మి త్రి, ఎంపీడీవో శ్రీ లీల, ఏవో కృష్ణయ్య, విద్యుత్ ఏఈ రామకృష్ణ, వట్టికూటి శివరామకృష్ణయ్య సచివాలయ సిబ్బంది గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.



## భుజం'పట్టిన మానవత్వం

అచ్చంపేట,డిసెంబర్ 8, ప్రభాతవార్త: అచ్చంపేట గ్రామస్తులైన పున్నా కోటేశ్వరరావుభార్య పున్నా పార్వతి (65) అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ పరిస్థితులు దయనీయంగా ఉండటంతో, అంత్యక్రియలు నిర్వహించడానికి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో,, వీరి పరిస్థితిని తెలుసుకున్న సామాజిక కార్యకర్త కమల్ సైదా, అచ్చంపేట ఆర్యవైశ్య సంఘం సభ్యులు గుండా రమేష్, ఏలూరి స్వామి, నూతికట్టు శంకర్ గుప్తా, ప్రజాశక్తి విలేఖరి గుంజి రవి, బ్యాటరీ జానీ, జ్యోతి కృష్ణ, మీరా కమల్ లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. కష్టాల్లో ఉన్న వారికి తోడుగా నిలిస్తేనే మానవత్వానికి అర్థం ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవాగుణాన్ని అలవర్చుకోవాలని స్థానికులు వీరిని ప్రశంసించారు. అందరూ ఇలాంటి భావనతో ముందుకు వస్తే సమాజంలో మానవత్వం మరింత బలోపేతం అవుతుందని ప్రజలు వ్యాఖ్యానించారు.



## అనధికారనిర్మాణ స్లాబ్ తొలగించిన అధికారులు

తెనాలి మున్సిపాలిటీ, ప్రభాతవార్త:పట్టణంలోని గంగానమ్మపేటలో, అనధికారికంగా నిర్మించిన భవన స్లాబ్ ని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం తొలగించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి సచివాలయ ఉద్యోగులు పోలీసు సిబ్బంది సహాయంతో భవనాన్ని పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా వేసిన అదనపు అంత స్లాబును తొలగింపు చేపట్టారు. దీంతో భవన యజమానులకు అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది అనేకసార్లు వారించినా వినకుండా స్లాబ్ వేశారని అధికారులు ఆరోపించారు. అదేవిధంగా పట్టణంలోని ముత్యంశెట్టి వారి పాలెంలోని ఆంధ్రరత్న రోడ్డులో అనధికార భవన నిర్మాణాన్ని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకున్నారు.ఇంటి యజమాని నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా స్లాబ్ వేసేందుకు అవసరమైన ఇనుమును ఏర్పాటు చేయగా, విషయం తెలుసుకున్న మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి తన సిబ్బందితో అక్కడకు వెళ్లి స్లాబ్ వేసేందుకు సిద్ధం చేసిన ఇనుమును తొలగించారు.గతంలో కూడా పలుమార్లు హెచ్చరించిన వినకుండా పెడచెవిన పెట్టి స్లాబ్ నిర్మాణానికి పూనుకున్నారని,అందుచేత ఇనుమును తలగింపు చేపట్టామని అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి తెలిపారు.



## రేషన్ పంపిణీలో పిర్యాదులు రాకుండా చూచుకోవాలి

### - తహశీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర,డిసెంబరు 8 ప్రభాతవార్త: రేషన్ పంపిణీ విషయంలో డీలర్లు పిర్యాదులు రాకుండా చూచుకోవాలని తహశీల్థార్ సిద్ధార్థ అన్నారు.సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో రేషన్‌షాపులను ఆయన తనిఖీ చేసారు.నిత్యవసర సరుకుల పంపిణీపై డీలర్లు తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ రేషన్ సరుకులు పంపిణీ విషయంలో డీలర్లు తగిన జాగ్రత్రగా ఉండాలన్నారు.బియ్యం..పంచదార వంటి నిత్యవపర సరుకులను రేషన్‌కార్డు దారులు డీలర్ల వద్దనే తీసుకోవాలన్నారు.రేషన్ పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరిగినా సంభందిత డీలర్లపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.తనిఖీలో ఆర్ఐ మురళీకృష్ణ,విఆర్ఓ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## సహోద్యోగి మృతికి,ఆర్థిక సహాయం అందించిన సచివాలయ ఉద్యోగులు:

తెనాలి టౌన్ డిసెంబర్8(ప్రభాతవార్త): తెనాలి పట్టణ పరిధిలోని,10వ వార్డు,నాజరుపేట1 సచివాలయంలో శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న చుక్క ధనరాజ్ గత నవంబర్ 20వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. ధనరాజ్ మృతి పట్ల తోటి ఉద్యోగులు పట్టణంలోని అన్ని సచివాలయాల వార్డ్ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు మరియు ఇతర అన్ని డిపార్ట్మెంట్స్ సచివాలయ సెక్రటరీలు సోమవారం ధనరాజ్ కుటుంబ సభ్యులను కలిసి రు28,200/ రూపాయలు చిరు ఆర్థికసహాయాన్ని,ధనరాజ్ సతీమణి ప్రత్యూష కి అందించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ,విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ధనరాజ్,చిన్న వయసులోనే అనారోగ్యంతో, అకాలమరణం చెందటం చాలా బాధాకరమని,ఆయన మృతి పట్ల తోటి ఉద్యోగులుగా సంతాపం తెలియజేస్తూ,వారి కుటుంబానికి ఎల్లవేళలా అన్ని విధాలుగా అండదండలుగా ఉంటామని భరోసా కల్పించారు.




## కొనసాగుతున్న వైసిపి కోటి సంతకాల సేకరణ:

తెనాలి మున్సిపాలిటీ డిసెంబర్8(ప్రభాతవార్త):వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకత్వం పిలుపుమేరకు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ,తెనాలి నియోజకవర్గం వైసీపీ ఆధ్వర్యంలో,వట్టణంలోని బోసురోడ్డులో సోమవారం, మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ కాలేజీ ల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.సంతకాల సేకరణకు ప్రజల నుండి వస్తున్న స్పందన చూస్తుంటే, ప్రజలకు కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని అర్థమవుతుందని, మధ్యతరగతి,పేదవారికి వైద్య విద్యను దూరంచేసే చర్య లను ఉపసంహరించుకునే దాకా, వైసిపి నిరంతరం పోరాటంచేస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ సీనియర్ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్,గోల్డ్ రహీమ, పెదలంక వెంకటేశ్వరరావు,పలువురు నాయకులు,పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



## 16నుంచి ధనుర్మాసోత్సవాలు

### - ధనుర్మాసం సందర్భంగా పలు ఆర్జితసేవలు అందుబాటులో

### - అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ

పొన్నూరు, డిసెంబర్ 8,ప్రభాతవార్త: అతిపురాతనమైన స్వయంభూ శ్రీ సాక్షి భావనారాయణస్వామి, కాశీవిశ్వేరస్వామివారి దేవాలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ తెలిపారు. 16వ తేదీ సాయంత్రం 6గంటలకు ధనుర్మాసోత్సవాల ప్రారంభ పూజా కార్యక్రమం జరుగుతుందన్నారు. జనవరి 15వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ధనుర్మాసం 30రోజుల పూజకు రూ.500లు చెల్లించి రశీదు పొందాలన్నారు. 30వ తేదీన వైకుంఠ ఏకాదశి(ముక్కోటి) ఉదయం 4గంటలకు ఉత్తర ద్వార దర్శనం, 10గంటలకు గరుడసేవ జరుగుతాయన్నారు. జనవరి మూడవ తేదీ సాయంత్రం 4.30గటలకు పరమపద ఉత్సవం జరుగుతుందన్నారు. అదేరోజు శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వారికి ఆరుద్రోత్సవం(శివముక్కోటి) జరుగుతుందన్నారు. శివముక్కోటి సందర్భంగా వేకువజామున 3గంటలకు స్వామివారికి విశేష అభిషేకాలు, 5గంటలకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. 14వ తేదీన రంగనాయకస్వామి, గోదాదేవి కళ్యాణోత్సవం జరుగుతుందన్నారు. 15న మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గోదాదేవి కళ్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.1116లు చెల్లించి కళ్యాణోత్సవంలో పాల్గొనాలని కార్యనిర్వహణాధికారి కామేశ్వరమ్మ కోరారు. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాల్లో పాల్గొని స్వామివారికి ఆశీస్సులు పొందాలని ఆమె కోరారు.



## అభివృద్ధి-సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయం

### - ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

చేబ్రోలు(పొన్నూరు), డిసెంబర్ 8,ప్రభాతవార్త: అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని శేకూరు గ్రామంలో రూ.67.80లక్షల నిధులతో నిర్మించిన పలు అభివృద్ధిపనులను సోమవారం ఆయన ప్రారంభించారు. మొదటి నుంచి అభివృద్ధి-సంక్షేమానికి మారుపేరు తెలుగుదేశం ప్రభుత్వ అన్న విషయాన్ని ఏ చిన్న పిల్లవాడిని అడిగినా చెప్పాడన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.16లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. అదేవిధంగా ఎంపిపిజిఎఫ్ నిధులు రూ.5.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు.15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.30లక్షలతో గ్రామ పంచాయితీ కార్యాలయంలో టాయిలెట్లు, ఎస్‌డబ్ల్యూపిసి షెడ్డును ఆయన ప్రారంభించారు. డిఎంఎఫ్ నిధులు రూ.40లక్షలతో నిర్మించే సీసీ రోడ్డలకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కళ్ళం శ్రీనివాసశర్మ, అధికారులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ వైద్యశాలను 50పడకలకు పెంపు పట్ల హర్షం వ్యక్తం

పొన్నూరు, డిసెంబర్ 8,ప్రభాతవార్త: నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిని 30పడకల నుంచి 50పడకలకు అప్‌గ్రేడ్ చేయించి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు టిడిపి ముస్లీం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక షాదీఖానాలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు



మాట్లాడారు. ప్రభుత్వ వైద్యశాలను 50పడకలకు పెంచి సుమారు రూ.5కోట్ల నిధులు మంజూరు చేయించిన నరేంద్రకుమార్ కృషిని పలువురు ముస్లీం నాయకులు కొనియాడారు. మొదటి నుండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత నాడు స్వర్గీయ ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి అయితే, నేడు ఆయన తనయుడు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కే దక్కుతుందన్నారు. అప్‌గ్రేడ్ చేయడం వల్ల వైద్యశాలకు వైద్యుల సంఖ్య పెరగడంతోపాటు ఓపి సేవలు కూడా రెట్టింపు అవుతానే ఆశాభావం వక్తం చేశారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో జరిగిన నిధుల అవినీతిపై కూడా దర్యాప్తు చేయాలని కోరారు. అప్‌గ్రేడ్ కావడం వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులకు భోజన వసతి సౌకర్యం కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. సమావేశంలో అంజుమన్ కమిటి అధ్యక్షుడు షేక్ మగ్బుల్‌బేగ్, నియోజకవర్గ మైనార్టీసెల్ అధికార ప్రతినిధి షేక్ బాజిసాహెబ్, నియోజకవర్గ మైనార్టీ నాయకుడు పఠాన్ పిరోజ్‌ఖాన్, నాయకులు షేక్ బాబ్జి, హుస్సేన్, రహంతుల్లా పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

చేబ్రోలు(పొన్నూరు), డిసెంబర్ 8,ప్రభాతవార్త: రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకే కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోందని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కోరారు. చేబ్రోలు మండల పరిధిలోని శేకూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలును పరిశీలించారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా గిట్టుబాటు ధరకు కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన 24గంటల్లో బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ అవుతుందన్నారు. రైతు సేవా కేంద్రాన్ని సందరి ్శంచిన నరేంద్రకుమార్ రైతుల వద్ద నుండి శాంపిల్స్‌ను ఏ విధంగా సేకరిస్తున్నారు..? బిల్లుల చెల్లింపు, నాణ్యతా ప్రమాణాలు గురించి రైతులను అడిగి తెలుసుకొన్నారు.ఎండబెట్టినధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులకు టార్పాలిన్ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## సబ్ కలెక్టర్,తహసీల్దార్ కార్యాలయాల్లో గ్రీవెన్స్:

తెనాలి టౌన్ డిసెంబర్8(ప్రభాతవార్త): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కి సబ్ కలెక్టర్ కార్యాలయానికి6అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఉదయం నుండి జరిగిన గ్రీవెన్స్ లో వివిధ విభాగాల అధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అలాగే తహసిల్దార్ కార్యాలయానికి మూడు అర్జీలు వచ్చినట్లు తాసిల్దార్ కెవి.గోపాలకృష్ణ తెలిపారు.వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, ఆయా విభాగాలకు పంపించి, త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో కమిషనర్ రామ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా ప్లానింగ్ మున్సిపల్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి పట్టణంలోని చెంచుపేట అమరావతి ప్లాట్స్ నందు మొక్కలు పెంచుటకు వేసిన ఫెన్సింగ్ ను తొలగించుట గురించి కాలనీవాసులు ఇచ్చిన అర్జీని సంబంధిత విభాగానికి పంపి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.



## సహకార బ్యాంకు ఎదుట జేఏసీ ధర్నా

తిరువూరు, డిశంబర్ 8, ప్రభాతవార్త :ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక జేఏసీ పిలుపుమేరకు పట్టణంలోని సహకార బ్యాంకు బ్రాంచ్ ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఉద్యోగులు ఐక్యంగా పాల్గొని తమ డిమాండ్లకు మద్దతుగా నిరసన తెలిపారు. జేఏసీ నాయకులు బొల్లినేని రఘురాం బ్రాంచ్ ఆర్గనైజర్ గద్య ప్రసాద్ సీఈఓలు నన్నపనేని రమణ కోలా సూర్య రావు వేముల కృష్ణా రావు రాణి పాల్గొన్నారు.



# అమెరికా, ఉక్రెయిన్ శాంతిచర్చలకు బ్రేక్!


## జెలెన్‌స్కీ ముందుకురావడం లేదంటూ ట్రంప్ వ్యాఖ్య



**ఫ్లోరిడా, డిసెంబరు 8:** ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా మధ్యవర్తిత్వంతో జరుగుతున్న శాంతి చర్చలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికను ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఇంకా చదవలేదని, చర్చలను ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన సిద్ధంగా లేరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫ్లోరిడాలో మూడు రోజుల పాటు అమెరికా, ఉక్రెయిన్ అధికారుల మధ్య చర్చలు ముగిసిన తర్వాత ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. కెన్నెడీ సెంటర్ ఆనర్స్‌కు హాజరయ్యే ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇంకా ప్రతిపాదనను చదవలేదని తెలిసి నేను కాస్త నిరాశ చెందాను. ఉక్రెయిన్ అధికారులు దీన్ని ఇష్టపడుతున్నారు. కానీ, ఆయన మాత్రం సిద్ధంగా లేరని అన్నారు. రష్యా ఈ ప్రతిపాదనకు అనుకూలంగానే ఉందని తాను భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ విషయంపై జెలెన్‌స్కీ స్పందించారు. చర్చల్లో పాల్గొన్న అమెరికా అధికారులతో తాను ఫోన్‌లో మాట్లాడానని, పూర్తి వివరాలు తెలుసుకున్నానని వెల్లడించారు. "శాంతిని సాధించడానికి అమెరికాతో కలిసి చిత్తశుద్ధితో పనిచేయడానికి ఉక్రెయిన్ కట్టుబడి ఉంది" అని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. అయితే, శాంతికి మార్గం చాలా సంక్లిష్టంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు ఈ ప్రతిపాదనను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అధికారికంగా ఆమోదించలేదు. గత వారం ఆయన మాట్లాడుతూ, ఈ ప్రణాళికలోని కొన్ని అంశాలు ఆచరణ సాధ్యం కావని అన్నారు. కానీ, అమెరికా కొత్త జాతీయ భద్రతా వ్యూహాన్ని క్రెమ్లిన్ స్వాగతించింది. చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి మొగ్గు చూపడాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపింది. ఈ రాజకీయ చర్చలు ఒకవైపు జరుగుతున్నప్పటికీ, ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మాత్రం ఆగలేదు. వారాంతంలో జరిగిన దాడుల్లో నలుగురు మృతి చెందారు. నిన్న ఒక్కరోజే ఖార్కివ్ ప్రాంతంలో జరిగిన షెల్లింగ్‌లో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది గాయపడ్డారు.

## ప్రియుడి నిర్లక్ష్యంవల్లనే పర్వతారోహకురాలు మృతి

### ఆస్ట్రియా పోలీసులు కేసు నమోదు



**వియన్నా, డిసెంబరు 8:** ఆస్ట్రియాలో అత్యంత ఎత్తైన గ్రాస్‌గ్లాక్నర్ పర్వతంపై జరిగిన ఒక విషాద ఘటనలో 33 ఏళ్ల కెర్‌స్టిన్ గర్ట్‌నర్ అనే మహిళ చలికి గడ్డకట్టి ప్రాణాలు కోల్పోయింది. ఆమె మృతికితీవ్ర నిర్లక్ష్యమే కారణమన్న ఆరోపణలపై ఆమె ప్రియుడు, అనుభవజ్ఞుడైన పర్వతారోహకుడు థామస్ ప్లాంబర్గర్ (39)పై అధికారులు హత్య కేసు నమోదు చేశారు. ఈ ఏడాది జనవరిలో కెర్‌స్టిన్, థామస్ ఇద్దరూ గ్రాస్‌గ్లాక్నర్ పర్వతాన్ని అధిరోహించడం ప్రారంభించారు. అనుకున్న సమయం కంటే రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరడంతో వారు తీవ్ర ప్రతికూల వాతావరణంలో చిక్కుకున్నారు. మైనస్ 20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, పెనుగాలుల ధాటికి కెర్‌స్టిన్ తీవ్రంగా అలసిపోయి, నీరసించిపోయింది. పర్వత శిఖరానికి కేవలం 150 అడుగుల దూరంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రాసిక్యూటర్ల కథనం ప్రకారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో థామస్ సహాయం కోసం వెళ్తున్నానని చెప్పి కెర్‌స్టిన్‌ను అక్కడే ఒంటరిగా వదిలి వెళ్లాడు. చలి నుంచి రక్షణ కల్పించేందుకు తన వద్ద ఉన్న ఎమర్జెన్సీ దుప్పట్లు లేదా ఇతర సామగ్రిని కూడా ఆమెకు ఇవ్వలేదని వారు ఆరోపించారు. సహాయక బృందాలకు సమాచారం ఇవ్వడంలో గంటల తరబడి ఆలస్యం చేయడమే కాకుండా, తొలి కాల్ తర్వాత తన ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టాడని తెలిపారు. తీవ్రమైన గాలుల కారణంగా సహాయక బృందాలు మరుసటి రోజు ఉదయానికి కానీ అక్కడికి చేరుకోలేకపోయాయి. అప్పటికే కెర్‌స్టిన్ మరణించింది. ఈ కేసులో థామస్‌పై తీవ్ర నిర్లక్ష్యంతో హత్యకు పాల్పడినట్లు అభియోగాలు మోపారు. నేరం రుజువైతే అతనికి మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అయితే, ఇది కేవలం ఒక దురదృష్టకర ప్రమాదమని అతని తరఫు న్యాయవాది వాదిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ 2026 ఫిబ్రవరి 19న జరగనుంది.

## ఎస్సీఎస్టీలకూ క్రీమీలేయర్ వర్తింపచేయడంపై కట్టుబడి ఉన్నా!

### చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్



**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు కూడా క్రీమీలేయర్ విధానాన్ని వర్తింపజేయాలని తాను ఇచ్చిన తీర్పుపై సొంత వర్గం నుంచే తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నానని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వెల్లడించారు. రిజర్వేషన్ల ఫలాలు నిజంగా వెనుకబడిన వర్గాలకు చేరాలన్నదే తన ఉద్దేశమని ఆయన తన వైఖరిని గట్టిగా సమర్థించుకున్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి కుమారుడికి, గ్రామ పంచాయతీ పాఠశాలలో చదివిన ఒక కూలీ కుమారుడికి ఒకే రకమైన కొలమానం వర్తింపజేయడం రాజ్యాంగం చెప్పిన సమానత్వం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. రిజర్వేషన్ ప్రయోజనాలు పొంది సుప్రీంకోర్టు జడ్జి అయ్యాక, ఇప్పుడు ఇతరులకు ఆ ఫలాలు అందకుండా చేస్తున్నానని తనపై ఆరోపణలు చేశారని గవాయ్ గుర్తు చేసుకున్నారు. ఈ విమర్శలు రాజ్యాంగ నిబంధనలపై అవగాహన లేమితో చేస్తున్నారని ఆయన అన్నారు.



# నెహ్రూ సేవలకు మరకలంటించలేరు

స్వాతంత్ర్యపోరాటంలో బిజెపి పూర్వీకులేంచేశారు?
నెహ్రూ పేరు లేకుండా ఏ చర్చయినా జరపగలరా?
ప్రధాని మోడీ వ్యాఖ్యలకు గౌరవ్ గగోయ్ కౌంటర్
వందేమాతరంపై చర్చ ప్రజల దృష్టి మరల్చేవ్యూహమే: ప్రియాంకగాంధీ
అంతా రాజకీయమేనా? ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్

**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా లోక్‌సభలో నిర్వహించిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ ఆవేశపూరితంగా మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. జాతీయ గీతంపై కాంగ్రెస్ పార్టీ 1937 నిర్ణయంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన విమర్శలకు ప్రతిస్పందిస్తూ, స్వాతంత్ర్య పోరాటానికి బిజెపి రాజకీయ పూర్వీకుల సహకారాన్ని గొగోయ్ ప్రశ్నించారు. "మీ రాజకీయ పూర్వీకులు వందేమాతరం ఉద్దేశాన్ని ఎప్పుడు నెరవేర్చారో నేను అడగాలనుకుంటున్నా? మీరు బ్రిటిష వారికి వ్యతిరేకంగా ఎప్పుడు తిరుగుబాటు చేశారు? బెంగాల్, రవీంద్రనాథ్ ఠాగూర్ సాంస్కృతిక వారసత్వాన్ని అర్థం చేసుకోవడంలో పాలక పార్టీ విఫలమైంది" అని తీవ్ర ఆరోపణలు చేశారు. అసోంలో డి-ఓటర్ సమస్యను ఎదుర్కొంటున్న బెంగాలీల దుస్థితిని ఎత్తి చూపారు. వందేమాతరం గీతానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చి జాతీయగీతం చేసిందని గౌరవ్ గొగోయ్ వివరించారు. చర్చ ఏదైనా జవహర్‌లాల్ నెహ్రూ పేరు వాడకుండా మోడీ ప్రసంగం ఉండటం లేదన్నారు. "వందేమాతరం గీతానికి కాంగ్రెస్ సపోర్ట్ చేసింది. ఎంతో ప్రాధాన్యతనిచ్చి జాతీయగీతం చేసింది. ప్రధాని ప్రతి డిబేట్‌లోనూ నెహ్రూ పేరు, కాంగ్రెస్ పేరు వాడుకుంటారు. ఆపరేష్ సింధూర్‌పై చర్చలో పండిట్ నెహ్రూ పేరును 14 సార్లు, కాంగ్రెస్ పేరు 50 సార్లు వాడారు. 75వ రాజ్యాంగ దినోత్సవంలో నెహ్రూ పేరు 15 సార్లు, కాంగ్రెస్ పేరు 26 సార్లు వాడారు. 2022లో రాష్ట్రపతి ప్రసంగం పై చర్చలో నెహ్రూ పేరు 20 సార్లు ఉపయోగించారు. మోడీకి, ఆయన టీమ్‌కు నేను ఒకటి చెప్పదలచుకున్నాను. మీరెంత కష్టపడినా సరే పండిట్ నెహ్రూజీ దేశానికి అందించిన సేవలపై ఎలాంటి మరక అంటదు" అని గౌరవ్ గొగోయ్ అన్నారు. ప్రజలు ఎన్నో కష్టాలు పడుతున్నారని, వాటి గురించి ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడరని, ఢిల్లీ పేలుళ్ల ప్రస్తావనే లేదని, ఢిల్లీ అయినా పహల్గాం అయినా ప్రజలను రక్షించే పరిస్థితిలో మనం లేమని గొగోయ్ విమర్శించారు. దేశవ్యాప్తంగా విమానాల రద్దుతో రోజుల తరబడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, దీనిపై పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ సభ ద్వారా ప్రజలకు పరిస్థితిని వివరించాలని కోరారు. ప్రయాణికుల్లో అనేక మంది డయాలసిస్ పేషెంట్లు ఉన్నారని, కొందరి ఇళ్లల్లో పెళ్లిళ్లు ఉన్నాయని, వృద్ధులైన బంధువులను చూసేందుకు వెళ్తున్న వారున్నారని, జనం డబ్బులు నష్టపోతున్నారని, విమానాశ్రయాల్లో ఎక్కడ చూసిన ఈ అలజడే కనిపిస్తోందని అన్నారు. వందే మాతరంపై చర్చను ప్రభుత్వం దృష్టి మరల్చే వ్యూహమని వయ నాడ్ కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ గీతం దేశ ఆత్మలో ఒక భాగ మని, దానిపై ఎటు వంటి చర్చ జరగద న్నారు. సోమవారం లోక్ సభలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ... బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కథనాన్ని ఏర్పాటు చేయడం, ప్రజల దృష్టిని మళ్లించడానికి స్వాతంత్ర్య సమరయోధులపై కొత్త ఆరోపణలు చేయడం అనే ద్వంద్వ ఉద్దేశ్యంతో అధికార పార్టీ ఈ అనవసరమైన చర్చను పిలిచిందని మండిపడ్డారు. "దేశం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్ల గురించి, పేపర్ లీకేజీ లు, నిరుద్యోగం కారణంగా యువత బాధపడు తు న్నారు. పేదలకు రిజర్వేషన్లు నిరాకరించ బడు తున్నాయి. మహిళలకు అన్యాయం జరుగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిపోతున్నది. ప్రభుత్వం వీటిపై చర్చించ కూడదని, గతం నుండి వచ్చిన పరిణామాలను తవ్వి ప్రజల దృష్టిని మళ్లించాలని కోరుకుంటున్నది" అని ప్రియాంక గాంధీ ఘాటుగా సమాధానమిచ్చారు. మాజీ ప్రధాని నెహ్రూపై ప్రధాని మోడీ చేసిన విమర్శలను ప్రియాంక గాంధీ తిప్పికొడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సుభాస్ చంద్రబోస్ వంటి జాతీయ నాయకులు పాటపై తీసుకున్న నిర్ణయాల గురించి ప్రధానమంత్రి కీలక విషయాలను పంచుకోలేదని, కథలోని ఒకవైపు మాత్రమే ప్రస్తావించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. వందేమాతరంలోని కొన్ని భాగాలను తొలగించాలనే డిమాండ్‌కు మతతత్వ మనస్తత్వం ఉందంటూ నెహ్రూ రాసిన లేఖను సభలో ప్రియాంక గాంధీ చదవి వినిపించారు. జాతీయ గీతం కాంగ్రెస్ రక్తంలోనే ఉందని, అది అలాగే ఉంటుందని, గత పరిణామాలకు సంబంధించిన వ్యర్థమైన చర్చలోకి లాగకూడదని సూచించారు. ప్రతిదీ స్వంతం చేసుకోవడానికి బిజెపి ప్రయత్నిస్తోందని, తమది ప్రత్యేకమైన జాతీయ వాదమని చెప్పుకుంటోందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపి అఖిలేష్ యాదవ్ ఆరోపణలు గుప్పించారు. ఇది నిజానికి జాతి వ్యతిరేకమని మండిపడ్డారు. వందేమాతరం జాతీయ గీతం ప్రతి భారతీయుడిదని, దానిని రాజకీయం చేయలేమన్నారు. అధికార బిజెపిని లక్ష్యంగా చేసుకుని యాదవ్ ఆరోపణలు గుప్పించారు. "మనదేశంలోని పాలక పార్టీ ప్రతిదీ సొంతం చేసుకోవాలనుకుంటోంది.

## చిన్నారుల్లో ఏకాగ్రతను దెబ్బతీస్తున్న సోషల్‌మీడియా!

### స్వీడన్ శాస్త్రవేత్తల పరిశోధనలో తేలిన నిజాలు



**స్టాక్‌హోమ్, డిసెంబరు 8:** ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై రోజుకు అరగంటకు మించి గడిపే పిల్లల్లో క్రమేపీ ఏకాగ్రత తగ్గుతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. దాదాపు 8,000 మందికి పైగా చిన్నారులపై నాలుగేళ్లపాటు నిర్వహించిన ఈ పరిశోధనలో ఆందోళనకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్వీడన్‌కు చెందిన కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్, అమెరికాలోని ఒరెగాన్ హెల్త్ సైన్స్ యూనివర్సిటీ పరిశోధకులు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో 9 నుంచి 14 సంవత్సరాల వయసున్న 8,324 మంది పిల్లల స్క్రీన్ అలవాట్లపై చేసిన సర్వేలో ఏకాగ్రత తగ్గుతున్నట్లు తేలింది. 9 ఏళ్ల వయసులో సగటున 30 నిమిషాలుగా ఉన్న సోషల్ మీడియా వాడకం, 13 ఏళ్లు వచ్చేసరికి రోజుకు 2.5 గంటలకు పెరిగింది. అనేక ప్లాట్‌ఫామ్‌లు 13 ఏళ్ల వయసును కనీస అర్హతగా నిర్దేశించినప్పటికీ, వాడకం అంతకంటే ముందే మొదలవుతున్నట్లు తేలింది. ఆసక్తికరంగా, టీవీ చూడటం లేదా వీడియో గేమ్‌లు ఆడటం వల్ల పిల్లల్లో ఏకాగ్రత లోపం కనిపించలేదని పరిశోధకులు స్పష్టం చేశారు. కేవలం సోషల్ మీడియా వాడకం మాత్రమే వారి ఏకాగ్రత సామర్థ్యాన్ని దెబ్బతీస్తున్నట్లు గుర్తించారు. ఈ పరిశోధన బృందానికి చెందిన ప్రొఫెసర్ టోర్కెల్ క్లింగ్‌బర్గ్ మాట్లాడుతూ.. "సోషల్ మీడియాలో నిరంతరం వచ్చే సందేశాలు, నోటిఫికేషన్లు పిల్లల దృష్టిని మరల్చుతాయి. ఏదైనా మెసేజ్ వచ్చిందేమోనన్న ఆలోచన కూడా వారి ఏకాగ్రతను దెబ్బతీస్తుంది. ఇదే ఈ సమస్యకు ప్రధాన కారణమని వివరించారు. పిల్లల సామాజిక, ఆర్థిక నేపథ్యం లేదా వారికి జన్యుపరంగా ఏడీహెచ్‌డీ లక్షణాలు ఉన్నాయాఅనే దానితో సంబంధం లేకుండా ఈ ప్రభావం కనిపిస్తోందని తెలిపారు. ఇప్పటికే ఏకాగ్రత లోపంతో బాధపడే పిల్లలు సోషల్ మీడియాను ఎక్కువగా వాడటం లేదని, సోషల్ మీడియా వాడకమే ఏకాగ్రత లోపానికి దారితీస్తోందని స్పష్టమైంది. వ్యక్తిగతంగా ఒక్కో చిన్నారిపై ఈ ప్రభావం తక్కువగా అనిపించినప్పటికీ, జనాభా స్థాయిలో చూస్తే ఇది సమాజంపై గణనీయమైన ప్రభావం చూపుతుందని పరిశోధకులు హెచ్చరించారు. ఈ అధ్యయన వివరాలు పీడియాట్రిక్స్ ఓపెన్ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## నటికిడ్నాప్, లైంగిక వేధింపుల కేసులో నటుడు దిలీప్‌కు రిలీఫ్

### నిర్దోషి అని తేల్చిన ఎర్నాకుళం కోర్టు



**ఎర్నాకుళం, డిసెంబరు 8:** మళయాళనటి కిడ్నాప్, ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన కేసు ఎనిమిదేళ్లక్రితం కేరళలో సంచలనం సృష్టించింది. ఏళ్లుగా సాగుతున్న విచారణ ఈకేసు ఇపుడు కీలక మలుపు తిరిగింది. నిందితుల్లో ఒకరైన ప్రమఖ నటుడు దిలీప్‌ను కేరళలోని ఎర్నాకుళం కోర్టు సోమవారం నిర్దోషిగా తేల్చింది. అత్యాచారం కుట్ర వంటినేరాలకింద ఆరుగురిని న్యాయస్థానం దోషులుగా తేల్చింది. మళయాళం, తమిళం తెలుగుచిత్రాల్లో నటించిన ప్రముఖ నటి 2017 ఫిబ్రరి 17న కిడ్నాప్‌కు గురయింది. ఆరోజు రాత్రి రెండు గంటలపాటు ఆమెను తన కారులోనే లైంగిక వేధింపులకు గురిచేసిన దుండగులు తర్వాత అక్కడినుంచి పారిపోయారు. కోచ్చిలో జరిగిన ఈ ఘటనలో పోలీసులు పదిమందిపై కేసునమోదుచేసారు. వారిలో దిలీప్‌కూడా ఒకరు. వారిపై కిడ్నాప్ లైంగిక వేధింపులు గ్యాంగ్‌రేప్, ఉద్దేశ్యపూర్వకంగా ఆధారాలు చెరిపివేయడం వంటి అభియోగాలకింద కేసులునమోదయ్యాయి. ఈ కేసులో 2017లో తొలిఛార్జిషీటు నమోదయింది. అదే ఏడాదిజులైలో దిలీప్ అరెస్టు అయ్యాడు. నాలుగునెలల తర్వాత బెయిల్‌పై వచ్చాడు. కేరళపోలీసులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారనిఆరోపించిన దిలీప్ సిబిఐ దర్యాప్తునకు డిమాండ్‌చేసారు. ఆ అభ్యర్థన తిరస్కరించింది. ఈకేసులో తనకు ఎలాంటిప్రమేయం లేదని చెపుతూ వచ్చిన దిలీప్ తాజాతీర్పుపై స్పందించాడు. ఇదినాపై జరిగిన కుట్ర అన్నారు.

# సంక్షిప్తంగా..

## భారత్‌తో యుఎస్ బలమైన బంధంతోనే చైనాపై ఆధిపత్యం



**వాషింగ్టన్, డిసెంబరు 8:** ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనాతో జరుగుతున్న వ్యూహాత్మక పోటీలో ఆధిపత్యం పొందేందుకు భారత్‌తో సంబంధాలు బలోపేతం చేసుకోవాలని అమెరికా వార్షిక డిఫెన్స్ పాలసీ బిల్లు పేర్కొంది. 'ది నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్-2026ను కాంగ్రెషనల్ నాయకులు ఆదివారం విడుదల చేశారు. దీనిలో అమెరికా రక్షణ మంత్రి భారత్‌తో డిఫెన్స్ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఇందుకోసం విదేశాంగ శాఖ మంత్రితో సమన్వయం చేసుకోవాలని వెల్లడించింది. అప్పుడే ఇండో-పసిఫిక్‌లో చైనాపై ఆధిపత్యం సాధ్యమవుతుందని వెల్లడించారు. ఇందుకు క్వాడ్ కూటమి వంటివి ఉపయోగపడతాయని వెల్లడించింది. అమెరికా విదేశాంగ మంత్రి యుఎస్-ఇండియా స్ట్రాటజిక్ సెక్యూరిటీ డైలాగ్ వంటి సంప్రదింపుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని సదరు బిల్లులో పేర్కొంది. ఇది భారత్-అమెరికా మధ్య 2008లో జరిగిన పౌర అణుఒప్పంద పురోగతిని సమీక్షించాలని సూచించింది. ఇక ఈ చట్టం అమల్లోకి వచ్చిన 180 రోజుల్లో అమెరికా విదేశాంగ మంత్రి సంయుక్త అంచనాలను నివేదిక రూపంలో ఇవ్వాలని సూచించింది.

## హరిద్వార్ శౌర్యయాత్రలో ఉద్రిక్తతలు



**హరిద్వార్, డిసెంబరు 8:** ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భజరంగ్ దళ్ నిర్వహించిన శౌర్య యాత్రపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లు రువ్వడంతో జ్వాలాపూర్ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. సమాచారం అందుకున్న పోలీసులు, ఉన్నతాధికారులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. భజరంగ్ దళ్ ఆదివారం సాయంత్రం హరిద్వార్‌లోని మూడు వేర్వేరు ప్రాంతాల నుంచి శౌర్య యాత్రను ప్రారంభించింది. ఈ యాత్ర జ్వాలాపూర్‌లోని రామ్ చౌక్ వద్దకు చేరుకోగానే కొందరు దుండగులు రాళ్లతో దాడి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన భజరంగ్ దళ్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఇంతలో కొందరు కార్యకర్తలు బుల్డోజర్‌తో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది.

## కర్ణాటక సిఎం సిద్ధరామయ్యకు సుప్రీం నోటీసులు



**బెంగళూరు, డిసెంబరు 8:** కర్ణాటక రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు అంశంపై చర్చ జరుగుతున్న వేళ, సీఎం సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరుణ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ కె. శంకర అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం సిద్ధరామయ్య అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారని, వరుణ అసెంబ్లీ నుంచి ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించాలని పిటిషనర్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆ అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించడంతో, ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లారు. తాజాగా, శంకర పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని సిద్ధరామయ్యకు జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది.

## థాయ్ - కంబోడియా సరిహద్దుల్లో మళ్లీ ఘర్షణలు : సైనికుని మృతి



**బ్యాంకాక్, డిసెంబరు 8:** థాయ్‌లాండ్-కంబోడియా సరిహద్దుల్లో మరోసారి ఘర్షణలు భగ్గుమన్నాయి. ఉబోన్ రాట్చథాని ప్రావిన్స్‌లో థాయ్ దళాలపై కంబోడియా కాల్పులు జరిపాయి. దీంతో థాయ్ సైన్యం వైమానిక దాడులకు దిగింది. కంబోడియా పోస్టులు, ఆయుధ డిపోలే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపించారు. ఈ క్రమంలో సరిహద్దుల్లో మరోసారి ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో ఓ థాయ్ సైనికుడు మృతి చెందినట్లు థాయ్ సైన్యం వెల్లడించింది. ఈ ఘర్షణలకు సంబంధించి ఇరు పక్షాలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. కంబోడియా సైన్యం తొలుత దాడులను మొదలు పెట్టినట్లు థాయ్ అధికారులు చెబుతుండగా..ఈ వాదనను కంబోడియా ఖండించింది. థాయ్ దళాలే తొలుత కాల్పులు జరిపినట్లు కంబోడియా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

# సిద్ధూ భార్యను మెంటల్ ఆసుపత్రిలో చేర్పించాలి!

## కర్ణాటక డిప్యూటి సిఎం డికెశివకుమార్



**బెంగళూరు, డిసెంబరు 8:** పంజాబ్ ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ ఉందని, రూ.500 కోట్లు చెల్లిస్తే ఎవరైనా ముఖ్యమంత్రి కావొచ్చని కాంగ్రెస్ నేత నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఐదారుగురు సీనియర్ నేతలు ఆ పదవిని ఆశిస్తున్నారని చెబుతూ సిద్ధూను వారు ఎదగనివ్వడం లేదని ఆరోపించారు. రూ.500 కోట్లు ఇచ్చే స్థోమత తమకు లేకపోవడంతో సిద్ధూకు సీఎం సీటు దక్కలేదని ఆమె చెప్పారు. ఈ వ్యాఖ్యలు అటు పంజాబ్ తో పాటు ఇటు కాంగ్రెస్ పార్టీలోనూ సంచలనంగా మారాయి. నవజ్యోత్ కౌర్ చేసిన ఆరోపణలపై బీజేపీ నేతలు స్పందిస్తూ పంజాబ్ సీఎం పోస్టుకే 500 కోట్లు ఉంటే కర్ణాటక సీఎం పోస్టుకు ఎంత చెల్లించాలో అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో నవజ్యోత్ కౌర్ ఆరోపణలు, బీజేపీ నేతల విమర్శలపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. సీఎం పోస్టుకు కోట్లు చెల్లించాలన్న వ్యాఖ్యలను ఖండిస్తూ అలాంటి ఆరోపణలు చేసిన వారిని వెంటనే మెంటల్ హాస్పిటల్ లో చేర్పించాలని అన్నారు. ఓ మంచి పిచ్చాసుపత్రి చూసి వారిని అందులో చేర్పించాలని, మంచి వైద్యం అందేలా చూడాలని డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. ఆమెను మంచి మానసిక ఆసుపత్రిలో చేర్చాల్సి అన్నారు. డీకే శివకుమార్ సోమవారం కర్ణాటక గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను కలిశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా అని ప్రశ్నించగా అందులో ఏమాత్రం నిజం లేదన్నారు. రూ.500 కోట్ల సూట్‌కేస్ ఇచ్చినవారు మాత్రమే సీఎం అవుతారనడంలో అర్థం లేదన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యల్లో నిజం లేదన్నారు.

# శ్రీకృష్ణుని పెళ్లాడిన యువతి! బరాత్, వైభవంగా వేడుక



**లక్నో, డిసెంబరు 8:** ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్‌కు చెందిన యువతి ఏకంగా శ్రీకృష్ణుడినే పెళ్లాడింది. అమితంగా ఆరాధించే యువతి, సాక్షాత్తూ ఆ శ్రీకృష్ణుడినే భర్తగా ప్రకటించుకుంది. గ్రామమంతా తరలివచ్చి ఈ పెళ్లి తంతును ఆసక్తిగా తిలకించడం విశేషం. బుడాన్ జిల్లాకు చెందిన 28 యేళ్ల మహిళ హిందూ సంప్రదాయ వేడుకలో కృష్ణుడి విగ్రహాన్ని వివాహం చేసుకోవడం విస్తృత చర్చకు దారితీసింది. పోస్టు గ్రాడ్యుయేట్ అయిన పింకీశర్మ కుటుంబం, బంధువులు, గ్రామ నివాసితుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా ఈ వివాహ తంతు ముగించారు. ఇస్లాంనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని బ్యోర్ కాశీమాబాద్ గ్రామంలో జరిగిన ఈ ప్రత్యేకమైన వేడుక పలువురి దృష్టిని ఆకర్షించింది. దైవిక వరుడితో సంప్రదాయ వివాహం ఈ సందర్భంగా పింకీ ఇంటిని అలంకరించారు. ఆమె సమీప బంధువు ఇంద్రేష్‌కుమార్ వరులి అలంకరించిన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని వివాహ మండపానికి తీసుకొని వచ్చారు. దాదాపు 125 మందితో ఊరేగింపుగా తరలివచ్చారు. పింకీ విగ్రహాన్ని తన చేతులతో ఎత్తుకొని ఆచారాల కోసం వేదికపైకి అడుగుపెట్టింది. ఆమె దేవుడితో దండలు మార్చుకుంది. తరువాత సిందూర వేడుక జరిగింది. వేడుకల్లో భాగంగా బృందావనం నుంచి వచ్చిన కళాకారులు భక్తి నృత్యాలు చేశారు. మొత్తం గ్రామమంతా వివాహ విందును సిద్ధం చేశారు. పింకీ ఏడు సంప్రదాయ వివాహ రౌండ్ల కోసం కృష్ణ విగ్రహాన్ని మోసుకెళ్లి పవిత్ర అగ్ని చుట్టూ ప్రదక్షిణ చేసింది. వీడ్కోలు వేడుక మరుసటి రోజు ఉదయం జరిగింది. ప్రస్తుతం ఆమె తన తల్లిదండ్రుల ఇంట్లో నివసిస్తోంది. దాదాపు నాలుగు నెలల క్రితం, ఆమె దైవిక జోక్యంగా భావించిన ఒక అనుభవాన్ని అనుభవించిందట. బాంకే బిహారీ ఆలయంలో ప్రసాదం స్వీకరిస్తున్నప్పుడు, ఒక బంగారు ఉంగరం ఆమె కండువాలో పడింది. దీంతో ఇది వరమని పింకీ నమ్మింది. అందుకే తానిక ఏ మానవుడిని వివాహం చేసుకోనని, కృష్ణుడిని మాత్రమే వివాహం చేసుకుంటానని నిర్ణయించుకుంది. ఇటీవల అనారోగ్యంగా ఉన్నప్పుడు బృందానం ద్వారా బరువైన కృష్ణ విగ్రహాన్ని మోసుకెళ్లి గోవర్ధన పరిక్రమను పూర్తిచేసిన తర్వాత కోలుకుంది. ఇది తన వివాహానికి మరొక సంకేతంగా భావించిదట. తన జీవితం దేవునికి అంకితమని పింకీ వెల్లడించింది. తన జీవితంలో విద్యతోపాటు, భక్తి, కృష్ణుడికి లొంగిపోవడంతోనే తనకు శాంతి అని తెలిపింది. కాగా ఇలా కృష్ణుడ్ని వివాహమాడిన ఘటనలు యుపిలో గతంలోనూ కూడ నమోదయ్యాయి.



ఎమ్మెల్యే మాధవి ప్రోటోకాల్ వివాదం

# ప్రివిలేజ్ కమిటీ గరంగరం

## - తప్పును అంగీకరించి కమిటీకి సూపరింటెండెంట్ క్షమాపణలు

విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి విషయంలో ప్రోటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యంపై పివిలేజ్ కమిటీ విచారించింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ప్రివిలేజ్ కమిటీ సోమవారం సమావేశమైంది. ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ పితాని సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి విషయంలో ప్రోటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యంపై కమిటీ విచారించింది. రిమ్స్‌లో క్యాథ్‌ల్యాబ్ ప్రారంభోత్సవ శిలా ఫలకంలో ఎమ్మెల్యే పేరు లేకపోవడంపై చర్చ జరిగింది. ఈ వ్యవహారానికి సంబంధించి అప్పటి మెడికల్ సూపరింటెండెంట్, డీఆర్వోను కమిటీ ప్రశ్నించింది. గత వాయిదాకు ఇరువురు హాజరుకాకపోవటంపై తీవ్రంగా మందలించింది. ప్రభుత్వం మారిందనే స్పృహ లేకుండా పనిచేస్తున్నారా? అని కమిటీ మండిపడింది. తీరు మారకుండా ఎమ్మెల్యేల పట్ల అగౌరవంగా ఉంటున్నారని కమిటీకి మాధవీ రెడ్డి ఫిర్యాదు చేశారు. జరిగిన తప్పును అంగీకరించి కమిటీకి నాటి సూపరింటెండెంట్ క్షమాపణలు చెప్పారు. తప్పు పునరావృతం కాకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే ఈ వ్యవహారంపై పొంతన లేని సమాధానాలు చెప్పిన నాటి డీఆర్వోపై కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోసారి విచారణకు రావాలని ఇరువురునీ ఆదేశించింది. అలాగే 2019- 24 మధ్య ఎమ్మెల్యేగా తనకు జరిగిన ప్రోటోకాల్ ఉల్లంఘనలపై జోగేశ్వరరావు ఇచ్చిన ఐదు ఫిర్యాదులపైనా కమిటీ చర్చించింది. ఐదు ఫిర్యాదులపై నాటి అసెంబ్లీ సిబ్బంది నోటీసులు కూడా పంపకపోవటంపై కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. నాటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి తలొగ్గే ప్రోటోకాల్ పాటించలేకపోయామని అధికారులు వివరణ ఇచ్చారు. కమిటీని క్షమాపణలు కోరి, తప్పు పునరావృతం కాకుండా చూసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

# రోడ్డెక్కిన 'కలువాయి సేవ్'

**• రోజురోజుకు ఉధృతమౌతున్న నిరసనలు • దాచూరు గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానం • నేడు ఎమ్మెల్యేను కలవనున్న జెఏసి నేతలు**




కలువాయి (నెల్లూరు), డిసెంబరు 8 ప్రభాతవార్త: "కలువాయి సేవ్" తిరుపతి మాకొద్దు- నెల్లూరు జిల్లానే ముద్దు అనే నినాదంతో జెఏసి ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఈకార్యక్రమాలకు నిరసన కారులు పెద్దఎత్తున చేరుకొని నిరసనలు తెలియజేస్తు న్నారు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్ నందు అన్ని వర్గాల వారు నల్ల బ్యాడ్జిలు దరించి బైటాయించి నిరసన తెలిపారు. అదే విధంగా ప్రధాన రోడ్లుపై చేరుకొని ఒంటి కాలితో నిరసన తెలుపుతు నినదించారు. కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలన్న నినాదంతో బస్టాండ్ కూడలి హోరెత్తింది. ఈ సందర్భంగా నిరసన కారులు మాట్లాడుతు ప్రజాభిప్రాయం లేకుండా విభజన ఎలా చేస్తారని వారు ప్రశ్నించారు. వీరితోపాటు మండలంలోని వికలాంగులు యూనియన్ సభ్యులు సేవ్ కలువాయి నినాదంతో బైఠాయించారు. మండలంలోని దాచూరు,పర్లకొండ, చీపినాపి, కేశమనేనిపల్లి గ్రామాలతోపాటు పలు పంచాయితీల సర్పంచ్‌లు ఏకగ్రీవ తీర్మానంతో నెల్లూరు జిల్లాలోనే కలువాయి మండలాన్ని కొనసాగించాలంటూ తీర్మానం చేస్తూ గ్రామాలలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### దాచూరు సర్పంచ్ ఏకగ్రీవ తీర్మానం

ఈ సందర్భంగా దాచూరు సర్పంచ్ రాజుల అనురాధ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లా నుండి తిరుపతి జిల్లాకు మార్చలనుకోవడం దారుణమని ఆమె ఖండించారు. ఆత్మకూరు రెవిన్యూ డివిజన్ నుండి గూడూరు రెవిన్యూకి డివిజన్‌కు కలువాయిని మారుస్తూ గెజిట్ నోటిపికేషన్ విడుదల చేయడం పట్ల ప్రజలు ఆందోళనకు గురౌతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అన్ని విధాలా తీవ్ర నష్టాన్ని గురిచేసే ఈ విభజన కార్యక్రమాన్ని ప్రభుత్వం స్పందించి విరమించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణను నేడు కలువాయి జెఏసి నాయకుల ఆద్వర్యంలో అన్ని వర్గాల వారు కలిసి కలువాయి సేవ్ నినాదాన్ని ఆయనకు తెలియజేయనున్నట్లు వారు తెలిపారు.




బిసిఎస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

# బాలచైతన్య స్ఫూర్తి క్రీడోత్సవాలు షురూ!

జగ్గయ్యపేట, డిసెంబరు 8 ప్రభాతవార్త: క్రీడలపట్ల ఆసక్తి, యువతకు నైతిక విలువలు తెలియజెప్పే కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించటం, ఆత్మస్థైర్యంలో వృద్ధిలోకి తీసుకురావాలనే తపనతో ఈ ఎమ్మెల్యే సొంత ఖర్చుతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బాలలతో మూడు రోజుల క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సొంత ఖర్చుతో 14వ సంవత్సరం కూడా చేపట్టిన బాలచైతన్య స్ఫూర్తి (బిసిఎస్) క్రీడోత్సవాలు సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూలు క్రీడా మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థలలకు చెందిన వేలాదిమంది బాలలు ఈక్రీడోత్సవాల్లో తమ ప్రతిభను చాటుతున్నారు. స్పోర్ట్స్ కమిటి కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పిఇటీలు తమ టీమ్స్‌ను ఈస్పోర్ట్స్ మీట్‌లో ప్రవేశపెట్టారు. తొలుత ఎమ్మెల్యే తాతయ్య జ్యోతి ప్రజ్వలనచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా బాలల్లో పోరాటపటిమ పెరుగుతుందన్నారు. నవ్యాంధ్ర నిర్మాణం కోసం సమాజంలోని అందరికి కలుపుకుపోతూ సమగ్ర వ్యక్తిత్వ వికాసంతో బాలలు ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. బాలల్లో క్రీడా నైపుణ్యం-స్ఫూర్తిని పెంపొందించటం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగించటం, నైతిక విలువలను ఆచరింపజేయటం లక్ష్యంగా శ్రీగురుధామ్ వ్యవస్థాపకులు, ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ ప్రేరణతో తాను 2008 నుండి బాలచైతన్యస్ఫూర్తితో (బిసిఎస్) కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈక్రీడోత్సవాలను నిర్వహించేందుకు ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల ప్రతినిధులు అందిస్తున్న తోడ్పాటు మరువలేనిదన్నారు. ప్రముఖ తాత్వికులు గెంటేల వెంకటరమణ బాలచైతన్య స్ఫూర్తి (బిసిఎస్) స్పోర్ట్స్ మీట్ ఏర్పాటుచేయటంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) చేస్తున్న కృషి అభినందిస్తూ శుభ సందేశం పంపారు. సభలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు, ఉభయ తెలుగు రాష్ట్రాల సీనియర్ న్యాయవాది గెంటేల అశోక చక్రవర్తి, గోపాలకృష్ణ సొసైటీ అధ్యక్షులు దూళిపాళ లక్ష్మణరావు, నేతలు యలమంచిలి రాఘవేంద్రరావు (రాఘవ), కట్టా వెంకటనరసింహారావు, కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, కానూరి కిషోర్, ఎంఇఓ చిట్టిబాబు, హెచ్‌ఎం పి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ పాత్రికేయుడు అన్నాప్రగడ శివరామకృష్ణ ప్రసాద్ మృతి



విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: సుప్రసిద్ధ రచయిత, సీనియర్ పాత్రికేయుడు అన్నాప్రగడ శివరామకృష్ణ ప్రసాద్ (ఏఎస్ఆర్ ప్రసాద్) మృతి చెందారు. ఆర్ఎస్ఎస్ క్రియాశీలక కార్యకర్త, బిజెపి కృష్ణా జిల్లా శాఖ వ్యవస్థాపక సంస్థాగత కార్యదర్శిగా వ్యవహరించిన ఏఎస్ఆర్ ప్రసాద్(72) గత రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత మరణించారు. వృత్తిరీత్యా ఆడిటర్ అయిన ఏఎస్ఆర్ ప్రసాద్ గుంటూరు జిల్లా ప్రాంతం నుంచి వచ్చి ఎన్టీఆర్ జిల్లా నందిగామలో స్థిరపడ్డారు. అనంతర కాలంలో హైదారాబాద్‌కు మకాం మార్చారు. జాగృతి, జనసందేశ్ పత్రికల్లో ఆయనది క్రియాశీలక బాధ్యత. ఇప్పటికి బిజెపి అధికార పత్రిక జనసందేశ్‌కు కార్యనిర్వాహక సంపాదకునిగా ఉన్నారు. దగ్గరదగ్గర 30 దశాబ్దాలు ఆయన ఒక దినపత్రికలో విలేకరిగాను పనిచేసారు. సుప్రసిద్ద చలనచిత్ర సంగీత దర్శకుడు, గాయకుడు మాధవపెద్ది రమేష్‌కు ప్రసాద్ వియ్యంకుడు. ఆయన పెద్ద కుమారుడు చలనచిత్ర రంగంలో కీబోర్డు ఆపరేటర్‌గా మంచి గుర్తింపు పొందారు, ద్వితీయ కుమారుడు చిత్రకారునిగా గుర్తింపు పొందారు ప్రసాద్‌కు కుమార్తె ఉంది. ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రచారగీతాలెన్నో రాసిన ప్రసాద్, దివంగత చలనచిత్ర గీత రచయిత విశ్వమోహినికి కావ్యానికి రాసిన పీఠిక గత శతాబ్దం 90వ దశకంలో సంచలనాత్మకమైంది. హోమియో వైద్యం చేయడంలో దిట్టయిన ప్రసాద్ మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు.

# విగ్రహాల ఏర్పాటుపై బందరులో ఉద్రిక్తత

## - పోటాపోటీగా టిడిపి, బిజెపి శ్రేణుల ఆందోళన



విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో టిడిపి, బిజెపి వర్గాల మధ్య తమ నాయకులు విగ్రహాల విషయంలో వివాదం తలెత్తింది. ఎన్టీఆర్, వాజ్ పేయి పేర్ల వివాదం తలెత్తింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలో ఉంది. ఇందులో టిడిపి, బిజెపి భాగస్వాములుగా ఉన్నాయి. అయితే పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ కు వాజ్ పేయి పేరు పెట్టాలని బిజెపీ నిర్ణయించింది. దీనిపై టిడిపి నేతలు మండిపడుతున్నారు. ఈ ప్రయత్నాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారు నిరసనకు దిగారు. మచిలీపట్నంలోని న్యూహౌసింగ్ బోర్డు వద్ద దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి విగ్రహ నిర్మాణానికి తాజాగా స్థానిక బిజెపి నేతలు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా వారు అక్కడే ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ లో ఆ విగ్రహం తీసేసి వాజ్ పేయ్ విగ్రహం తయారు చేయించి పెట్టాలని భావించారు. ఇందుకోసం వాజ్ పేయ్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపనకు ప్లాన్ చేశారు. దీన్ని చివరి నిమిషంలో టిడిపి నేతలు అడ్డుకున్నారు. రాష్ట్రంలో అధికార టిడిపి, కేంద్రంలో అధికార బిజెపి మధ్య ఇలా విగ్రహాల విషయంలో వివాదం చోటు చేసుకోవడం ఇదే తొలిసారి. కూటమిలో భాగస్వాములుగా ఉన్న ఇరు పార్టీల మధ్య రాష్ట్రంలో గతంలో ఎక్కడా ఇలాంటి వివాదం చోటు చేసుకోలేదు. కేవలం పార్టీలు, నేతల మధ్య వివాదాలు కాస్తా ఇప్పుడు విగ్రహాల వరకూ రావడంతో బందరులో ఏం జరుగుతుందని ఇరు పార్టీల సీనియర్ నాయకులు తెలుసుకుంటున్నారు.



హుండీ లెక్కింపులు పర్యవేక్షిస్తున్న ఇఓ, ఛైర్మన్లు

# దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.5 కోట్లు

## - నూతన లడ్డూపోటు ప్రారంభం
## - భవానీ దీక్షల ఏర్పాట్లు పరిశీలించిన ఆర్‌డిఓ

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 8 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్ధి సందర్భంగా శ్రీ గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం వద్ద వున్న పాత యాగశాలలో గణేశునికి అభిషేకాది పూజాదికాలు నిర్వహించారు. ఇఓ, ఛైర్మన్‌లు పాల్గొన్నారు. దుర్గమ్మ వారి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా 26 రోజుల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రు.5,22,18.647ల నగదు, 415 గ్రాముల బంగారం, 7కెజిల 465గ్రాముల వెండితో పాటు యుఎస్ఏ డాలర్లు 489, సింగపూర్ డాలర్లు 109, కెనడా డాలర్లు 125, యుఎఇ దిర్హమ్స్ 860, సౌదీ రియాల్స్ 125, మలేషియా రింగెట్స్ 4, ఖతార్ రియాల్స్ 3, ఆస్ట్రేలియా డాలర్లు 105, ఇంగ్లాండ్ పౌండ్లు 10, స్టెర్లింగ్ పౌండ్లు 10, మాల్దీవులు రుపియా 20, బహ్రెయిన్ దినార్ 1, యూరప్ యూరోలు 20 లభించాయని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. లెక్కింపు లను ఇఓ, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి వారు పర్యవేక్షించారు.

### నూతన లడ్డూపోటు ప్రారంభం



సంకటహర చతుర్ధి పూజల్లో గణేశునికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీ దుర్గమ్మ వారి ఆలయంలో సోమవారం నూతన లడ్డూపోటు ను ఇఓ వికె శీనా నాయక్ లాంఛనంగా ప్రారంభించారు. ఆలయ స్థానాచార్యులు వి. శివప్రసాద్, అర్చక బృందం వేద మంత్ర పఠనాల నడుమ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఈఓ కొబ్బరికాయ కొట్టి పోటును ప్రారంభించారు. అనంతరం శీనా నాయక్ మాట్లాడుతూ భవానీ దీక్షలకు తరలివచ్చే భక్తులకు రుచికరమైన శ్రీ అమ్మవారి లడ్డూ ప్రసాదం అందించడానికి ఈ పోటు సిద్ధం చేశామన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1,00,023ల విరాళాన్ని విశాకపట్నంకు చెందిన కె వరప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి అందించారు.

### ముమ్మరంగా భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లు

దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 11 నుండి 15 వరకు జరగబోయే శ్రీ భవానీ దీక్షల విరమణలకోసం త్వరితంగా ఏర్పాట్లను ఆర్‌డిఓ కావూరి చైతన్య, ఏడిసిపి రామకృష్ణతో కలిసి పరిశీలించారు. సోమవారం ఇఓ వికె శీనా నాయక్‌తో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన లడ్డూ ప్రసాదం పోటును, అన్నదాన కేంద్రం, హోమగుండాలు, కేశఖండనశాల తదితర ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ భక్తులకు నిరంతరం అన్నప్రసాదం అందించాలన్నారు. పరిశుభ్రతపై శ్రద్ద వహించాలన్నారు. ఏర్పాట్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆటో క్యాడ్ ద్వారా అదికారులు ఆయనకు వివరించగా పలు సూచనలు చేశారు.

# కాణిపాకంలో వేదపాఠశాల ఏర్పాటు

**• రూ.2.50 కోట్లతో ఆలయ పుష్కరిణి పునర్నిర్మాణం • భక్తులకు అందుబాటులోకి నూతన వంద గదులు • పాలక మండలి సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం**



కాణిపాకం, డిసెంబరు 8 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో నిత్య పారాయణంలో భాగంగా వేద పాఠశాలను ఏర్పాటు చేయాలని పాలకమండలి ఏకగ్రీవంగా తీర్మానించింది. కాణిపాకం దేవస్థానం నూతన పాలకమండలి తొలి సమావేశం సోమవారం స్థానిక ఈవో కార్యాలయ సమావేశ మందిరంలో పాలకమండలి ఛైర్మన్ మణి నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవస్థానం విధివిధానాలు ఆలయంలో పూజా విధానాలు, సాంప్రదాయాలు, మాస్టర్ ప్లాన్ అమలు తదితర అంశాలపై పాలకమండలిలో సుదీర్ఘంగా చర్చించారు. పాలకమండలిలో తీసుకున్న నిర్ణయాలను ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పాలకమండలి ఛైర్మన్ మణి నాయుడు, ఈవో పెంచల కిషోర్‌లతో కలిసి విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భవిష్యత్తులో సుమారు 60, 70 ఏళ్ళ వరకు బహుళ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ఆలయం ముందు భాగంలోని స్వామివారి పుష్కరిణిని సుమారు 70 అడుగుల వరకు ముందుకు జరిపి పునర్నిర్మించాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. అలాగే దేవస్థానంలో అతిథి గృహాలు,సామూహిక కళ్యాణ మండపాల నిర్మాణం కోసం 20 కోట్ల రూపాయలను ఆర్థిక సాయం అందించిన టిటిడి ఛైర్మన్, ఈవోలకు ధన్యవాదాలు తెలియజేస్తూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. అలాగే ఆలయ ప్రాశిస్త్యాన్ని, హిందూ ధర్మాన్ని ప్రచారం చేసేందుకు వీలుగా పాత ప్రచార రథం స్థానంలో నూతన ప్రచార రథం వాహనాన్ని సుమారు 13 లక్షల రూపాయలతో కొనుగోలు చేయాలని తీర్మానం చేసినట్లు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. దేవస్థానం పరిపాలన సౌలభ్యంలో భాగంగా సుమారు ఐదు లక్షల రూపాయలతో అవసరమైన నూతన కంప్యూటర్లను కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన వంద గదుల సత్రాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని పాలకమండలి తీర్మాంచినట్లు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. అలాగే పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ఉభయదారుల అంగీకారంతో దేవస్థానంలో అమలు జరుగుతున్న పలు రకాల ఆర్జిత సేవా కార్యక్రమాల్లో మార్పులు చేర్పులపై చర్యలు తీసుకోవాలని కూడా సమావేశం తీర్మానించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం పూర్తయిన వంద గదులను 10 లక్షల రూపాయలు చెల్లించే దాతల పేరున మార్చాలని కూడా సమావేశంలో తీర్మానించినట్లు ఎమ్మెల్యే మురళి తెలిపారు. ముఖ్యంగా ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులకు సకల సౌకర్యాలతో స్వామివారి సంతృప్తికర దర్శనం కలి ్పంచాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఛైర్మన్ మణినాయడు, ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈవో సాగర్ బాబు, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు ధనంజయ, ప్రసాద్, రవీంద్రబాబు, ధనపాల్, హరి మాధవరెడ్డిలతోపాటు బోర్డు సభ్యులు కత్తి సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ బివి.నరేష్, చంద్రకళ, కెఎస్.అనుసూయమ్మ, సంధ్యారాణి, సునీత, కొత్తపల్లె శివప్రసాద్, టివి.రాజ్యలక్ష్మీ, ఊట్ల నాగరాజు నాయుడు, శ్రీపతి సతీష్, పెరుమాళ్ సుబ్రమణ్యంరెడ్డి, చల్లా కృష్ణవేణి, పద్మలత, వసంత, వి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిత్య కల్యాణం మృత్యుంజయ అభిషేకాలు

## భక్తులతో ఆలయం కళకళ

శ్రీకాళహస్తి, డిసెంబరు 8 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిట లాడింది. ఆలయంలో సోమవారం శివయ్యకు ప్రీతి పాత్రమైన రోజు కాబట్టి దూర ప్రాంతాలు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఆలయంలో నిత్యకళ్యాణం పచ్చ తోరణంలా పూజలు అభిషేకాలు నిర్వహించబ డుతుంది. ఓ వైపు స్వామి అమ్మవార్లకు అభిషేకాలతో పాటు రాహుకేతు దోష నివారణ పూజలు, శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు, ఇక స్వామి అమ్మవార్లకు నిత్యకళ్యాణం, మృత్యుం జయస్వామికి అభిషేకాలతో పునీతమౌతుంది. ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు సోమవారం సుమారు పాతికవేల మంది స్వామి అమ్మవార్లను దర్శించుకోగా రాహుకాల సమయంలో సుమారు 5వేల మంది భక్తులు పూజలు జరిపించుకున్నట్లు సమాచారం. సోమవారం ఆలయంలోని స్వామి అమ్మవార్ల నిత్యకల్యాణోత్సవానికి విశేష స్పందన వచ్చింది. గణపతి పూజలు, నవగ్రహ పూజలు, యజ్ఞోపవేత పూజలు, మాంగల్య ధారణ కార్యక్రమూలు నిర్వహించారు.

### మృత్యుంజయునికి షోడశాభిషేకాలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. స్వామికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల సుగంధ పరిమళపుష్పాలు, గజమాలలు, వెండి నాగాభరణలతో శోభాయ మానంగా అలంకరించి ధూప, దీపనైవేద్యాలను మహా మంగళ హారతులిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## నేలపాడులో సిఆర్‌డిఏ అడిషనల్ కమిషనర్ పర్యటన

విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: రైతుల సమస్యలు, సూచనలు తీసుకునే క్రమంలో రాజధాని అమరావతి పరిధిలోని నేలపాడులో సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఏ.భార్గవ తేజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.ఎస్.భాగ్యరేఖ పర్యటించారు. సోమవారం వారు ఈ గ్రామంలో పలు అంశాలను పరిశీలించారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్, మున్సిపల్ శాఖా పి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. త్రిసభ్య కమిటీ రైతుల సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామకంఠాల సమస్యను నెలరోజుల్లో పరిష్కరిస్తామని చెప్పింది. నేపథ్యంలో అధికారులు గ్రామకంఠాలను పరిశీలించారు. గ్రామకంఠాల సమస్యల గురించి రైతులు, స్థానికులు అడిషనల్ కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకుని వెళ్ళారు.

## సావిత్రి బాయిపూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: సావిత్రి భాయిపూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయుల టీచర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె ప్రకాష్‌రావు, ఎంజి మెహిది ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోనే తొలిసారిగా 1848లో బాలికల పాఠశాలను సావిత్రిభాయి ప్రారంభించారని తెలిపారు. ఆమె జయంతి జనవరి 3వ తేదిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించిందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆమె జయంతిని జరపడంతో పాటు మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిని కోరారు.

# పంట వ్యర్థాలను కాల్చకుండా, పొలాల్లోనే కలియదున్నటం మేలు

## వ్యవసాయ సంచాలకులు మనజీర్ జిలాని సమూన్



సచివాలయం, డిసెంబర్ 8 ప్రభాత వార్త: పంట వ్యర్థాలను కాల్చకుండా, పొలాల్లోనే కలియదున్నటం మేలని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ వరిపంటలో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, ఇప్పటికే కోతలు పూర్తయిన చోట కొందరు రైతులు రబీ పంట సాగు కోసం వరి కొయ్యలను, దుబ్బలను కాల్చే పనుల్లో నిమగ్నమై ఉన్నారని, దీనివల్ల వచ్చే పొగతో పర్యావరణానికి నష్టం కాలుష్యం పెరగటమే కాకుండా పంట పొలాలకు అంతకు మించి నష్టంజరుగుతుందని శాస్త్రవేత్తలు తెలియజేశాయరన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక సూచన మేరకు గ్రామస్థాయి సచివాలయ రైతు సేవా కేంద్రం సిబ్బందిచే రైతులకు పంట వ్యర్థాలను తగుల పెట్టవద్దు భూసారానికి, పర్యావరణానికి హాని తలపెట్టవద్దనే అంశంతో అవగాహన పెంచేలా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. కాల్చడం వల్ల నేలకు పర్యావరణానికి పౌరసమాజానికి కలిగే నష్టాలను తెలియజేస్తూ... పోషకాలు నశిస్తాయని, భూమిలోని సేంద్రీయ కర్బనం తగ్గుతుంది. సూక్ష్మ జీవులు నశిస్తాయి, తేమను నిలుపుకునే శక్తి తగ్గుతుంది. నేలల్లో ఆమ్ల గుణం పెరుగుతుంది. పర్యావరణ కాలుష్యం పెరిగి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. వీటికి భిన్నంగా వ్యర్థాలను నేలలోనే కలియబెట్టడం వల్ల కలిగే లాభాలను తెలియజేస్తూ పైరు ఎదుగుదలకు దోహదపడే అన్ని రకాల పోషకాలు భూమిలో కలిసి భూసారం పెరుగుతుందని, నేలలోని కార్బన్ శాతం పెరిగి తదుపరి పంటల దిగుబడులు పెరుగుతాయని తెలిపారు.

# పిహెచ్‌సి స్థాయిలోనే స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షలు

● 9 మరణాలు అనుమానిత కేసులు మాత్రమే ● లోతైన పరీక్షల కోసం జీనోమ్ స్వీకెన్సీ చేయిస్తాం ● ప్రభావిత ప్రాంతాలకు ఆర్‌ఆర్ టీములు పంపుతున్నాం

● రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ స్పష్టీకరణ



విజయవాడ, డిసెంబరు 8 ప్రభాతవార్త ప్రతినిధి: స్క్రబ్ టైఫస్ జ్వరాల నిర్ధారణ పరీక్షల నమూనాలను జ్వర పీడితుల్లో అవసరమైన వారి నుంచి పీహెచ్ సీల స్థాయిలోనూ సేకరిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు. స్క్రబ్ టైఫస్ జ్వరాలు సాధారణమైన వాటిల్లో ఒకటని తెలిపారు. స్క్రబ్ టైఫస్ వల్లే మరణాలు జరిగినట్లు ఇప్పటివరకు నిర్ధారణ జరగలేదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 1,566 స్క్రబ్ టైఫస్ జ్వరాల కేసులు (పాజిటివ్) నమోదైనట్లు తెలిపారు. ఈ జ్వరం వచ్చి మరణించిన వారిలో తొమ్మిది మంది ఉన్నా, ఇవి దేనివల్ల జరిగాయన్న దానిపై పరిశోధన జరగాల్సి ఉందని వెల్లడించారు. ఇందుకు కనీసం రెండు నెలల నుంచి మూడు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉందని సూత్రప్రాయంగా తెలిపారు. బాధితుల నుంచి సేకరించిన నమూనాలను జీనోమ్ స్వీకెన్సీ (గుంటూరు, తిరుపతి) ద్వారా పరీక్ష చేయించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కంటే రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు తక్కువగా ఉన్నాయన్నారు. పరీక్షలు విస్తృతంగా చేస్తున్నందువల్లే ఇవి ఎక్కువగా బయటపడుతున్నాయని చెప్పారు. గత మూడేళ్లలో నమోదైన కేసులు పరిశీలించినప్పుడు ఈ సారి అసాధారణ పరిస్థితులు కనిపించలేదన్నారు. అధికారికంగా మరణాలు జరగలేదని తెలిపారు.

### ఆర్.ఆర్.టీంల ద్వారా లోతైన పరిశీలన!

మంగళగిరిలోని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వైద్య నిపుణులు, ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కమిషనర్ వీరపాండియన్ మాట్లాడారు. బోధనాసుపత్రుల్లో ఉండే ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్‌ఆర్)లు అధిక కేసులు లేదా అసాధారణ మరణాలు సంభవించినచోట పరిశోధన (ఎపిడెమీయలాజికల్ ఇన్వెస్టిగేషన్) చేస్తాయని తెలిపారు. ఈ క్రమంలోనే స్క్రబ్ టైఫస్ బారినపడిన వారి కేసుల వివరాలు, నివాస పరిసరాల ప్రాంతాలను సైతం ఆర్‌ఆర్టీ టీమ్లు పరిశీలించి ప్రభుత్వానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియచేయనున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఆర్ ఆర్ టీంలు ఉన్నాయని తెలిపారు. అన్ని బోధనాసుత్రుల్లో స్క్రబ్ టైఫస్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామన్నారు. వీటితోపాటు హిందూపురం, టెక్కలి, పాడేరు, తెనాలి జిల్లా ఆసుపత్రుల్లోనూ ఈ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. దిగువ స్థాయి ఆసుపత్రుల నుంచి వచ్చే నమూనాలను ఈ ల్యాబ్‌లో పరీక్షిస్తున్నారని తెలిపారు. అధిక కేసులు నమోదైన ప్రాంతాలను గుర్తించి వ్యవసాయ, పంచాయతీరాజ్, ఇతర శాఖలతో కలిపి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

### శరీర భాగంపై నల్లటి మచ్చ కనిపించి... జ్వరం వస్తే జాగ్రత్తపడాలి"

కీటకం కుట్టిన శరీర భాగంపై నల్లటి మచ్చ దద్దురుతో వస్తుంది. ఈ మచ్చ స్క్రబ్ టైఫస్ సంకేతం. దీనికి అనుగుణంగా వైద్యులు రోగుల ఇతర అనారోగ్య వివరాలు పరిగణనలోకి తీసుకుని వైద్యం అందిస్తారు. అవసరమైన రక్త నమూనాలు సేకరించి, పరీక్షలు కూడా చేయిస్తారు.

### కర్ణాటక, తమిళనాడుల్లో కేసులు అత్యధికం!

కర్ణాటకలో 2024లో 1,689, తమిళనాడులో 6,925, తెలంగాణాలో 195 రాగా ఏపీలో 1,613 కేసులు వచ్చాయి. 2025లో ఇప్పటివరకు కర్ణాటకలో 1,870, తమిళనాడులో 7,308, తెలంగాణాలో 309, ఏపీలో ఇప్పటివరకు 1,566 చొప్పున కేసులు వచ్చాయని కమీషనర్ వీరపాండియన్ వివరించారు.

ముఖ్యంగా ఎలీశా పరీక్ష చేయించి, స్క్రబ్ టైఫస్‌అవగాహనకు వస్తారు. గుంటూరు జీజీహెచ్‌లో గడిచిన 38 రోజుల్లో 26 స్క్రబ్ టైఫస్ కేసులు వచ్చాయి. ఇందులో ముగ్గురు ఐసీయూలో ఉన్నారు. ఇతర దీర్ఘకాల వ్యాధులు ఉండి, చనిపోయిన వారిలో న్యూరాలజికల్ సమస్యలు కూడా కనిపించాయి. ఇక్కడికి రాకముందు. సరైన వైద్యాన్ని పొంద కుండా విషమించిన పరిస్థితుల్లో రావడం, ఉన్నత చికిత్సకు శరీరం సహకరించక ప్రాణాలు విడుస్తున్నారు. దీర్ఘకాల వ్యాధులు లేనివారు వెంటనే నాలుగైదురోజుల్లో కోలుకున్నారని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వీ వెల్లడించారు. "మా వద్దకు ఎన్టీఆర్, బాపట్ల, కృష్ణా, ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి కేసులు వచ్చాయి. పల్నాడు, బాపట్ల జిల్లాలకు ఆర్‌ఆర్ టీంలు పంపాం. రొటీన్‌గా రోగులకు ఇచ్చే డాక్సిసైక్లిన్, అజిత్రోమైసిన్ మాత్రలతో స్క్రబ్ టైఫస్ బాధితులు పూర్తిగా కోలుకుంటున్నారు బాధితుల నుంచి సేకరించిన రక్త నమూనాల్లో స్క్రబ్ టైఫస్‌వచ్చిందా? లేదా అన్న దాని గురించి ఎలిశా టెస్టు ద్వారా 24 గంటల్లో తెలిసిపోతుందని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి, అదనపు సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, జాయింటు డైరెక్టర్ మల్లీశ్వరి వెల్లడించారు. ఇన్ఫెక్షియస్ డీసీజెస్ వైద్య నిపుణులు డాక్టర్ కల్యాణచక్రవర్తి మాట్లాడుతూ మరణాలు స్క్రబ్ టైఫస్ ద్వారానే జరిగినట్లు నిర్ధారించాలంటే సదరు వ్యక్తుల నుంచి సేకరించిన రక్త నమూనాలను జీనోమ్ స్వీకెన్సీ ద్వారానే నిర్ధారించాల్సి ఉందన్నారు. భవిష్యత్తు అవసరాలకు ఇది చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత సమాచారంతో 9 మరణాలు స్క్రబ్ టైఫస్ ద్వారా జరిగిందని చెప్పలేమన్నారు. విలేకర్ల సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ప్రజలన్నా, దేవుడు అన్నా జగన్‌కు భయం లేదు

### తిరుమలలో మాఫియా రాజ్యం నడిపారని మంత్రి రామానాయుడు ఆరోపణలు

పాలకొల్లు, డిసెంబరు 8 ప్రభాతవార్త: పవిత్ర తిరుమలలో మాఫియా రాజ్యం నడిపిన వ్యక్తి జగన్ అని రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆరోపించారు. పాలకొల్లులో మీడియాతో మాట్లాడుతూ పరకామణిలో చోరీని చిన్న దొంగతనమని జగన్ మాట్లాడటం భక్తుల నమ్మకాన్ని అవమానించడమేనన్నారు. పరకామణిలో 75 వేలు చిన్నపాటి చోరీకే శిక్ష వేస్తారా అని జగన్ ప్రశ్నిస్తున్నాడని, దేవుడు హుండీ సొమ్ము చిన్నదవుతుందా అని మంత్రి ప్రశ్నించారు. పరకామణిలో చిన్న చోరీ అనడం గజదొంగ, ఇంకో దొంగను సపోర్టు చేసినట్టుగా ఉందన్నారు. దేవుడు హుండీ దొంగతనాన్ని కూడా జగన్ సమర్ధించడం సిగుచేటన్నారు. 16చార్జిషీట్లలో ఎ1గా ఉన్న వ్యక్తి, రాష్ట్రంలో స్వేచ్ఛగా తిరుగుతుంటే 75 వేలు చోరీ చిన్నదిగా కనిపిస్తుంది కాబోలన్నారు. జగన్‌కు ప్రజలన్నా, దేవుడు అన్నా భయం లేదన్నారు. దొంగ చేతికి అధికారం ఇస్తే ఏమవుతుందో జగన్ పాలనే నిదర్శనమన్నారు. జగన్‌కు ప్రజల మీద కన్నా, నేరగాళ్ళు, దోపిడీదారులు, బెట్టింగ్ మాఫియా, లిక్కర్ మాఫియా మీదే ప్రేమ ఎక్కువన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా, ప్రజలు తీర్పిచ్చినా జగన్ వైఖరిలో మార్పు కనిపించడం లేదన్నారు. వైసీపీ బ్రతుకంతా అబద్ధాలు, అసత్య లేనన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని ఇరవై ముప్పై ఏళ్ల వెనక్కి తీసుకెళ్లి రాష్ట్రాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేశాడన్నారు.

## ఢిల్లీ విమానాశ్రయంలో రూ.4.8 కోట్ల విదేశీ గంజాయి జప్తు

హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త: ఢిల్లీలో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం రాత్రి బ్యాంకాక్ నుంచి ఢిల్లీ వచ్చిన ఒక ప్రయాణీకుడి వద్ద నుంచి 4.08 కిలోల విదేశీ గంజాయిని కస్టమ్స్ అధికారులు జప్తు చేశారు. సదరు ప్రయాణీకుడి లగేజిని తనిఖీ చేస్తుండగా ఒక బ్యాగుపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులకు దానిని స్కానింగ్ చేయగా విదేశీ గంజాయి ప్యాకెట్లు చక్కగా ప్యాక్ చేసి వుండడం కనిపించింది. చిన్నపాటి సంచుల్లో దీనిని ప్యాక్ చేసి వుండగా పట్టుకున్నారు. దీని విలువ 4.8 కోట్ల రూపాయలుగా కస్టమ్స్ అధికారులు తెలిపారు. పట్టు బడ్డ ప్రయాణీకుడు భారత్‌కు చెందిన వాడుగా తేలింది. అతనిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించారు. దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలలో విదేశీ గంజాయి పట్టుబడడం ఇటీవల కాలంలో ఎక్కువయ్యింది. శంషాబాద్, ముంబాయి, బెంగళూరు, చెన్నై అంత ర్జాతీయ విమానాశ్రయాలలో పదుల కిలోల విదేశీ గంజాయి పట్టుబడగా పదుల సంఖ్యలో స్మగ్లర్లు అరెస్టయ్యారు. ఇందులో కొందరు విదేశీయులు కూడా ఉన్నారు.

## సికింద్రాబాద్‌లో యువతి హత్య

### పెళ్లికి నిరాకరించిందని కత్తితో పొడిచి చంపిన బావ





పవిత్ర (ఫైల్)

హైదరాబాద్ (సికిందరాబాద్), డిసెంబరు 8, ప్రభాతవార్త: పెళ్లికి నిరాకరి స్తుందన్న కోపంతో ఓ యువకుడు.. యువతిని తల్లి ముందే దారుణంగా కత్తితో పొడిచి చంపాడు. ఈ సంఘటన వారాసిగూడ పోలీస స్టేషన్ పరిధి లోని బాపూజీనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటర్ మీడియట్ పూర్తిచేసిన పవిత్ర (19) ఇంట్లోనే ఉంటోంది. వరుసకు బావ అయిన రహమత్‌నగర్‌లో నివాసం ఉండే ఉమాశంకర్(25) టైల్స్ పని చేసేవాడు. కాగా తరచుగా బాపూజీనగర్‌లోని పవిత్ర ఇంటికి వచ్చి ఆమె తనను వివాహం చేసుకోవాలని ఒత్తిడి తెచ్చాడు. అతని ప్రవర్తన నచ్చని కారణంగా పెళ్లి చేయడానికి పవిత్రకు, ఆమె తల్లితండ్రులకు ఇష్టం లేదు. సోమవారం కూడా పవిత్ర తల్లిముందే తనను వివాహం చేసుకోవాలని ఒత్తిడి తెచ్చాడు. అంగీకరించకపోవడంతో తనవెంట తెచ్చుకున్న కత్తితో పవిత్ర మెడపైన తీవ్రంగా పొడిచి హత్యచేసి పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.




## నెల్లూరు జిల్లాలో విభజనను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ముట్టడి

నెల్లూరు కలెక్టరేట్, డిసెంబరు 8 ప్రభాతవార్త: సోమవారం నెల్లూరు జిల్లాలో విభజనను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో నెల్లూరు నుండి మండలాల విభజనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు జవాబు చెప్పాలని బిజెపి నేత మిడతల రమేష్ డిమాండ్ చేశారు. కండలేరు జలాశయం విభజన మూలంగా జలవివాదాలు నెలకొంటాయి. కరువు సమయంలో నెల్లూరు జిల్లాలో పొదలకూరు మనుబోలు ఆయ కట్టుదారులు నీటి సమస్యను ఎదుర్కొంటారు.

తిరుపతి నెల్లూరు అధికారుల మధ్య జలవివాదాలు ఏర్పడతాయని రమేష్ తెలిపారు. కండలేరు ముంపు నిరుద్యోగుల ఉద్యోగాల సమస్య జటిలమవుతుందని కలవాయి నుండి నెల్లూరు 60 కిలోమీటర్లు తిరుపతికి 140 కిలో మీటర్లు దూరంలో ఉన్నందున ప్రజలు ప్రయాణ భారాన్ని ఎదుర్కొంటారని వివరించారు. 1882 బ్రిటిష్ కాలం నుండి రాపూర్ అటవీ క్షేత్రం కలువాయి మండలాలు ఒకే డివిజన్లో ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన ఎర్రచందనం నెల్లూరు జిల్లా రాపూర్‌లో మాత్రమే ఉన్నందున ప్రపంచంలోనే నెల్లూరుకు గుర్తింపు ఉందని మిడతల రమేష్ వివరించారు. 44 లక్షల సంవత్సరాల నుండి పెనుశీల లక్ష్మీనరసింహస్వామి ఆలయం నెల్లూరు జిల్లాలోనే ఉందని. వీటిని దూరం చేసుకునేందుకు నెల్లూరు జిల్లా ప్రజల సిద్ధంగా లేరని పేర్కొన్నారు. ఎందుకు విభజన చేస్తున్నారో ఎవరి కోసం చేస్తున్నారో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెల్లూరు ప్రజలకు జవాబు చెప్పాలని రమేష్ డిమాండ్ చేశారు. చేనేత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బుధవరపు బాలాజీ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ప్రజలకు అన్యాయం జరుగుతుంటే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారు అని ప్రశ్నించారు. ఇద్దరు ముగ్గురు వ్యక్తుల కోసం నెల్లూరు నుండి రాపూరు కలువయి సైదాపురం వేరు చేయడం బ్రిటిష్ పాలన కంటే దుర్మార్గంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు కందికట్ల రాజేశ్వరి, బైరి శ్రీనివాస్, నరాల సుబ్బారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులు సమాధి శ్రీనివాసులు, సోమ అనురాధ, బీసీవై పార్టీ నేతలు హజరత్ యాదవ్, సోమ గోపాల్, మనోహర్ హింద్, ఆనందు, నరేష్, చింత గింజల సుబ్రమణ్యం, పూల ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలివుడ్ దర్శకుడు విక్రమ్‌భట్ దంపతుల అరెస్టు



జైపూర్, డిసెంబరు 8: ప్రముఖ బాలీవుడ్ ఫిల్మ్‌మేకర్ విక్రమ్ భట్, ఆయన భార్య శ్వేతాంబరి భట్‌ను రాజస్థాన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు రూ. 30 కోట్ల మోసం కేసుకు సంబంధించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఉదయ్‌పూర్‌కు చెందిన ఇందిరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యజమాని డాక్టర్ అజయ్ ముర్దియా చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. విక్రమ్ భట్ దంపతులను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్రాన్సిట్ రిమాండ్ పొందిన తర్వాత వారిని ఉదయ్‌పూర్‌కు తరలించారు. ఈ కేసులో ఆరుగురు నిందితులకు పోలీసులు గతంలోనే నోటీసులు జారీ చేసారు. డాక్టర్ అజయ్ ముర్దియా దివంగత భార్య జీవితంపై బయోపిక్ తీస్తామని విక్రమ్ భట్, ఆయన బృందం నమ్మించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా రూ. 200 కోట్ల లాభాలు వస్తాయని చెప్పి, తన నుంచి రూ. 30 కోట్లు తీసుకుని మోసం చేశారని అజయ్ ముర్దియా ఆరోపించారు. ఈ మేరకు ఉదయ్ పూర్‌లోని భూపాల్‌పురా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై విక్రమ్ భట్ స్పందించారు. మీడి యాతో మాట్లాడుతూ, తనపై నమోదైన ఎఫ్ఐఆర్ తప్పుదారి పట్టించేలా ఉందని, అందులోని ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. పోలీసులను నమ్మించడానికి నకిలీ పత్రాలు సృష్టించి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. విరాట్ అనే సినిమాను డాక్టర్ అజయ్ ముర్దియానే మధ్యలో ఆపేశారని, టెక్నీషియన్లకు ఇంకా రూ.250 కోట్లు చెల్లించాల్సి ఉందని విక్రమ్ ఆరోపించారు. ఆ బకాయిలు ఎగ్గొట్టేందుకే ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేయించారని ఆయన అన్నారు. తాను విచారణకు పూర్తిగా సహకరిస్తానని, తన వద్ద ఉన్న అన్ని ఆధారాలను పోలీసులకు చూపిస్తానని, అప్పుడు నిజానిజాలు బయట పడతాయని విక్రమ్ భట్ తెలిపారు

## తెలంగాణలో అనూహ్యంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

### 12 జిల్లాల్లో సింగిల్ డిజిట్‌కు దిగజారిన వైనం

**హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణలో చలి తీవ్రత మరింత పెరిగింది. ఒక్కరోజులోనే అనూహ్యంగా పలు జిల్లాలలో నాలుగు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. 12 జిల్లాలలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవడంతో పాటు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డిలో అత్యల్పంగా 7.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా వికారాబాద్‌లో 7.8, ఆదిలాబాద్ లో 7.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జోగుళాంబ గద్వాల్ జిల్లాలోనే అత్యధికంగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. వచ్చే వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోయే అవకాశం వుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో చలి పులి వణికిస్తోంది. శనివారంతో పోలిస్తే ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం 12 జిల్లాలలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి చలిగాలుల తీవ్రత పెరగడంతో పాటు హిమాలయాల నుంచి శీతలగాలుల ప్రభావం కారణంగా తెలంగాణలో చలి తీవ్రత పెరిగిందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. చలి తీవ్రత పెరగడం వల్ల చాలాచోట్ల ప్రజలు చలి మంటలను ఆశ్రయించాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో చలి ప్రభావం ఎక్కువగా వుంది. ఇదే సమయంలో పొగమంచు రహదారులను కమ్మేస్తుండడంతో వాహనదారులు రహదారులపై వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రాత్రి ఆయా జిల్లాలలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు ఇలావున్నాయి. సంగారెడ్డిలలో శని వారం రాత్రి 11.1 డిగ్రీలుగా వున్న ఉష్ణోగ్రత ఆదివారం రాత్రి ఒక్కసారిగా 3.9 డిగ్రీలు తగ్గి 7.2 డిగ్రీలకు పడిపోయింది. వికారాబాద్‌లో శనివారం రాత్రి 11.8 డిగ్రీల ఉష్ణోగ్రత వుండగా ఆదివారం రాత్రి నాలుగు డిగ్రీలు తగ్గి 7.8 డిగ్రీలకు పడిపోయింది. ఆదిలాబాద్‌లో శనివారం రాత్రి ఎనిమిది డిగ్రీల ఉష్ణోగ్రత వుండగా ఆదివారం రాత్రి 7.9 డిగ్రీలుగా వుంది. కామారెడ్డిలో శనివారం రాత్రి 11.2 డిగ్రీల ఉష్ణోగ్రత వుండగా ఆదివారం రాత్రి మూడు డిగ్రీలు తగ్గి 8.2 డిగ్రీలుగా వుంది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 9.1 డిగ్రీల నుంచి 8.2 డిగ్రీలకు, మెదక్‌లో 11.5 డిగ్రీల నుంచి 8.5 డిగ్రీలకు, నిజామాబాద్‌లో 11.3 నుంచి 8.4 డిగ్రీలకు, రంగారెడ్డి జిల్లాలో 12.2 డిగ్రీల నుంచి 8.4 డిగ్రీలకు, సిద్దిపేటలో 11.3 డిగ్రీల నుంచి 8.9 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. నిర్మల్‌లో 10.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీలకు, సిరిసిల్లాలో 10.9 డిగ్రీల నుంచి 9.2 డిగ్రీలకు, జగిత్యాలలో 11.4 డిగ్రీల నుంచి 9.9 డిగ్రీలకు, పెద్దపల్లిలో 11.8 డిగ్రీల నుంచి 10.1 డిగ్రీలకు, మేడ్చల్ 12.9 డిగ్రీల నుంచి 10.2 డి గ్రీలకు, భూపాల పల్లిలో 12.1 డిగ్రీల నుంచి 10.3 డిగ్రీలకు, భువనగిరిలో 13.2 డిగ్రీల నుంచి 10.4 డిగ్రీలకు, మంచిర్యాలలో 11.4 డిగ్రీల నుంచి 10.4 డిగ్రీలకు, కరీంనగర్ 12.2 డిగ్రీల నుంచి 10.4 డిగ్రీలకు, ములుగులో 12 డిగ్రీల నుంచి 10.5 డిగ్రీలకు, జనగాంలో 12.4 డిగ్రీల నుంచి 10.7 డిగ్రీలకు, హనుమకొండలో 12.1 డిగ్రీల నుంచి 11.2 డిగ్రీలకు, మహబూబ్‌నగర్‌లో 15.2 డిగ్రీల నుంచి 11.4 డిగ్రీలకు, వరంగల్‌లో 12.5 డిగ్రీల నుంచి 11.7 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి.నారాయణ్‌పేట్‌లో 14.3 డిగ్రీల నుంచి 11.8 డిగ్రీలకు, మహబూబాబాద్‌లో 13.1 డిగ్రీల నుంచి 11.8 డిగ్రీలుగా నమోదైంది.

## 'ఫీనిక్స్' పక్షి స్ఫూర్తితోనే 'తెలంగాణ రైజింగ్'కు శ్రీకారం




### ప్రతి అడుగు, ఆలోచన భావితరాల కోసమే..

### ఫ్యూచర్ సిటీలో ఏఐ యూనివర్సిటీ

### గ్లోబల్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగం

హైదరాబాద్, డిసెంబరు 8, ప్రభాతవార్త: 'ఫీనిక్స్' పక్షిస్ఫూర్తితోనే 'తెలంగాణ రైజింగ్'కు శ్రీకారం చుడతామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా దార్శనికతతో కూడిన అడుగులు వేస్తామన్నారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2047 ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా... దానిని మనం నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మేం వేసే ప్రతి అడుగు... చేసే ఆలోచన భావితరాల ఆశయాలు, అవసరాలకు అనుగుణంగా 'రేపటి తెలంగాణ' కోసమేనని వివరించారు.

'ఫీనిక్స్' పక్షి స్ఫూర్తితో ఇన్నోవేషన్, హ్యూమన్ క్యాపిటల్, సస్టైనబులిటీ, గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ డెస్టినేషన్‌గా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతోనే "తెలంగాణ రైజింగ్"కు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న ఎకనామిక్ రీ అలైన్‌మెంట్స్, టెక్నలాజికల్ డిస్రప్షన్, క్లైమేట్ అన్‌సెర్టైనిటీ లాంటి సవాళ్లను అవకాశాలుగా మార్చుకొని 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేందుకు దార్శనికతతో కూడిన అడుగులు వేస్తున్నామన్నారు.

ఈ ప్రయాణంలో తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో తమ ప్రభుత్వం వేసిన తొలి అడుగు "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025" అన్నారు. భౌగోళిక విస్తీర్ణం, జనాభాలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ చిన్నదే అయినప్పటికీ దేశ జీడీపీలో మాత్రం 5 శాతం వాటాను కలిగి ఉందన్నారు. 2024-25లో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధి రేటు 10.1 శాతం కాగా, జాతీయ సగటు 9.9 శాతంగా నమోదు అయ్యిందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.79 లక్షలు, జాతీయ సగటు కంటే 1.8 రెట్లు ఎక్కువ అని వివరించారు.

రాష్ట్ర ఇండస్ట్రియల్, మాన్యుఫ్యాక్చరింగ్ ఎకానమీ వృద్ధి రేటు 7.6 శాతం కాగా, జాతీయ సగటు 6.6 శాతం మాత్రమే అన్నారు. రాష్ట్ర సేవల రంగం వృద్ధి రేటు 11.9 శాతంగా కాగా, అదే జాతీయ సగటు 10.7 శాతంగా ఉందన్నారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ జీఎస్ వీఏ 12.6 శాతం వృద్ధి రేటుతో రూ.2.46 లక్షల కోట్ల నుంచి రూ.2.77 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. మాన్యుఫ్యాక్చరింగ్, కన్ స్ట్రక్షన్, మైనింగ్, క్వారీయింగ్, ఎలెక్ట్రిసిటీ, గ్యాస్, వాటర్, ఇతర యుటిలిటీస్ లాంటి ఇండస్ట్రియల్ సబ్ సెక్టార్లలోనూ తెలంగాణ వృద్ధి రేటు జాతీయ సగటు కంటే ఎక్కువగా నమోదు కావడం తమ ప్రభుత్వ పనితీరుకు నిలువెత్తు నిదర్శనమన్నారు. దేశంలోనే తొలి ఏఐ పవర్డ్ విలేజ్‌గా మారిన మంథని నియోజకవర్గంలోని ఒక మారుమూల గ్రామం "రేపటి తెలంగాణ"కు మార్గదర్శిగా నిలిచిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

భారత్ ఫ్యూచర్ సిటీ, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్, ఏఐ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్డ్ ఐటీఐలు, ఏఐ ఆధారిత అకడమిక్ కరిక్యులం, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, లైఫ్ సైన్సెస్ హబ్ "వన్ బయో", సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఇన్ క్వాంటం టెక్నాలజీ లాంటి విప్లవాత్మక అడుగులు ప్రపంచపటంలో "తెలంగాణ"ను ప్రత్యేకంగా నిలుపుతాయన్నారు. రేపటి కోసం, భవిష్యత్ తరాలకు భరోసాగా తెలంగాణతో కలిసి భవిష్యత్తును నిర్మించేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, నిపుణులకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు.

9-12pg10exT 12 VJA_9-12pg10exT.qxd 08/Dec/25 11:29 PM Page 1



## సూపర్ కప్ ఛాంపియన్‌గా గోవా



**న్యూఢిల్లీ:** ఎఐఎఫ్ఎఫ్ సూపర్ కప్ ఛాంపియన్‌గా గోవా ఫుట్‌బాల్ జట్టు నిలిచింది. పెనాల్టీ షూటౌట్‌లో ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సిని 6-5 తేడాతో ఓడించి, ఎఫ్‌సి గోవా రికార్డు స్థాయిలో మూడోసారి ఎఐఎఫ్ఎఫ్ సూపర్ కప్ ఛాంపియన్‌గా అవతరించింది. రెండు జట్లు గోల్ చేయడంలో విఫలమవడంతో పెనాల్టీ షూటౌట్‌కు వెళ్లింది. సూపర్ కప్ ఫైనల్‌లో ఇలా జరగడం ఇదే మొదటిసారి. గోవా కెప్టెన్ బోర్జా హెర్రెరా, మొహమ్మద్ బాసిమ్ రషీద్ రెగ్యులేషన్ పెనాల్టీలలో తమ స్పాట్‌కిక్‌లను మిస్ చేసుకున్నారు. కెవిన్ సిబిల్లె, కెప్టెన్ సౌల్ క్రెస్పో, మిగ్యుల్ ఫెర్రీరా మరియు అన్వర్ అలీ తూర్పు బెంగాల్ తరపున తమ పెనాల్టీలను గోల్ చేయగా, జేవియర్ సివేరియో, డెజాన్ డ్రాజిక్, ముహమ్మద్ నెమిల్, డేవిడ్ టిమోర్ నీది గోవా తరపున గోల్ చేయడంతో మ్యాచ్ సడన్ డెత్‌కు చేరుకుంది. ఉదంత కుమామ్ మరియు సాహిల్ తవోరా ఆతిథ్య జట్టు తరపున తమ పెనాల్టీలను గోల్స్‌గా మార్చగా, తూర్పు బెంగాల్ తరపున హమీద్ అహదద్ గోల్స్ చేశారు, కానీ విష్ణు గోల్స్ చేయడంలో విఫలమయ్యాడు. తూర్పు బెంగాల్‌కు మొదటి అవకాశం 12వ ఆటలో వచ్చింది. మొదటి అర్ధభాగం చివరిలో మహేష్ కు మరో రెండు క్లోజ్ అవకాశాలు వచ్చాయి. 43వ ఆటలో బిపిన్ తో కలిసి రెండోసారి గోల్ చేశాడు. ఆయుష్ ఛెత్రి లాంగ్ రేంజ్ నుండి తన అదృష్టాన్ని ప్రయత్నించినా ఫలించలేదు. 49వ నిమిషంలో తైమూర్ డ్రాజిక్‌ను గోల్ గా మార్చింది. రెండోది ఆఫ్‌సైడ్‌గా మారింది. 81వ నిమిషంలో గౌర్స్ డిఫెండర్ పోల్ మోరెనో దాదాపు గోల్ చేశాడు. సివేరియో రీబౌండ్ నుండి చేసిన ప్రయత్నాన్ని 107వ నిమిషంలో గిల్ పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో సేవ్ చేశాడు. ఈస్ట్ బెంగాల్ గోల్ కీపర్ 114వ నిమిషంలో తైమూర్ హెడర్‌ను పట్టుకుని తన జట్టును పోటీలో నిలుపుకున్నాడు.

### మహిళల ప్రపంచ కప్

## భారత్ ఘన విజయం



**న్యూఢిల్లీ:** ఎఫ్ఐహెచ్ జూనియర్ మహిళల ప్రపంచ కప్ 2025 ప్లేఆఫ్స్‌లో వేల్స్‌ను భారత్ ఓడించింది. సోమవారం శాంటియాగోలోని ఎస్టాడియో నేషనల్‌లోని సెంట్రో డిపోర్టివో డి హాకీ సెస్పెడ్‌లో జరిగిన టోర్నీలో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు తన ప్లేఆఫ్‌లో వేల్స్‌పై 3-1 తేడాతో ఘన విజయం సాధించింది. దూకుడుగా ఆడిన భారత్, తొలి 30 సెకన్లలోనే పెనాల్టీ కార్నర్‌ను సంపాదించింది. గోల్‌ను నియంత్రించుకుని, లైన్ల మధ్య ఆడి రెగ్యులర్ ఓపెనింగ్స్‌ను సృష్టించింది. కానీ ప్రారంభంలోనే స్ట్రైక్ చేయలేకపోయింది. వేల్స్‌కు పెనాల్టీ స్ట్రోక్ ద్వారా ఆధిక్యంలోకి వెళ్లే అవకాశం లభించి గోల్ కీపర్ నిధి పదునైన సేవ్ చేసి స్కోర్‌లను సమం చేశాడు. సాక్షి రాణా రాణించడంతో, 14వ నిమిషంలో హినా బానో ట్యాప్‌ఇన్ ద్వారా తొలి క్వార్టర్ చివరిలో భారత్ ప్రతిష్టంభనను ఛేదించింది. రెండవ క్వార్టర్ వరకు ఒత్తిడి కొనసాగింది. సాక్షి ప్రారంభ ప్రయత్నం సునెలిటా టోప్పో (24)కు దగ్గరగా ముగిసింది. బ్రేక్ తర్వాత వెంటనే వెల్ష్ గోల్ కీపర్ షాట్‌ను పట్టుకోవడంలో విఫలమైన తర్వాత ఇషికా (31) రీబౌండ్‌ను గోల్‌గా మార్చడంతో ఆధిక్యం పెరిగింది. 52వ నిమిషంలో ఎలోయిస్ మోట్ ద్వారా వేల్స్ ఒక గోల్ చేసింది, కానీ భారత్ చివరి దశలను బాగా నిర్వహించి విజయాన్ని ఖాయం చేసింది.



### ప్రపంచ కప్ ఫైనల్..

## సిమ్రాన్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ ఫైనల్‌లో ఒలింపిక్ ఛాంపియన్‌ను ఓడించి సిమ్రాన్‌ప్రీత్ బ్రార్ స్వర్ణంతో మెరిసింది. ఖతార్‌లోని దోహాలో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్ 2025లో 21 ఏళ్ల సిమ్రాన్‌ప్రీత్ కౌర్ బ్రార్ మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె 50 షాట్లలో 41 హిట్‌లతో పారిస్ ఒలింపిక్స్ ఛాంపియన్ దక్షిణ కొరియాకు చెందిన యాంగ్ జీఇన్ జూనియర్ ప్రపంచ రికార్డును కూడా సమం చేసింది. ఫైనల్‌లో, ఆమె తన తొలి మేజర్ సీనియర్ అంతర్జాతీయ బంగారు పతకాన్ని సాధించే మార్గంలో ఎయిర్ పిస్టల్‌లో పారిస్ ఒలింపిక్ ఛాంపియన్ యాంగ్ మరియు ఓహ్ యేజిన్‌లను అధిగమించింది. మరోవైపు, ఈ ఈవెంట్‌లో భారత్ తరపున పోటీ పడిన మరో ఫైనలిస్ట్ ఈషా సింగ్ 25 షాట్‌లలో 15 హిట్‌లతో 7వ స్థానానికి పరిమితమైంది. దీంతో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ రజతం గెలుచుకుంది. ఇక ఈ సీజన్ ఫైనల్‌లో పురుషుల 50 మీటర్ల 3 పొజిషన్స్ ఈవెంట్‌లో రజత పతకంతో అనుభవజ్ఞురాలైన క్రీడాకారిణి ఐశ్వరీ తోమర్ భారత్‌కు మొట్టమొదటి, ఏకైక రైఫిల్ పతకాన్ని గెలుచుకుంది. అతను కొత్తగా ప్రవేశపెట్టిన 50 ఎం 3 పి ఫైనల్స్ ఫార్మాట్‌లో 413.3 స్కోర్‌చేశాడు. ఇంతలో, ఆసియా క్రీడల ఛాంపియన్ సిఫ్ట్‌కౌర్ సమ్రా మరోసారి నిరాశపరిచింది, మహిళల 50 మీటర్ల 3 పాయింట్‌లో 10వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకోలేకపోయింది.

### డబ్ల్యూటిసి పాయింట్లలో..

## అగ్రస్థానంలో ఆస్ట్రేలియా

### టీమిండియా ఔట్..?



**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించడంతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి) పాయింట్ల పట్టికలో పెను మార్పులు చోటుచేసుకుని భారత జట్టు ర్యాంకింగ్స్‌లో కిందకు పడిపోయింది. బ్రిస్బేన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఇంగ్లాండ్‌ను ఎనిమిది వికెట్ల తేడాతో ఓడించి యాషెస్ సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ విజయంతో ఆస్ట్రేలియా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఇంగ్లాండ్ ఏడో స్థానానికి పడిపోయింది. ఈ నిర్ణయాత్మక విజయం ప్రస్తుత డబ్ల్యూటిసి ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసింది. ఆస్ట్రేలియా 2025-27 డబ్ల్యూటిసి స్టాండింగ్స్‌లో 100 శాతం పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వారి ఐదు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది.

ఇంతలో, ఇంగ్లాండ్ ఈ ఓటమితో గణనీయమైన ఓటమిని చవిచూసింది, వారి మునుపటి ఆరవ స్థానం నుండి ఏడవ స్థానానికి పడిపోయింది. మరోపక్క ఆస్ట్రేలియా విజయంతో భారత జట్టుకు పాయింట్ల పట్టికలో భారీ నష్టం వాటిల్లింది. దాయాది దేశం పాకిస్తాన్ జట్టు తర్వాత భారత జట్టు ఏకంగా ఐదోస్థానానికి పడిపోయింది. ఈ సైకిల్‌లో భారత్ ఇప్పటివరకు 9 టెస్టులు ఆడగా, అందులో 4 గెలిచి, 4 ఓడిపోయింది. ఫలితంగా ర్యాంకింగ్స్‌లో వెనుకబడింది. ప్రస్తుత సమీకరణాలను బట్టి చూస్తే, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు జూగిది ఫైనల్ చేరే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆస్ట్రేలియా అద్భుతమైన ఫామ్‌లో ఉండగా, దక్షిణాఫ్రికా కూడా నిలకడగా రాణిస్తోంది. భారత్ ఫైనల్ రేసులో నిలవాలంటే రాబోయే టెస్టుల్లో అద్భుత ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. స్వదేశంలో భారత్‌కు దారుణమైన ఓటమిని చవిచూసింది. గౌహతి టెస్ట్‌ను దక్షిణాఫ్రికా 408 పరుగుల తేడాతో గెలిచింది. రెండు మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను వైట్‌వాష్ చేసింది. కోల్‌కతా టెస్ట్‌ను దక్షిణాఫ్రికా 30 పరుగుల తేడాతో గెలిచిన బావుమా నేతృత్వంలోని ప్రొటీస్ జట్టు గౌహతి టెస్టులో భారత్‌కు 549 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో భారత్‌ను 140 పరుగులకు ఆలౌట్ చేసి 408 పరుగుల తేడాతో సిరీస్‌ను గెలిచింది. ఇది టెస్ట్ క్రికెట్‌లో, స్వదేశంలో పరుగుల పరంగా భారత్‌కు అతిపెద్ద ఓటమి. ఇక శ్రీలంక పాయింట్ల పట్టికలో మూడోస్థానంలో కొనసాగుతున్నది. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

## మూడోసారి చైనాకు వరల్డ్ కప్ టైటిల్

**న్యూఢిల్లీ:** వరుసగా మూడోసారి ఐటీటీఎఫ్ మిక్స్‌డ్ టీమ్ ప్రపంచ కప్ టైటిల్-2025ను చైనా గెలుచుకుంది. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య మిక్స్‌డ్ టీమ్ ప్రపంచ కప్‌లో చైనా 8-1 తేడాతో జపాన్‌ను ఓడించి వరుసగా మూడోసారి టైటిల్‌ను గెలుచుకుంది. అంతకుముందు జరిగిన సెమీఫైనల్లో దక్షిణ కొరియా, జర్మనీలను ఓడించిన తర్వాత చైనా, జపాన్ తుది పోరుకు సిద్ధమైంది. బెస్ట్‌ఆఫ్ 15 ఫైనల్లో, చైనా జంట వాంగ్ చుకిన్-సన్ యింగ్షా మిక్స్‌డ్ డబుల్స్‌లో సోరా మట్సుషిమా-సత్సుకి ఓడోపై 11-4, 11-4, 11-6 తేడాతో విజయం సాధించారు. ఆ తర్వాత మహిళల సింగిల్స్‌లో వాంగ్ మాన్యు 11-6, 11-7, 11-6 తేడాతో మివా హరిమోటోను ఓడించి చైనా ఆధిక్యాన్ని 6-0కి పెంచడంలో సహాయపడింది. ఆ తర్వాత పురుషుల సింగిల్స్‌లో చైనాకు చెందిన లిన్ షిడోంగ్ 6-11, 11-5, 11-6 తేడాతో టోమోకాజు హరిమోటోను ఓడించి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు.

## ఐబిపిఎల్ విన్నర్ ముంబై స్మాషర్స్

### ఫైనల్‌లో 5-1తేడాతో హైదరాబాద్ రాయల్స్ ఓటమి




**హైదరాబాద్, డిసెంబరు 8,ప్రభాతవార్త:** ఇండియన్ పికిల్‌బాల్ లీగ్ (ఐబీపీఎల్)లో ముంబై స్మాషర్స్ విజేతగా నిలిచింది. గ్రాండ్ ఫైనల్‌లో స్మాషర్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ గుర్తింపుతో జరిగిన ఈ లీగ్ టైటిల్ పోరులో ముంబై జట్టు 5-1 తేడాతో హైదరాబాద్ రాయల్స్‌ను చిత్తు చేసింది. లీగ్ దశలో ఆరో స్థానంలో నిలిచి, చివరి మ్యాచ్ వరకు ఒక్క విజయం కూడా లేని ముంబై, నాకౌట్ దశలో వరుస విజయాలతో అనూహ్యంగా ఫైనల్ చేరి ఛాంపియన్‌గా నిలవడం విశేషం. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సమక్షంలో కేడీ జాదవ్ ఇండోర్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై తమ సత్తా చాటింది. ముంబై స్టార్ ప్లేయర్ క్వాంగ్ డుయోంగ్ సింగిల్స్‌లో తేజస్ గులాటిని, డబుల్స్‌లో అమోల్ రామ్‌చందానీతో కలిసి హైదరాబాద్ జోడీని ఓడించి జట్టుకు 20 ఆధిక్యాన్ని అందించారు. నిర్ణయాత్మకమైన గ్రాండ్ ర్యాలీలో కూడా ముంబై 21-14 స్కోరుతో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. లీగ్ ఆద్యంతం అద్భుతంగా రాణించిన క్వాంగ్ డుయోంగ్ పురుషుల విభాగంలో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ (ఎంవీపీ) బెస్ట్ సింగిల్స్ ప్లేయర్‌గా నిలవగా, మేగన్ ఫడ్జ్ మహిళల ఎంవీపీ అవార్డును దక్కించుకున్నారు.

## మార్కెట్లకు ఫెడ్‌రిజర్వు భయాలు!

### ఒక్కరోజే బిఎస్ఇలో రూ.7 లక్షలకోట్లు నష్టం

### భారీ నష్టాలతో ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ




**ముంబయి, డిసెంబరు 8:** ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్ల భయాలతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులు భారీగా విత్‌డ్రా చేయడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలను చవిచూశాయి. ఈ వారం వెలువడనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయంపై ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడం, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలు కొనసాగించడంతో అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు భారీగా పతనమయ్యాయి. ఒక్కరోజులోనే బిఎస్ఇలో లిస్ట్ అయిన కంపెనీలవిలువ సుమారు రూ.7 లక్షలకోట్లు ఆవిరి అయింది. రూ.463 లక్షలకోట్లకు క్షీణించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బిఎస్ఇ సెన్సెక్స్ 609.68 పాయింట్లు నష్టపోయి 85,102.69 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో 84,875.59 కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 225.90 పాయింట్లు క్షీణించి 25,960.55 వద్ద ముగిసింది. ఈ వారం యూఎస్ ఫెడ్ పాలసీ నిర్ణయం ఉండటంతో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. దేశీయ వృద్ధి గణాంకాలు బలంగా ఉన్నప్పటికీ, ఆర్బీఐ వడ్డీ రేట్లు తగ్గించినా.. అంతర్జాతీయ ద్రవ్య విధాన ఆందోళనలు, ఎడతెరిపిలేని ఎఫ్ఐఐల అమ్మకాలు, రూపాయి బలహీనత వంటివి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. జపాన్ బాండ్ల అంశం కూడా ఆందోళనను మరింత పెంచిందన్నారు. సెన్సెక్స్ 30 షేర్లలో టెక్ మహీంద్రా మినహా మిగిలినవన్నీ నష్టాల్లోనే ముగిశాయి. టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, టాటా మోటార్స్, టైటాన్, ఎన్‌టిపిసి, కోటక్ బ్యాంక్ వంటివి ప్రధానంగా నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంక్, ఆటో, ఎఫ్ఎంసిజి, ఐటి సూచీలన్నీ పతనమయ్యాయి. బ్రాడర్ మార్కెట్‌లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.61 శాతం, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.83 శాతం మేర పడిపోయాయి. మరోవైపు, డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి 90.06 వద్ద స్థిరపడింది. ఈ వారంలో వెలువడనున్న ఫెడ్ పాలసీ, భారత ద్రవ్యోల్బణ గణాంకాల నేపథ్యంలో మార్కెట్లలో అస్థిరత కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 1.73శాతం, స్మాల్‌క్యాప్ సూచీలు 2.20శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో 950 షేర్లు లాభాలతో ముగిస్తే 3348 కంపెనీలషేర్లు పతనం అయ్యాయి. మరో 198 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. ఇక ఎంసిఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ రూ.1.30, 584వద్ద స్థిరపడింది. బ్రెంట్‌ముడిచమురు బ్యారెల్ ఒక్కంటికి 8 సెంట్లు పెరిగి 63.83 డాలర్లుగా కొనసాగాయి.

## స్టార్‌లింక్ సేవలు షురూ!

### నెలవారీ చందా రూ.8600 మాత్రమే!




**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ శాటిలైట్ వ్యవస్థ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు భారత్‌లో రంగం సిద్ధమైంది. ఇప్పటికే మన దేశానికి చెందిన జియో, ఎయిర్‌టెల్‌తో స్టార్‌లింక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలి సిందే. త్వరలో ఇండియాలో కమర్షియల్ సేవలు అందించేందుకు సంస్థ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానేనెలవారీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధరలను సంస్థ తాజాగా వెల్లడించింది. స్టార్‌లింగ్ ఇండియా వెబ్‌సైట్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ సేవలు పొందాలంటే రెసిడెన్షియల్ కస్టమర్లు నెలకు రూ.8,600 చెల్లించాల్సి ఉంటుంది. హార్డ్‌వేర్ కిట్‌కు అదనంగా రూ.34వేలు చెల్లించాలి. ఈప్యాకేజీలో సాటిలైట్ డిష్, వైఫై రౌటర్, మౌంటింగ్ స్టాండ్, కేబుల్స్, పవర్ అడాప్టర్‌తో కూడిన ప్లగ్‌అండ్‌ప్లే కిట్ వినియోగదారులకు ఇవ్వనున్నారు. ఈప్లాన్‌లో అపరిమిత డేటాతోపాటు 30 రోజులపాటుఫ్రీ ట్రయల్‌ను ఆస్వాదించొచ్చు. 99.9 శాతం కంటే ఎక్కువ నెట్‌వర్క్ అప్‌టైమ్‌తో ఎలాంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనైనా నిర్విరామంగా ఇంటర్నెట్‌సేవలు అందుబాటులో ఉంటాయి. వినియోగదారులు దీన్ని కొనుగోలు చేసిన వెంటనే ప్లగ్‌ఇన్ చేసి సేవలను ప్రారంభిం చొచ్చు. అయితే బిజినెస్‌కేటగిరీ చందాలు వివరాలు వెల్లడించలేదు. బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంకల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నట్లు వెబ్‌సైట్‌లో చూపుతోంది. ముందుగా హైదరాబాద్, చండీగఢ్, కోల్‌కత్తా, లక్నో, ముంబయి, నోయిడా వంటినగరాల్లో గేట్‌వే ఎర్త్‌స్టేషన్లను స్పేస్ ఎక్స్ ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించింది.

## ఆనాణేలన్నీ చెల్లుబాటవుతాయ్

### వీడియో విడుదలచేసిన ఆర్బీఐ



**ముంబయి, డిసెంబరు 8:** 50 పైసల నాణేంతో సహా వివిధ విలువలు కలిగిన నాణేలు,నోట్లు చలామణిలోఉన్నాయని భారత రిజర్వుబ్యాంకు స్పష్టం చేసింది. నకిలీ నోట్ల గుర్తింపు, కరెన్సీకి సంబంధించిన అపోహల గురించి ప్రజలకు ఆర్బీఐ ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఉంటుంది. తాజాగా, నాణేలపై ప్రజల నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసే ప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా వాట్సాప్‌ద్వారా వ్యక్తిగతసందేశాలు పంపుతోంది. నాణేలపై అవగాహన కల్పిస్తూ ఒక వీడియోను రూపొందించింది. ఈ వీడియో ప్రకారం, ఒక కొనుగోలుదారు రూ.10నాణేన్ని తీసుకువస్తే, దుకాణదారు అది చెల్లదని చెబుతాడు. అయితే ఆనాణేలు చెల్లుబాటు అవుతాయని కొనుగోలుదారుడు దుకాణదారుకు సమాధానమిస్తాడు. చివరగా, అన్నీ నాణేలు చెల్లుబాటు అవుతాయని రూ.10నాణేంతో మాట్లాడిస్తున్నట్లుగా ఈ వీడియో ఉంటుంది. నాణేలు వేర్వేరు డిజైన్‌లతో ఉన్నప్పటికీ అవన్నీ చలామణిలో ఉన్నాయని ఆర్బీఐ ఈ వీడియో ద్వారా స్పష్టం చేసింది. 50పైసలు, రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 నాణేలు అన్నీ చెల్లుబాటు అవుతాయని ఆర్బీఐ తెలిపింది. నాణేల గురించి తప్పుదోవపట్టించే సమాచారంలేదా వదంతులను నమ్మవద్దని సూచించింది.

## రిజర్వేషన్ వ్యవస్థలో ఎయిరిండియా మార్పులు




**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** విమానయాన సంస్థ ఇండిగోలో కార్యకలాపాలు నిలిచిపోయి, విమానాలు రద్దు కావడంతో టికెట్ ధరలు అమాంతం పెరిగాయి. ఈ పరిణామంపై స్పందించిన పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఎకానమీ క్లాస్ టికెట్ ధరలపై పరిమితులు విధిస్తూ 6న ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఎయిర్ ఇండియా గ్రూప్ తమ రిజర్వేషన్ సిస్టమ్స్‌లో కొత్త ధరల విధానాన్ని అమలు చేయడం ప్రారంభించింది. ఇప్పటికే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఈ మార్పులను పూర్తి చేయగా, ఎయిర్ ఇండియా విమానాల్లో కూడా అన్ని బుకింగ్ ఛానళ్లలో కొత్త ధరలను క్రమంగా అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించింది. మరికొన్ని గంటల్లో ఈ మార్పులు అన్ని సిస్టమ్స్‌లో కనిపిస్తాయని తెలిపింది. థర్డ్‌పార్టీ రిజర్వేషన్ ప్లాట్‌ఫామ్‌లతో సమన్వయం చేసుకోవాల్సి ఉన్నందున, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దశలవారీగా ఈ ప్రక్రియను అమలు చేస్తున్నామని ఎయిర్ ఇండియా వివరించింది. ఈ మార్పుల సమయంలో, ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ బేస్ ఫేర్‌తో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు అదనంగా చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని కూడా ఎయిర్ ఇండియా స్పష్టం చేసింది. ఇండిగో సంక్షోభం తర్వాత విమానయాన సంస్థల ధరలపై ప్రభుత్వం నిఘా పెట్టింది. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు టికెట్ ధరలను అదుపులో ఉంచాలని అన్ని సంస్థలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## నిలకడగా పసిడి, వెండి ధరలు

**ముంబయి, డిసెంబరు 8:** కొంతకాలంగా పెరుగుతున్న బంగారం ధరలకు సోమవారం స్వస్తి పలికింది. దేశీయ మార్కెట్లో పసిడి ధరలు స్థిరంగా కొనసాగుతుండగా, వెండి ధర స్వల్పంగా పెరిగింది. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. దీనికి తోడు డాలర్‌తో రూపాయి మారకం విలువ క్షీణించడం కూడా పసిడి ధరలు అధిక స్థాయిలో నిలకడగా ఉండటానికి కారణంగా భావిస్తు న్నారు. సోమవారం ఉదయం మార్కెట్ ధరప్రకారం హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,30,140 వద్ద స్థిరంగా ఉంది. అదేవిధంగా, 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,19,300గా కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి రూ. 1,30,290 పలుకుతుండగా, 22క్యారెట్ల బంగారం రూ.1,19,440 వద్ద ఉంది. ముంబై, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో కూడా దాదాపు ఇవేధరలు కొనసాగుతున్నాయి. మరోవైపు వెండిధరలో స్వల్ప పెరుగుదల కనిపించింది. నిన్నటితోపోలిస్తే కేజీ వెండిపై రూ.100 పెరిగింది. దీంతో హైదరాబాద్, విజయవాడలలో కేజీ వెండిధరరూ.1,95,800కి చేరింది. అయితే ఢిల్లీ, ముంబైలలో దీని ధర రూ. 1,89,900గా ఉంది. బంగారం, వెండి ధరలు ప్రాంతాన్ని బట్టి, పన్నులను బట్టి మారుతుంటాయి. కొనుగోలుదారులు గమనించి, తాజా ధరలను తెలుసుకున్న తర్వాతే కొనుగోలు చేయడం మంచిది.

## ఐటి రిఫండ్‌లపై అపోహలు వద్దు

### సిబిడిటి చీఫ్ రవి అగర్వాల్




**న్యూఢిల్లీ, డిసెంబరు 8:** ఐటీ రిటర్న్ ఫైల్ చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ చాలామందికి రిఫండ్ రాలేదు. నిత్యం కొన్ని వేల మంది ఇంకా రిఫండ్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఐటీ రిటర్న్ కోసం దాఖలు చేసిన వివరాలను సరిచూసుకుని అధికంగా కట్టిన మొత్తాన్ని పన్నుదారుడికి తిరిగివ్వడం చాలా పెద్ద ప్రక్రియ అని సిబిటిడి చీఫ్ రవి అగర్వాల్ తెలిపారు. రిటర్న్ ఫైలింగ్‌లో పేర్కొన్న లావాదేవీలను పరిశీలించడం, సరిచూసుకోవడానికి కొంత ఆలస్యం జరగడం సాధారణమేనని చెప్పారు. పెద్ద మొత్తంలో రిటర్న్ కోసం దాఖలు చేసిన వాటిని, అనుమానిత వ్యవహారాలను మరింత నిశితంగా పరిశీలించాల్సి వస్తుందన్నారు. అయితే, ఈ నెలాఖరులోగా అందరికీ టాక్స్ రిఫండ్ చేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రిటర్న్ కోసం ఫైలింగ్ చేసినప్పుడు పన్నుదారుడు చేసే ఐదు పొరపాట్ల కారణంగా కూడా రిఫండ్ ఆలస్యం కావొచ్చని ఆయన చెప్పారు. రిఫండ్ కోసం ఎదురుచూస్తుండడం కాకుండా పొరపాట్లు ఉన్నాయా అనేది చెక్ చేసుకోవాలని, ఐటీ శాఖనుంచి వచ్చే మెయిల్స్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించారు. ఐటీఆర్ ఫైలింగ్‌లో చాలామంది చేసే సాధారణ పొరపాటు బ్యాంకు ఖాతా వివరాల్లో తప్పులు.

ఖాతా నెంబర్ కానీ, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పుగా ఎంటర్ చేయడం వల్ల కానీ రిఫండ్ ఆలస్యమవుతుంది. బ్యాంకు ఖాతాలోని పేరుకు, పాన్ కార్డు మీద ఉన్న పేరు సరిగ్గా మ్యాచ్ కాకపోతే రిఫండ్ ఆలస్యమవుతుంది. ఇన్ కంటాక్స్ పోర్టల్‌లో ప్రి వాలిడేట్ అయిన బ్యాంకు ఖాతాల్లోనే రిఫండ్ జమవుతుంది. ప్రి వాలిడేట్ కాని ఖాతాల విషయంలో రిఫండ్ ఆగిపోతుంది. పాన్ కార్డ్‌ను ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవడం తప్పనిసరి. కార్డులను లింక్ చేయని ఖాతాదారులకు చెల్లించాల్సిన రిఫండ్‌ను ఐటీ శాఖ విత్ హోల్డ్ చేస్తుంది. రిఫండ్ కోసం దాఖలు చేసిన మొత్తాన్ని లెక్కించడంలో పొరపాటు చేసినా, మినహాయింపు కోరిన లావాదేవీలు వాలిడ్ కాకపోయినా రిఫండ్‌ను ఆపేసి అధికారులు విచారణ చేపడతారు. ఇన్ కం టాక్స్ ఇ ఫైలింగ్ పోర్టల్‌లోకి వెళ్లి యూజర్ ఐడీ, పాస్ వర్డ్‌తో లాగిన్ కావాలి. ఇ ఫైల్ సెక్షన్‌లో ఇన్‌కంటాక్స్ రిటర్న్‌పై క్లిక్ చేసి వ్యూ ఫైల్డ్ రిటర్న్‌ను సెలక్ట్ చేయాలి. అక్కడ అసెస్‌మెంట్ ఇయర్ ఆధారంగా రిఫండ్ స్టేటస్ చెక్ చేసుకోవచ్చు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14